
'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15

సంచిక: 307

శనివారం 28-1-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



7 సుందరమైన పార్కులు, 40,000 Sq.Ft. విలాసవంతమైన క్లబ్‌హౌస్

పార్క్ 1 - క్రికెట్ & బ్యాడ్మింటన్ అకాడమీ
1 అరైవల్ కోర్ట్
2 క్రికెట్ నెట్ ప్రాక్టీస్
3 మల్టీపర్పస్ గ్రౌండ్
4 రిఫ్రెష్‌మెంట్ కియోస్క్
5 బ్యాడ్మింటన్ కోర్టులు (5)
6 ప్రేక్షకుల డెక్

పార్క్ 2 - పిల్లల ప్రాంగణం
7 ఇసుక పిట్
8 పిల్లల స్ప్రింగ్ రిడ్డర్
9 పిల్లల డూడుల్ కార్నర్
10 పిల్లల స్ప్లాష్ ప్యాడ్
11 పిల్లల మేజ్
12 పిల్లల స్వింగ్
13 పిల్లల మంకీ బార్
14 పిల్లల హాప్‌స్కాచ్
15 జంగిల్ జిమ్
16 గాగా బాల్ పిట్
17 ట్రామ్పోలిన్ పార్క్
18 రాక్ క్లైంబింగ్ వాల్
19 రోప్ వంతెన
20 జిప్‌లైన్
21 రోలర్ స్కేటింగ్ రింక్
22 పిల్లల సైకిల్ స్టేషన్
23 పిల్లల సైక్లింగ్ ట్రాక్
24 పెబుల్ పిట్

పార్క్ 3 - క్రీడలు & ఫిట్‌నెస్ ప్రాంగణం
25 అవుట్‌డోర్ జిమ్
26 HIIT వర్కౌట్ జోన్
27 యోగా కబానాస్
28 జాగింగ్ ట్రాక్
29 అరోమా గార్డెన్
30 ప్రాణ హీలింగ్ కేంద్రం
31 చెస్ గార్డెన్
32 పెద్దల స్వింగ్ పార్క్

పార్క్ 4 - పెద్దల ప్రాంగణం
33 ధ్యానం చేయు స్థలం
34 లాఫింగ్ పార్క్
35 లాన్ బౌల్
36 పెంపుడు జంతువుల జోన్
37 క్రోకెట్
38 గెజిబో
39 రిఫ్లెక్సాలజీ మార్గం
40 హెర్బల్ గార్డెన్

పార్క్ 5 - ప్రత్యేక క్రీడా స్థలాలు
41 త్రోబాల్
42 టెన్నిస్ కోర్ట్
43 కబడ్డీ కోర్ట్
44 బాస్కెట్‌బాల్ కోర్ట్
45 వీక్షణ గ్యాలరీ
46 వాలీబాల్ కోర్ట్
47 ఖో ఖో కోర్ట్
48 అవుట్‌డోర్ టేబుల్ టెన్నిస్
49 100 మీ. రన్నింగ్ ట్రాక్
50 లాంగ్ జంప్ పిట్

పార్క్ 6 - వినోద ప్రాంగణం
51 ఈత కొలను
52 డెక్ లాంజ్
53 పిల్లల ఈత కొలను
54 అవుట్‌డోర్ పార్టీ లాన్
55 బార్బెక్యూ కార్నర్
56 అల్ఫ్రెస్కో
57 డిజె కన్సోల్
58 డ్యాన్స్ ఫ్లోర్
59 గ్రాఫిటీ కార్నర్
60 యాంఫీథియేటర్
61 బాన్‌ఫైర్ పిట్
62 సేక్రెడ్ వాల్ ఆర్ట్
63 లోటస్ / మిరాజ్ పాండ్
64 హామాక్ గార్డెన్
65 కన్వెషన్ కియోస్క్
66 అవుట్‌డోర్ థియేటర్

పార్క్ 7 - గోల్ఫ్ పార్క్
67 మినీ గోల్ఫ్ పార్క్
68 ఆటగాళ్ళ విశ్రాంతి కియోస్క్

క్లబ్‌హౌస్
69 కెఫెటేరియా
70 ఫార్మసీ
71 ఫౌంటెన్ ఆఫ్ లైట్
72 బ్యూటీ సెలూన్
73 క్రెష్
74 లాండ్రోమాట్
75 వెయిటింగ్ లాంజ్
76 రెస్టో బార్
77 జిమ్
78 ఏరోబిక్స్
79 జుంబా స్టూడియో
80 ఫిజియోథెరపీ హెల్త్ కార్నర్
81 స్టీమ్
82 సౌనా
83 జాకుజీ
84 లాకర్లు కలిగిన చేయింజింగ్ రూమ్
85 ఇండోర్ గేమ్స్ - క్యారమ్, చెస్, టేబుల్ టెన్నిస్
86 బిలియర్డ్స్
87 పిల్లల అమ్యూజ్‌మెంట్ ఆర్కేడ్
88 పిల్లల బాల్ పూల్ & క్యూబ్ పిట్
89 పసిపిల్లల గది
90 పిల్లల ఆర్చరీ / గన్ షూటింగ్ రూమ్
91 స్క్వాష్ కోర్ట్
92 రాకెట్‌బాల్ కోర్ట్
93 బాంక్వెట్ హాల్
94 ప్రైవేట్ ఈవెంట్ / శిక్షణ / మీటింగ్ హాల్
95 థియేటర్
96 గ్రంథాలయం
97 రీడింగ్ లాంజ్
98 గెస్ట్ సూట్‌లు
99 స్టార్ గేజింగ్ డెక్
100 వాల్ అక్వేరియం
101 వర్చువల్ రియాలిటీ గేమింగ్ హబ్









ఇద్దరు క్రీడా దిగ్గజాలచే స్థాపించబడిన **ప్రత్యేక అకాడమీలలో** భాగం కండి



MICHAEL PHELPS Swimming
by MICHAEL PHELPS

అత్యుత్తమమైన ఇన్స్ట్రక్టర్ మరియు సాటిలేని ట్రైనింగ్ ప్రోగ్రాం సహాయంతో ఈతలో రాణించండి



GAME CHANGERZ ACADEMY
by DINESH KARTHIK

ఈ విఖ్యాత అకాడమీ అద్భుత శిక్షణతో క్రికెట్ క్రీడలో రాణించండి

*T&C Apply


Market Price (ఎల్.బి.నగర్ & బి.ఎన్.రెడ్డి నగర్‌లో)	G Square ప్రారంభ ధర	G Square ప్రత్యేక ఆఫర్ ధర
~~₹2.3Crs.~~ 267 Sq.Yd.	~~₹2Crs.~~ 267 Sq.Yd.	₹1.92Crs.* 267 Sq.Yd. (మొదటి 10 బుకింగ్స్‌కు - ఈరోజు మాత్రమే)

Price Table

Size Range (Sq.Yd.)	Neighbourhood Market Price (LB Nagar / BN Reddy Nagar)	G Square Launch Price	G Square Early Bird Price
267 - 290	2.3 Crs. - 2.5 Crs.	2 Crs. - 2.2 Crs.	1.92 Crs. - 2.1 Crs.
290 - 320	2.5 Crs. - 2.7 Crs.	2.2 Crs. - 2.4 Crs.	2.1 Crs. - 2.3 Crs.
320 - 350	2.7 Crs. - 2.9 Crs.	2.4 Crs. - 2.6 Crs.	2.3 Crs. - 2.5 Crs.

Scan Code for Brochure

Location Map




TS RERA No: P02400004553

సైట్ విసిట్‌కై క్యాబ్ సౌకర్యం కలదు
89392 68000
www.gsquarehousing.com

Project approved by
ICICI Bank | HDFC | YES BANK | SUNDARAM FINANCE Enduring values. New age thinking. | TATA CAPITAL

G SQUARE GROUP
YOUR PLOT. YOUR HOME. YOUR WAY.

marks+methods


'బీడుబడిన భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 307

శనివారం 28-1-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




భారత్ జోరుకు బ్రేక్

న్యూజిలాండ్‌తో తొలి టి20లో టీమిండియా పరాజయం -13లో



3 నెలల కనిష్టానికి సూచీలు

సెన్సెక్స్ 874 పాయింట్లు క్రాష్. 287 పాయింట్లు క్షీణించిన నిఫ్టీ -13లో



అడ్డదారులను నమ్మితే కష్టాలే

పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు షార్ట్‌కట్స్ (అడ్డదారులు) కాకుండా తెలివితేటలను నమ్ముకోవాలని ప్రధాని మోదీ సూచించారు.

- వివరాలు 6లో▶



'సింధు' ఒప్పందాన్ని మారుద్దాం

ఇరు దేశాల మధ్య ఏళ్ల క్రితం కుదిరిన సింధు నదీ జలాల పంపిణీ ఒప్పందాన్ని సవరించాలంటూ పాక్‌కు భారత్ నోటీసులు పంపింది.

- వివరాలు 6లో▶



2 రోజులు.. రూ. 200 కోట్లపైనే

షారూక్‌ఖాన్, దీపికా పదుకోన్ నటించిన 'పఠాన్'.. విడుదలైన తొలి రెండ్రోజుల్లోనే రూ.200 కోట్లకుపైగా వసూలు చేసింది.

- వివరాలు 6లో▶



భారత్ - చైనా మధ్య మరిన్ని...

సరిహద్దుల్లో చైనా కొత్త సైనిక స్థావరాల ఏర్పాటుతో భారత్–చైనా సైనికుల మధ్య మరిన్ని ఘర్షణలు జరగవచ్చని ఓ నివేదిక పేర్కొంది.

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

లోకేశ్ పాదయాత్రలో తారకరత్నకు గుండెపోటు



టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ ప్రారంభించిన పాదయాత్రలో ఆదిలోనే అపశ్రుతి చోటుచేసుకుంది. లోకేశ్‌తో పాటు పాదయాత్రలో పాల్గొన్న ఎన్టీరామారావు మనవడు తారకరత్న గుండెపోటుతో ఆస్పత్రిలో చేరారు. నాటకీయ పరిణామాల మధ్య ఆయనను బెంగళూరుకు తరలించారు.

- వివరాలు 10లో▶

ఇందిరమ్మ ఇళ్లు లేని ఊళ్లో ఓట్లడగను



ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో తాము ఓట్లు అడగమని, మరి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వని గ్రామాల్లో మీరు ఓటు అడగకుండా ఉంటారా అని మంత్రి కేటీఆర్‌కు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. రాహుల్ సందేశాన్ని ప్రతి ఇంటికీ చేర్చేందుకు 'హాథ్‌సే హాథ్ జోడో' యాత్ర చేపట్టామన్నారు.

- వివరాలు 2లో▶

మళ్లీ బీజేపీలోకి రండి

పార్టీని వీడిన నేతలకు బండి సంజయ్ పిలుపు

- వివరాలు 2లో▶



అలనాటి తార జమున కన్నుమూత

తెలుగువారి సత్యభామగా ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసిన జమున (86) ఇక లేరు. వయోభారం, అనారోగ్య కారణాలతో హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెం. 12 లోని తన స్వగృహంలో శుక్రవారం ఉదయం 7.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. అమెరికాలో ఉంటున్న కుమారుడు వంశీకృష్ణ హైదరాబాద్ చేరడానికి ఆలస్యం కావడంతో కుమార్తె స్రవంతి అంత్యక్రియలు నిర్వహించారు.

- జమున 1936 ఆగస్టు 30న నిప్పాణి శ్రీనివాసరావు, కౌసల్యాదేవి దంపతులకు హంపిలో జన్మించారు. 'ఢిల్లీ చలో'నాటకంలో తొలిసారి వసుంధర అనే పాత్ర వేశారు. అనంతరం 'జై వీర భేతాళ'అనే సినిమాలో హీరోయిన్‌గా ఆమెకు అవకాశం వచ్చింది. అయితే ఆ సినిమా ఆగిపోయింది. ఆ తర్వాత 'పుట్టిల్లు' సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఆ తర్వాత ఎన్టీఆర్, ఏఎన్ఆర్, జగ్గయ్య వంటి అగ్రహీరోల సరసన కథానాయికగా నటించారు. దాదాపు 200 సినిమాల్లో ఎన్నో పాత్రల్లో జమున నటించినా బాగా పేరు తెచ్చింది సత్యభామ పాత్ర. 'సంతోషం, మిస్సమ్మ, చిరంజీవులు, తెనాలి రామకృష్ణుడు, దొంగరాముడు, బంగారు పాప, వద్దంటే డబ్బు, చింతామణి, భూకైలాస్, భాగ్యరేఖ, గుండమ్మకథ'వంటి పలు హిట్ చిత్రాల్లో ఆమె నటించారు. 'తెలుగు ఆర్టిస్ట్స్ అసోసియేషన్'అనే సంస్థ నెలకొల్పి 25 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. -12లో

అలిగితివా సత్యభామ..

నన్ను దోచుకొందువటే..

జమున హిట్ సాంగ్స్‌లో కొన్ని..

నన్ను ఏడిపించేశావ్ కాంచీ అన్నారు

- నటి కాంచన

- వివరాలు 11,12లో▶

రైతులూ చట్టసభల్లోకి..

ఎమ్మెల్యేలు, ఎంపీలుగా వెళ్లాలి • ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు

- రైతులు తమ హక్కుల కోసం 13 నెలలు ఆందోళన చేయాల్సిన పరిస్థితి మరే దేశంలోనైనా ఉంటుందా?
- ఇంత చేసినా కేంద్రం నుంచి ఎలాంటి భరోసా లభించలేదు
- అందుకే బీఆర్ఎస్ 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' నినాదం..
- నేడు దేశం తన లక్ష్యాన్ని కోల్పోయింది
- జాతి, మతం పేరిట చిచ్చుపెడుతూ ప్రజలను విభజిస్తున్నారు
- పాలకులకు ధన్ కీ బాత్ కాదు.. మన్ కీ బాత్ ఉండాలి
- దేశ భవిష్యత్తు, భావజాలాన్ని మార్చే సంకల్పంతోనే బీఆర్ఎస్ ఆవిర్భవించిందని స్పష్టీకరణ
- బీఆర్ఎస్‌లో చేరిన ఒడిశా మాజీ సీఎం గిరిధర్ గమాంగ్ దంపతులు.. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు కూడా..

2లో



ఒడిశా నేతల చేరిక సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో గిరిధర్ గమాంగ్, శిశిర్ గమాంగ్ తదితరులు

29న బీఆర్ఎస్ పార్లమెంటరీ భేటీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించే అంశాలపై దిశానిర్దేశం చేయనున్న కేసీఆర్ - 2లో



2,225 పోస్టుల భర్తీ

గురుకుల నియామకాల బోర్డు ద్వారా భర్తీకి ప్రభుత్వ ఆదేశం..

ఆర్థిక శాఖ అనుమతి

సమాచార పౌరసంబంధాల శాఖ పరిధిలో 166 పోస్టుల భర్తీకీ ఓకే..

వీటిని టీఎస్‌పీఎస్సీ ద్వారా రిక్రూట్ చేయాలని ఆదేశం

స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీ బాధ్యత టీఎంహెచ్ఎస్ఆర్‌బీకి..

సాక్షి, హైదరాబాద్

గురుకుల విద్యాసంస్థల్లో మరిన్ని పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతులు జారీ చేసింది. ఇప్పటికే 9,096 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులివ్వగా... వీటి భర్తీకి సంబంధించిన ఏర్పాట్లను గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) పూర్తి చేసింది. తాజాగా మరో 2,225 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతులిచ్చింది. ఈమేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో బీసీ గురుకుల పాఠశాలలకు సంబంధించి 2,132 పోస్టులకుగాను ఐదు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేయగా... జనరల్ గురుకులాల పరిధిలో 93 ఉద్యోగాలకు మరో జీఓ జారీచేశారు. అలాగే, సమాచార, పౌరసంబంధాల శాఖ పరిధిలో

మిగతా 3వ పేజీలో ▶



తలమడుగు సబ్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో చేస్తున్న రైతులు

ఎప్పుడొస్తుందో..పోతుందో..

'24 గంటల విద్యుత్ సరఫరా అంటున్నారు. 5– 8 గంటలు కూడా రావట్లే'దంటూ శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలోని తాంసి, తలమడుగు, బజార్‌హత్నూర్, ఇచ్చోడ విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. - 3లో

బంగారు భారతాన్ని నిర్మిద్దాం



- తెలంగాణ ప్రజలకు రాహుల్ సందేశం సిద్ధం
- సందేశంతో పాటు బీజేపీ, బీఆర్ఎస్ వైఫల్యాలపై నాలుగు పేజీల కరపత్రం
- హాథ్ సే హాథ్ జోడోలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి గడపకూ పంపిణీ
- ఫిబ్రవరి 6న భద్రాచలంలో అట్టహాసంగా ప్రారంభం!

- వివరాలు 2లో▶

50 వేల మంది టీచర్లకు బదిలీ!



- అనివార్యంగా బదిలీ కావలసిన వారు 25 వేలమంది
- ఐదేళ్లుగా ఒకే స్కూల్‌లో పనిచేస్తున్నవారు 25 వేల మంది
- బదిలీల్లో పైరవీలపై సంఘాల ఆగ్రహం
- పదోన్నతులు, బదిలీలపై మంత్రి సబిత సమీక్ష

- వివరాలు 3లో▶

క్లుప్తంగా...

నియామకాలపై గవర్నర్ తీరు బాధాకరం

విద్యాశాఖ మంత్రి సబిత



పహాడీషరీఫ్: యూనివర్సిటీ నియామకాలపై గవర్నర్ తమిళిసై స్పందించిన తీరు చూస్తుంటే బాధగా ఉందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి వ్యాఖ్యానించారు. రంగారెడ్డి జిల్లా పహాడీ షరీఫ్‌లో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమం లో ఆమె మాట్లాడారు. యూనివర్సిటీల్లో మౌలిక వసతులు ఉంటే సరిపోతుందంటూ గవర్నర్ వ్యాఖ్యానించడం అభ్యంతరకరమ న్నారు. రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని గవర్నర్‌కు ఫైలు పంపించి ఐదు నెలలు కావస్తున్నా.. ఇంతవరకు ఆమోదించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. యూనివర్సిటీల్లో మౌలిక వసతులు మాత్రమే ఉంటే సరిపోదని.. బోధనకు ప్రొఫెసర్లు కూడా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు.

గవర్నర్, సీఎం మధ్య సయోధ్య కుదర్చండి

రాష్ట్రపతికి టీపీసీసీ నేత నిరంజన్ లేఖ



సాక్షి, హైదరాబాద్: పదవుల్లో ఉన్న వ్యక్తుల మధ్య విభేదాలు పెరగడంతో.. పరిపాలనపై ప్రభావం పడుతోందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ అభిప్రాయపడ్డారు. కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్లు, ముఖ్యమంత్రులు ఒకరినొకరు చూసుకునే పరిస్థితిలో కూడా లేరని, దీంతో వారు తమ బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమవుతున్నారని తెలిపారు. సీఎంలు, గవర్నర్‌ల మధ్య విభేదాల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ఆయన కోరారు. ఈ మేరకు రాష్ట్రపతికి శుక్రవారం ఆయన లేఖ రాశారు.

ఫిబ్రవరి 2 నుంచి షర్మిల పాదయాత్ర

15 షరతులతో అనుమతి ఇచ్చిన వరంగల్ పోలీసులు




సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రజా ప్రస్థానం పాదయాత్ర ఫిబ్రవరి 2వ తేదీనుంచి తిరిగి ప్రారంభం కానుంది. గతంలో వరంగల్ పోలీసులు యాత్రను నిలిపివేసిన చోటునుంచే శనివారం యాత్ర ప్రారంభించడానికి షర్మిల సిద్ధంకాగా, పోలీసులు అందుకు నిరాకరించి ఫిబ్రవరి 2 నుంచి 15 షరతులతో యాత్ర కొనసాగించడానికి అనుమతించారు. ఈ నేపథ్యంలో నర్సంపేట నియోజకవర్గం శంకరమ్మ తండా నుంచే షర్మిల యాత్ర తిరిగి ప్రారంభం కానుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మిగిలిన 8 నియోజకవర్గాల్లో షర్మిల పాదయాత్ర కొనసాగనుంది. వర్ధన్నపేట, వరంగల్ ఈస్ట్, వెస్ట్, స్టేషన్ ఘనపూర్, జనగాం, పాలకుర్తి, మహబూబాబాద్ మీదుగా ఖమ్మంలోని పాలేరు నియోజకవర్గంలో మరోసారి యాత్ర ప్రవేశించేలా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ముగింపు సభను పాలేరు నియోజకవర్గంలో భారీ ఎత్తున నిర్వహించేందుకు పార్టీ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. కాగా, తన యాత్రకు పోలీసులు షరతులు విధించడంపై వైఎస్ షర్మిల స్పందిస్తూ.. ఎవరి పాదయాత్రకు లేని షరతులు తన యాత్రకే ఎందుకని మండిపడ్డారు. తన పాదయాత్రను కేసీఆర్ పాలనకు అంతిమయాత్రగా అభివర్ణించారు. అడుగడుగునా ప్రజలు తనకు బ్రహ్మరథం పడుతుంటే కేసీఆర్‌కి భయం పట్టుకుందన్నారు. అందుకే ప్రశ్నించే గొంతులను నొక్కాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు.

ఆటో డ్రైవర్లను విస్మరించడం సిగ్గుచేటు

లక్డీకాపూల్ (హైదరాబాద్): ఇంధన, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని, ఆ మేరకు ఆటో మీటర్ చార్జీలు పెంచకుండా ఆటో డ్రైవర్లను విస్మరించడం సిగ్గుచేటని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల పేర్కొన్నారు. లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ రూపొందించిన యూనియన్ సభ్యత్వ స్టిక్కర్‌ను షర్మిల ఆవిష్కరించారు.

ఇదంజగత్



ఓడిపోయినప్పటి నుండి చేస్తున్నది అదేగా సార్! మళ్లీ కొత్తగా చేయడం ఎందుకు!!

గగనానికి గార్బేజ్ ముప్పు

అంతరిక్షంలో 34 వేల యంత్రశకలాలు, రాకెట్ల విడిభాగాల వ్యర్థాలు


భూ కక్ష్యలో 8,261 భ్రమణం... ఆ ఉపగ్రహాల్లో 3,409 కాలం చెల్లినవే

పెరుగుతున్న ప్రయోగాలతో 'స్పేస్ ట్రాఫిక్' సమస్య

ఆకాశంలో అధిక చెత్త అమెరికా, రష్యా దేశాలదే... ప్రక్షాళనకు ఇస్రో శాస్త్రవేత్తల సిఫారసులు

భూగోళాన్ని వేధిస్తున్న ప్రధాన సమస్యల్లో ఒకటి 'చెత్త'. నానాటికీ పెరుగుతున్న వ్యర్థాలను వదిలించుకునేందుకు చాలా దేశాలు పెద్ద కసరత్తే చేస్తున్నాయి. కాగా.. ఇదే సందర్భంలో అంతరిక్షంలోనూ పేరుకుపోతున్న చెత్త వివిధ దేశాలకు సవాల్ విసురుతోంది. ప్రస్తుతం రోదసీలో 3,409 శాటిలైట్లు చెత్తగా మారిపోయాయి. ఇవికాకుండా దాదాపు 34 వేల స్పేస్ జంక్ ముక్కలు, మిలియన్ల కొద్దీ చిన్నపాటి ముక్కలు అంతరిక్షాన్ని కమ్మేశాయి. 2030 నాటికి రోదసీలో ఉండే శాటిలైట్ల సంఖ్య 58 వేలకు దాటిపోవచ్చని అంచనా. దీనివల్ల గగనతలం భవిష్యత్‌లో పెద్ద ముప్పునే ఎదుర్కోవాల్సి వస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

– సాక్షి, అమరావతి



గంటకు 17 వేల మైళ్ల వేగంతో ప్రయాణిస్తూ 1997లో హబుల్ టెలిస్కోప్‌ను ఢీకొట్టిన శిథిలం (నాసా విడుదల చేసిన ఫొటో)

అంతరిక్ష ప్రయోగాలు మానవాళి చరిత్రను సమూలంగా మార్చేశాయి. ఉపగ్రహాల (శాటిలైట్స్) వినియోగంతో టీవీ, ఫోన్, ఇంటర్నెట్, జీపీఎస్ తదితర సేవలతో పాటు ఎప్పటికప్పుడు వాతావరణంలో వచ్చే మార్పులను ముందే పసిగట్టి జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఒక్క క్లిక్‌తో సమస్త సమాచారాన్ని అరచేతిలో చూడగలుగుతున్నాం. ఇదంతా శాటిలైట్స్ వల్లే సాధ్యమైంది. సోవియట్ యూనియన్ 1957 అక్టోబర్ 4న స్పుత్నిక్ శాటిలైట్ ప్రయోగంతో అంతరిక్ష యుగం మొదలైంది. వివిధ దేశాల ఆధ్వర్యంలో మాత్రమే శాటిలైట్ ప్రయోగాలు కొనసాగగా.. ఇటీవల ప్రైవేట్ కంపెనీలు సైతం ఈ రంగంలోకి ప్రవేశించాయి. ఐక్యరాజ్య సమితి ఔటర్ స్పేస్ అఫైర్స్ విభాగం లెక్కల ప్రకారం 2022 జనవరి నాటికి భూమి చుట్టూ 8,261 ఉపగ్రహాలు తిరుగుతున్నాయి. 'ఆర్యభట్ట'. 1975 ఏప్రిల్ 19న ఆర్యభట్టతో మొదలుపెట్టిన భారత్ ఇప్పటివరకు సుమారు 180 శాటిలైట్స్‌ను అంతరిక్షంలోకి పంపించింది. ఇవికాక సుమారు 38 దేశాలకు చెందిన 350 కి పైగా శాటిలైట్లను అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. మనదేశ శాటిలైట్లలో 40 వరకు సేవలందిస్తుండగా.. మిగిలినవి విశ్వంలో నిరుపయోగంగా ఉన్నాయి.

నాణేనికి రెండో వైపు..

ప్రపంచ దేశాలు పోటీపడి మరీ పంపిస్తున్న శాటిలైట్లతో అంతరిక్షంలో ట్రాఫిక్ పెరిగిపోతోంది. కాలం చెల్లిన శాటిలైట్లు, రాకెట్ల శిథిలాలతో గగనతలం చెత్తకుప్పగా మారిపోతోంది. యూనియన్ ఆఫ్ కన్సర్న్డ్ సైంటిస్ట్స్ (యూసీఎస్) లెక్కల ప్రకారం స్పేస్‌లో ఉన్న మొత్తం 8,261 శాటిలైట్లలో ప్రస్తుతం 4,852 మాత్రమే సేవలందిస్తున్నాయి. మిగిలిన 3,409 శాటిలైట్లు నిరుపయోగమై వ్యర్థాలుగా మారిపోయాయి. ఇవికాకుండా రాకెట్ల నుంచి రాలిపడిన దాదాపు 34 వేల స్పేస్ జంక్ ముక్కలు (10 సెం.మీ కంటే పెద్దవి), మిలియన్ల కొద్దీ చిన్న ముక్కలు అంతరిక్షం చుట్టూ పేరుకుపోయాయి. ఇటీవల అమెజాన్, స్పేస్-ఎక్స్ వంటి ప్రైవేట్ కంపెనీలు అంతరిక్షంలోకి అడుగుపెట్టి శాటిలైట్ల ప్రయోగాలు చేసేందుకు పోటీ పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల వల్ల 2030 నాటికి రోదసీలో శాటిలైట్ల సంఖ్య 58 వేలకు పైగా దాటిపోవచ్చని అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే అంతరిక్షంలో స్పేస్ ట్రాఫిక్ పెరిగిపోవడంతోపాటు డెబ్రిస్ (చెత్త)తో నిండిపోతుందని అంచనా.

పెనుసవాల్.. స్పేస్ జంక్

అంతరిక్షంలో ఉపగ్రహాలు తిరిగే వృత్తాకార మార్గాన్ని కక్ష్య (ఆర్బిట్) అంటారు. శాటిలైట్స్‌ను మూడు రకాల ఆర్బిట్స్‌లో ఉంచుతారు. ఇవి భూమి నుంచి 300కి.మీ. వరకు లోయర్ ఆర్బిట్, 700–1,000 కి.మీ వరకు రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ ఆర్బిట్స్, 36 వేల కి.మీ. జియో సింక్రనస్ ఆర్బిట్ (కమ్యూనికేషన్ శాటిలైట్స్) ఉంటాయి. ఏటా వందల సంఖ్యలో శాటిలైట్లను కక్ష్యల్లోకి పంపుతుండటంతో వాటి మధ్య దూరం తగ్గిపోయి స్పేస్ ట్రాఫిక్ ఏర్పడుతోంది. దీంతో కొత్త ఉపగ్రహాలను పంపేటప్పుడు ఇబ్బందులు ఏర్పడుతున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. అంతరిక్షంలో రాకెట్ పరికరాల శిథిలాలను స్పేస్ డెబ్రిస్ అంటారు. ఎక్కువ అంతరిక్ష శిథిలాలు 600–700 కి.మీ. పరిధిలోనే ఉన్నాయి. సాఫ్ట్‌బాల్ పరిమాణంలో 34 వేల స్పేస్ డెబ్రిస్ శిథిలాలు ఉన్నాయని, ఒక మిల్లీమీటర్ కంటే పెద్ద పరిమాణంలో 128 మిలియన్ల శిథిలాలు ఉన్నాయని నాసా ప్రకటించింది. ప్రతి 10 వేల శిథిలాలలో ఒకటి ప్రమాదానికి కారణమవుతుందని అంచనా వేసింది. ఇలాంటి శిథిలాలు 1999 నుంచి ఇప్పటిదాకా 25 ఐఎస్ఎస్‌ను తాకినట్టు స్పేస్ శాస్త్రవేత్తలు గుర్తించారు. మరోపక్క అంతరిక్ష వ్యర్థాలు విచ్ఛిన్నమై రేణువుల్లా విడిపోయి అంతరిక్ష కక్ష్యను కలుషితం చేస్తున్నాయి. ఈ వ్యర్థ రేణువుల్లో కొన్ని గంటకు 40 వేల కి.మీ. వేగంతో భూకక్ష్య వైపు దూసుకొస్తున్నాయి.

'నాసా' ట్రాక్ చేస్తోంది

స్పేస్‌లోకి వెళ్లిన ప్రతి వస్తువుకు పొజిషనింగ్ నంబర్ ఇచ్చి వాటి కదలికలను అనుక్షణం 'నాసా' ట్రాక్ చేస్తోంది. దీనినే స్పేస్ సర్వేలెన్స్ నెట్‌వర్క్ ట్రాకింగ్ అంటారు. నాసా అంచనా ప్రకారం ప్రతిరోజూ ఒక శిథిలం భూమి వైపు దూసుకొస్తోంది. అది నేలపై పడటమో లేదా వాతావరణంలోకి ప్రవేశించగానే మండిపోవడమో జరుగుతోంది. రాబోయే సంవత్సరాల్లో అంతరిక్ష శిథిలాల సంఖ్య లక్షకు పైగా పెరుగుతుందని, ఇవి ట్రాక్ చేయడానికి చిన్నవే అయినా అంతరిక్ష నౌకను దెబ్బతీసేంత పెద్దవని యూఎస్ మిలటరీ సైతం ప్రకటించింది. అంతరిక్ష యాత్రకు ప్రాణాంతకం లేదా విపత్తు కలిగించే వేల వస్తువులు, నష్టాన్ని కలిగించేంత సామర్థ్యం గలవి మిలియన్ల కొద్దీ ఉన్నాయని అంచనా వేసింది. జియో సింక్రనస్ ఆర్బిట్‌లో భారీ బరువుండే ఉప గ్రహాలుంటాయి. ఈ ఆర్బిట్‌లోని పనికిరాని శాటిలైట్లను పైస్థాయికి పంపేస్తారని.. ఇక్కడ డెబ్రిస్‌ని అంచనా వేయలేమని 'షార్' మాజీ డైరెక్టర్ ఎంవైఎస్ ప్రసాద్ చెప్పారు. అయితే, అధిక 'డెడ్ శాటిలైట్లు', శిథిలాలు 600–700 కి.మీ. పరిధిలోనే ఉన్నాయని, ఇవే ప్రధాన సమస్య అని ఆయన స్పష్టం చేశారు.

శిథిలాల తొలగింపునకు అంతర్జాతీయ కమిటీ

వాస్తవానికి అంతరిక్ష వ్యర్థాల్లో మూడింటి ఒక భాగం అమెరికా, రష్యాలవే. వేల కి.మీ. వేగంతో తిరుగుతున్న డెడ్ శాటిలైట్లు, రాకెట్ శిథిలాలను తొలగించడం కత్తిమీద సాములా మారింది. దీంతో అమెరికా వివిధ దేశాల స్పేస్ శాస్త్రవేత్తలతో 1993లో ఇంటర్ ఏజెన్సీ స్పేస్ డెబ్రిస్ కో-ఆర్డినేషన్ కమిటీని నియమించింది. ఐక్యరాజ్య సమితి 1959లోనే 'ఔటర్ స్పేస్ శాంతియుత ఉపయోగాల కమిటీ' (యూఎన్-సీఓపీయూఓఎస్)ని నియమించింది. ఈ రెండు కమిటీల్లోనూ భారత్ ప్రారంభ సభ్యదేశంగా ఉంది. ఈ కమిటీల్లోని శాస్త్రవేత్తలు అంతరిక్ష శిథిలాల తొలగింపుపై ఓ నివేదికను రూపొందించాయి. దీనిప్రకారం అధునాతన రాడార్లు, టెలిస్కోపులను ఉపయోగించి అంతరిక్ష వ్యర్థాలను పసిగట్టి ముందస్తు హెచ్చరికలు చేస్తుంటారు. కాలం చెల్లిన శాటిలైట్లను కక్ష్య నుంచి తప్పించి భూ వాతావరణంలోకి తెచ్చే యోచన జరుగుతోంది. స్పేస్ డెబ్రిస్‌ను తొలగించే యంత్రాంగం ప్రస్తుతం ప్రపంచంలో ఏ దేశం వద్దా లేదు.

– ఎంవైఎస్ ప్రసాద్, మాజీ డైరెక్టర్, షార్

రైతులూ చట్టసభల్లోకి..

- రైతులు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా వెళ్లాలి
- ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు



గిరిధర్ గమాంగ్‌కు పార్టీ కండువా కప్పుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: 'రైతులు తమ హక్కుల కోసం దేశ రాజధాని ఢిల్లీలో 13 నెలల పాటు ఆందోళన చేయాల్సిన దుస్థితి భారతదేశంలో తప్ప మరే దేశంలోనైనా ఉంటుందా? ఇంత సుదీర్ఘకాలం ఆందోళన చేసినా ఫలితం శూన్యం. కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్క పరిష్కారం కానీ, భరోసా కానీ లభించలేదు. దేశ ప్రజలు, రైతులు, పేదలను కేంద్రం ఇలా హేళన చేయడం భావ్యమేనా? అందుకే భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అనే నినాదాన్ని ఎత్తుకుంది. ఈ దేశ రైతులు నాగలితో పాటు పెన్ను పట్టడం కూడా నేర్చుకుని ఎంపీలు, ఎమ్మెల్యేలుగా చట్టసభల్లోకి వెళ్లాలి..' అని రాష్ట్ర ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్, ఆయన భార్య, మాజీ ఎంపీ హేమ గమాంగ్‌తో పాటు ఆ రాష్ట్రానికి చెందిన వివిధ పార్టీల నేతలు తెలంగాణ భవన్‌లో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. గిరిధర్ గమాంగ్‌తో పాటు ఒడిశా నుంచి వచ్చిన నేతలకు కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కేసీఆర్ మాట్లాడారు.

గెలిచిన తర్వాత లక్ష్యాన్ని మర్చిపోతున్నాయి..

'నేడు భారత్ తన లక్ష్యాన్ని కోల్పోయింది. ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా రాజకీయాలు మారాయి. జాతి, మతం పేరిట ప్రజల నడుమ చిచ్చు పెడుతూ విభజిస్తున్నారు. ప్రజాసేవ, దేశాభివృద్ధి లక్ష్యంగా పనిచేయాల్సిన పార్టీలు గెలుపు అందుకున్న తర్వాత లక్ష్యాన్ని మరిచిపోతున్నాయి. ఒడిశాలోని మహానదిలో అవసరాలకు మించి నీటి లభ్యత ఉన్నా 25 నుంచి 30 శాతమే వాడుకుంటున్నాం. బ్రాహ్మణి, వైతరిణి వంటి నదులు కూడా తాగు, సాగునీటి అవసరాలు తీర్చడం లేదు. జలాలు సముద్రంలో కలిసిపోతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 75 ఏళ్లుగా భారీ ప్రసంగాలు మినహా తాగునీరు, కరెంటు, యువతకు ఉద్యోగాలు ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో భారతదేశ భవిష్యత్తును, ఆలోచనను, భావజాలాన్ని మార్చే సంకల్పంతోనే భారత్ రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భవించింది..' అని కేసీఆర్ తెలిపారు.

నష్టాలు ప్రజలకు.. లాభాలు ప్రైవేటుకు

'దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ప్రస్తుతం మూడో తరం జీవితాలు సాగుతున్నాయి. భారత్ కంటే ముందు ఆ తర్వాత స్వాతంత్ర్యం పొందిన దేశాలతో పోల్చుకుంటే ఇక్కడ భిన్న పరిస్థితులు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం 'సోషలైజేషన్ ఆఫ్ ది లాసెస్ .. ప్రైవేటైజేషన్ ఆఫ్ ది ప్రాఫిట్' (నష్టాలు ప్రజలందరికీ.. లాభాలు ప్రైవేటు సంస్థలకు) అనే విధానాన్ని అనుసరిస్తోంది. అమెరికా, చైనా తదితర దేశాలకంటే భారత్‌లోనే ఎక్కువ సంపద కేంద్రీకృతమై ఉంది. కానీ నేడు భారత యువత అమెరికాకు వెళ్లేందుకు తాపత్రయ పడుతుండగా, వారికి గ్రీన్ కార్డు లభిస్తే వారి తల్లిదండ్రులు ఇక్కడ బంధువులకు విందు ఇవ్వడాన్ని బట్టి మనం ఎక్కడున్నామో అర్థం చేసుకోవచ్చు.

ప్రజలు గెలవడమే అసలైన ప్రజాస్వామ్యం..

దేశంలో సంపద ఉన్నా సాగునీరు, విద్యుత్ ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రజలు వంచనకు గురవుతున్నారు. ఎన్నో ప్రభుత్వాలు, ఎందరో నాయకులు, ఎన్నో రంగుల జెండాలను మోస్తున్నా పేదలు, రైతుల పరిస్థితి మారడం లేదు. ఎన్నికల్లో పార్టీలు, నాయకులు గెలుస్తున్నా ఎన్నికల తర్వాత ప్రజలు ఓడిపోతున్నారు. భారతదేశ రాజకీయాల్లో గంభీరమైన మార్పులు రావాలి.. ఎన్నికల్లో పార్టీలు, నాయకులు కాకుండా ప్రజలు గెలవడమే అసలైన ప్రజాస్వామ్యం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

తెలంగాణలో వర్ధిల్లుతోన్న రైతు సంక్షేమం

'సాగునీరు, విద్యుత్ కోసం పరితపించిన తెలంగాణ, స్వరాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఇంటింటికీ నల్లా, ప్రతి పంట పొలానికీ సాగునీరు, విద్యుత్‌ను అందిస్తూ ముందుకు సాగుతోంది. బంజారా తండాలో గరీబుకు, బంజారాహిల్స్‌లోని అమీరుకు ఒకే రకమైన శుద్ధి చేసిన నీళ్ళు అందిస్తున్నాం. వ్యవసాయం బాగుపడింది. రైతు ఆత్మహత్యలు లేవు. రైతుల సంక్షేమం వర్ధిల్లుతోంది. తెలంగాణలో సాధ్యమైంది ఒడిశాలో ఎందుకు సాధ్యం కాదు? ఇది ధన్‌కీ బాత్ కాదు.. మన్ కీ బాత్ (ధనం లేకపోవడం సమస్య కాదు... మనస్సు పెట్టకపోవడం వల్ల ఏర్పడే సమస్య). దేశ ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు కోసం అవసరమైన బలమైన రాజకీయ చిత్తశుద్ధి మా దగ్గర ఉంది.

అధికారమిస్తే దేశవ్యాప్తంగా చేసి చూపిస్తాం..

బీఆర్ఎస్‌కు అధికారమిస్తే రెండేళ్లలో దేశమంతటికీ 24 గంటల నాణ్యమైన విద్యుత్, వ్యవసాయానికి ఉచిత్ విద్యుత్, రక్షిత మంచినీరు, రైతులకు కిసాన్ బంధు, ఏటా 25 లక్షల దళిత కుటుంబాలకు దళితబంధును అమలు చేస్తాం. దేశంలోని 83 కోట్ల ఎకరాల వ్యవసాయ యోగ్యమైన భూమిని సాధ్యమైనంత ఎక్కువగా సాగులోకి తెస్తాం..' అని కేసీఆర్ స్పష్టం చేశారు.

నాకు వేయి ఏనుగుల బలం

గిరిధర్ గమాంగ్ లాంటి మచ్చలేని సీనియర్ రాజకీయ నాయకుడు బీఆర్ఎస్‌లో చేరడం తనకు వేయి ఏనుగుల బలాన్ని ఇచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. పార్టీలో చేరిన నేతలకు పేరు పేరునా స్వాగతం పలికారు. బీఆర్ఎస్‌లో చేరిన ఒడిశా నాయకుల్లో గిరిధర్ గమాంగ్ కుమారుడు శిశిర్ గమాంగ్, శౌర్య గమాంగ్, ఒడిశా బీజేపీ రాష్ట్ర యువ మోర్చా ప్రధాన కార్యదర్శి స్నేహరంజన్ దాస్, కొరాపుట్ పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యులు రబీంద్ర మొహపాత్రా, ఫల్గుణి సబర్, పి.గోపాల్‌రావు, మల్యా రంజన్ స్వైయిన్, నవనిర్మాణ్ కిసాన్ సంఘటన్ కన్వీనర్ అక్షయ్ కుమార్, మయూర్ భంజ్ మాజీ ఎంపీ రాంచంద్ర హన్సడా, ఎమ్మెల్యేలు రాఘవ్ శెట్టి, దేవ్ రాజ్ శెట్టి, మాజీ ఎమ్మెల్యేలు నబిన్ నందా, బండారి పాత్రి, రతాదాస్, అర్జున్ దాస్, బృందావన్ మాఝి, దేవాశిష్ నాయక్, ప్రశన్న పడితో పాటు పలువురు నేతలు ఉన్నారు. సమావేశంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, నాయకులు దాసోజు శ్రవణ్, కార్పొరేషన్ల చైర్మన్లు వేణుగోపాలచారి, ఆంజనేయ గౌడ్, గజ్జెల నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల్లో హైదరాబాద్‌కు రాక

గిరిధర్ గమాంగ్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు బీఆర్ఎస్‌లో చేరేందుకు ప్రత్యేక విమానంలో శుక్రవారం భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. సుమారు 300కు పైగా వివిధ సంఘాల నేతలు, వివిధ పార్టీల కార్యకర్తలు ప్రత్యేక బస్సుల్లో గురువారం ఒడిశా నుంచి బయలుదేరి శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌కు వచ్చారు. కాగా ఒడిశా నేతలతో శనివారం ప్రగతిభవన్‌లో కేసీఆర్ మరోమారు సమావేశమై బీఆర్ఎస్ విస్తరణ, వచ్చే నెలలో భువనేశ్వర్‌లో బహిరంగ సభ నిర్వహణపై దిశా నిర్దేశం చేస్తారు.

దమ్ములేనిది కేసీఆర్ బానిసలకే: ఈటల



సాక్షి, న్యూఢిల్లీ: 'సీఎం కేసీఆర్ బానిసలు, ఆయన సంధించిన సైకో శాడిస్టులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కళ్ళు నెత్తికెక్కి, అహంకారంతో బలుపెక్కి దమ్ముందా అని మాకు చాలెంజ్ చేస్తున్నారు ... దమ్ములేనందునే వాళ్లు ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారు' అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ నేతలు ఏనుగు రవీందర్ రెడ్డి, తుర్క నరసింహులుతో కలిసి శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఈటల మీడియాతో మాట్లాడారు. తమపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడినంత మాత్రాన తమ ధైర్యం ఏమాత్రం దెబ్బతినదని.. వారి మాటలను మరింత స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు క్షేత్రస్థాయిలో ఇంకా దూకుడుగా కొట్లాడతామన్నారు. ఈ దేశంలో తెలంగాణ భాగం కాదు ఒక ప్రత్యేక దేశం అన్నట్లుగా కేసీఆర్ వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం మంచిది కాదన్నారు.

గవర్నర్‌తో వ్యవహరించిన తీరు జుగుప్సాకరం

'ఈ జనవరి 26న కేసీఆర్ రాజ్యాంగం పట్ల వ్యవహరించిన తీరు అత్యంత జుగుప్సాకరంగా ఉంది. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న గవర్నర్‌ను అవమానపరచడం అంటే రాజ్యాంగాన్ని మహిళలను అవమానపరచడమే' అని ఈటల అన్నారు.

మళ్లీ బీజేపీలోకి రండి

- పార్టీని వీడిన నేతలకు బండి సంజయ్ పిలుపు
- విజయశాంతి 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానం సందర్భంగా సన్మానం



విజయశాంతికి కరవాలం బహూకరిస్తున్న బండి సంజయ్, తరుణ్‌ఛుగ్. చిత్రంలో కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీజేపీలో గతంలో చిన్న చిన్న సమస్యలతో ఇబ్బందిపడి, భావోద్వేగాలతో పార్టీని వీడిన వారు, సైద్ధాంతిక భావాలున్న నేతలు తిరిగి పార్టీలోకి రావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపునిచ్చారు. అందరం కలిసి కేసీఆర్ నియంత పాలనకు చరమగీతం పాడి బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాస్వామిక తెలంగాణను సాధించుకుందామన్నారు. మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వస్తే ప్రజలు బిచ్చమెత్తుకునే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. శుక్రవారం రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యురాలు విజయశాంతి 25 ఏళ్ల రాజకీయ జీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెను పార్టీనేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ బీజేపీలో కార్యకర్తలు కూడా ప్రధాని, రాష్ట్రపతి అయ్యే అవకాశాలుంటాయన్నారు. పార్టీలో తాను తప్పు చేసినా అడిగే హక్కు కార్యకర్తలకు ఉంటుందని, తాను సరిచేసుకోకపోతే ఢిల్లీనాయకత్వానికి చెప్పే వీలుంటుందన్నారు. బీఆర్ఎస్‌లో ఆ పరిస్థితి ఉంటుందా అని ప్రశ్నించారు. సినిమా గ్లామర్ ప్రపంచం. రాజకీయాల్లో ప్రశంసలకంటే విమర్శలే ఎక్కువ, అవన్నీ తట్టుకుని తెలంగాణ ఉద్యమకారిణిగా గర్జిస్తూ విజయశాంతి 25 ఏళ్లు పూర్తి చేసుకోవడం సంతోషమన్నారు. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.,. విజయశాంతి ఎవరికీ తలవంచకుండా పనిచేసి రాజకీయాల్లో తనకంటూ ఓ గుర్తింపును సంపాదించుకున్నారన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకు విజయశాంతి ఎంతో పోరాటం చేస్తున్నారని రాష్ట్రపార్టీ ఇన్‌చార్జీ తరుణ్‌చుగ్ ప్రశంసించారు.

నన్ను ఓడించేందుకు కేసీఆర్ ప్రయత్నించారు

టీఆర్ఎస్ నేతగా ఉన్నపుడే ఎన్నికల్లో తనను ఓడించేందుకు కేసీఆర్ ప్రయత్నించారని విజయశాంతి చెప్పారు. అందుకే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రకటన రోజే తనను సస్పెండ్ చేశారన్నారు. 'కేసీఆర్ ఒక విషసర్పం. ఆయనకు మరోసారి అధికారమిస్తే రాష్ట్రంలో ప్రజలు బతకలేని పరిస్థితులు ఏర్పడతాయి. ఇప్పటికే రాష్ట్రం రాంగ్ పర్సన్ చేతుల్లోకి వెళ్లింది. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి' అని కోరారు.

బంగారు భారతాన్ని నిర్మిద్దాం

- తెలంగాణ ప్రజలకు రాహుల్ సందేశం రెడీ
- సందేశంతో పాటు బీజేపీ, బీఆర్ఎస్ వైఫల్యాలపై కరపత్రం

సాక్షి, హైదరాబాద్: 133 రోజుల క్రితం కన్యాకుమారిలో ప్రారంభమైన 'భారత్‌జోడో యాత్ర'కు కొనసాగింపుగా ఫిబ్రవరి ఆరో తేదీ నుంచి రాష్ట్రంలో జరగనున్న హాథ్ సే హాథ్ జోడో యాత్రల కోసం దేశ ప్రజలకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ సందేశాన్ని పంపారు. ఈ సందేశాన్ని తెలుగులోనికి అనువదించిన టీపీసీసీ ఆ సందేశంతో పాటు బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలతో కూడిన చార్జిషీట్‌ను నాలుగు పేజీల కరపత్రంలో పొందుపరిచింది. ప్రతి భారతీయుడు కలలు కనే సమాజాన్ని, వాటిని నెరవేర్చుకునేందుకు సమాన అవకాశాలున్న సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరం చేయి చేయి కలుపుదామని, బంగారు భారతాన్ని నిర్మిద్దామని రాహుల్‌గాంధీ తన సందేశంలో పేర్కొన్నారు. ఈ సందేశం పొందుపరిచిన కరపత్రాన్ని హాథ్ సే హాథ్ జోడో యాత్రల సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి గడపకూ కాంగ్రెస్ శ్రేణులు అందజేయనున్నాయి. ఈ మేరకు యాత్రల ప్రచార సామగ్రిని గాంధీభవన్ నుంచి క్షేత్రస్థాయికి పంపే ఏర్పాట్లలో గాంధీభవన్ వర్గాలు నిమగ్నమయ్యాయి. మరోవైపు ఫిబ్రవరి ఆరో తేదీన భద్రాచలంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలను ప్రారంభించేందుకు టీపీసీసీ ఏర్పాట్లు చేస్తోంది. ఆ రోజున లక్షమందితో బహిరంగ సభ నిర్వహించాలని, ఈ సభకు సోనియా, ప్రియాంకా గాంధీల్లో ఒకరిని ఆహ్వానించేందుకు ఇప్పటికే ఏఐసీసీకి లేఖ రాసింది.

సబ్‌కే సాత్ విశ్వాస్ ఘాత్

దేశంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలన్నింటినీ విస్మరించిందని, బీజేపీ భ్రష్ట్ జుమ్లా పార్టీ అని హాథ్ సే హాథ్ జోడో చార్జిషీట్‌లో కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. కుచ్‌కాసాత్ ఖుద్‌కా వికాస్, సిర్ఫ్ ప్రచార్ ఔర్ పరివార్ వాద్, సబ్‌కేసాత్ విశ్వాస్ ఘాత్, కుచ్‌కా సాథ్ ఖుద్‌కా వికాస్, సబ్కేసాథ్ విశ్వాస్ ఘాత్ లాంటి నినాదాలను ఈ చార్జిషీట్‌లో పొందుపరిచారు. మోదీ ప్రతిష్టను పెంచేందుకు బీజేపీ రూ.10వేల కోట్లను ఖర్చు చేసిందని, రూ.5వేల కోట్లకు ఆ పార్టీ పడగలెత్తిందని, ఎలాంటి పారదర్శకత లేకుండానే 90% ఎన్నికల బాండ్లు బీజేపీకి దక్కాయన్నారు.

29న బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ భేటీ

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 31న పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ నెల 29న బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం కానుంది. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అధ్యక్షతన ప్రగతి భవన్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు ఈ సమావేశం జరగనుంది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో చర్చించే అంశాలు, అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ఎంపీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశానికి హాజరు కావాల్సిందిగా పార్టీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు సమాచారం అందించారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు, రాష్ట్రంపట్ల కేంద్రం అనుసరిస్తున్న వైఖరి, విభజన హామీలు తదితరాలకు సంబంధించి ఈ భేటీలో కేసీఆర్ దిశానిర్దేశం చేసే అవకాశముందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

ఇందిరమ్మ ఇళ్లు లేని ఊళ్లో ఓట్లడగను

- మరి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వని గ్రామాల్లో ఓట్లు అడగరా?
- మంత్రి కేటీఆర్‌కు పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సవాల్



కోస్గిలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

దౌల్తాబాద్: ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో తాము ఓట్లు అడగమని, మరి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వని గ్రామాల్లో మీరు ఓటు అడగకుండా ఉంటారా అని మంత్రి కేటీఆర్‌కు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. హాథ్‌సేహాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని దౌల్తాబాద్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని, బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేస్తోందని నిందించారు. దేశాన్ని ఏకతాటి పైకి చేర్చేందుకే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారని, రాహుల్ సందేశాన్ని ప్రతి ఇంటికి చేర్చేందుకు హాథ్‌సేహాథ్ జోడో కార్యక్రమాన్ని చేపడుతున్నామని రేవంత్ చెప్పారు. 'మీరు కష్టపడి నాటిన మొక్క నేడు ఒక వృక్షమై కొడంగల్‌కు గుర్తింపు తీసుకొచ్చింది వాస్తవం కాదా.. 119 నియోజకవర్గాల బీఫాంలపై సంతకం పెట్టే అవకాశం నాకు కల్పించారు' అంటూ భావోద్వేగానికి గురయ్యారు.

గురునాథ్‌రెడ్డిని కలిసిన రేవంత్

కొడంగల్: బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సత్కరించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు గురునాథ్‌రెడ్డిని కలిసినట్లు రేవంత్ తెలిపారు. గురునాథ్‌రెడ్డి గతంలో కాంగ్రెస్ పార్టీలో ప్రముఖ నాయకుడని. కొడంగల్ నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని గుర్తు చేశారు.

కొడంగల్‌కు కేటీఆర్ చేసిందేమీలేదు: రేవంత్

కోస్గి/మద్దూరు: మంత్రి కేటీఆర్ కొడంగల్‌ను దత్తత తీసుకొని కొత్తగా చేసిన అభివృద్ధి ఏమీ లేదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉండి తాను చేసిన అభివృద్ధికి, ప్రస్తుతం అధికారంలో ఉండి మీరు చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా చేపట్టిన సన్నాహక యాత్ర శుక్రవారం రాత్రి నారాయణపేట జిల్లా కోస్గికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక శివాజీ చౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షోలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

డబుల్ అను'గృహమే'దీ?

డబుల్ బెడ్రూం ఇళ్లపై పేదల ఆశలు అడియాసలు

గౌరవప్రద జీవితానికి అడుగుకో అవరోధం

- ఏడేళ్లలో సగం కూడా పూర్తికాని ఆశల సౌధాలు
- పూర్తయిన చోట శిథిలావస్థకు చేరుతున్న దైన్యం
- కేటాయింపుల్లో రాజకీయ సిఫారసులకు పెద్దపీట



దొంగలతో.. మళ్లీ మొదటికి..

→ మెదక్ జిల్లా రామాయంపేటలో చాలాకాలం క్రితమే 300 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తయింది. కానీ ఉన్న ఇళ్ల కంటే ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉంది. అలాగే నిధుల కొరత ఉండటంతో మౌలిక సదుపాయాల కల్పనలోనూ జాప్యం చేశారు. ఈలోగా ఆ ఇళ్లలో దొంగలు పడి విద్యుత్ వైర్లను పూర్తిగా ఎత్తుకుపోయారు. దీంతో అన్ని ఇళ్లకు మళ్లీ వైరింగ్ చేయాల్సిన పరిస్థితి. ఈ మొత్తాన్ని ఎవరు భరించాలో స్పష్టత లేక అధికారులు తల పట్టుకుంటున్నారు.




మరుగుదొడ్డిలో.. ఏడాదిగా..

→ మెదక్ జిల్లా రామాయంపేటలో డబుల్ బెడ్రూం ఇల్లు కోసం రామలక్ష్మి ఎదురుచూస్తోంది. మూడేళ్ల క్రితమే దరఖాస్తు చేసుకుంది కూడా. అయితే ఆమెకు ఎక్కడా నిలువ నీడ లేక ఇప్పుడు కొడుకుతో కలిసి ఆర్ అండ్ బీ శాఖ వదిలేసిన అతిథి గృహంలోని మరుగుదొడ్డిలో నివాసం ఉంటోంది. భర్త చనిపోవడంతో ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌తో ఏడాది కాలంగా ఈ మరుగుదొడ్డిలో కాలం వెళ్లదీస్తోంది.

ఇదీ.. సంక్షేమ రంగంలోనే మేలిమలుపుగా దేశవ్యాప్త చర్చకు దారితీసిన 'డబుల్ బెడ్రూం ఇళ్ల'పథకం ప్రస్తుత పరిస్థితి. 'సింగిల్ కాదు.. డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తాం.. అదీ పూర్తి ప్రభుత్వ ఖర్చుతోనే!'.. అని ప్రభుత్వం చెప్పడంతో నిరుపేదలు తమ ఊహలకు రెక్కలు తొడిగారు. సికింద్రాబాద్ బోయిగూడ ఐడీహెచ్ (ఇన్ఫెక్షన్ డిసీజ్ హాస్పిటల్) కాలనీ తరహాలోనే తమకూ కొత్త జీవితం వస్తుందని ఆశపడ్డారు. ఎన్నడూ లేని రీతిలో ఇళ్ల నిర్మాణానికి వ్యూహరచన చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మంది దరఖాస్తులు సమర్పించారు. కానీ, ఇప్పటివరకు మంజూరైన ఇళ్లు మాత్రం 2.76 లక్షలే. వీటిలో నిర్మాణం పూర్తయింది సగం కంటే తక్కువే. అదీగాక ఇళ్లు పూర్తయినా రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల కల్పన జరిగింది ఇంకా తక్కువే. వీటికితోడు అన్ని సదుపాయాలు కల్పించిన ప్రాంతాల్లోనూ ఇళ్ల పంపిణీ చేయకపోవడం శోచనీయం. ఇన్ని అడ్డంకులు దాటుకుని తీరా కేటాయింపులు చేసే సమయంలో రాజకీయ సిఫారసులకు పెద్దపీట వేస్తుండటంతో నిరుపేదల ఆశలు అడియాసలవుతున్నాయి. ఫలితంగా సమున్నత పథక లక్ష్యం పక్కదారి పట్టే పరిస్థితి కనిపిస్తోంది.

- శ్రీగిరి విజయ్‌కుమార్‌రెడ్డి





ఉన్న ఇల్లు ఖాళీ చేసి..

మేం ఉంటున్న ఇంటిని ఖాళీ చేయించి డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తానని చెప్పి రెండేళ్లు అవుతోంది. మేం ఇతరుల స్థలంలో రేకులతో షెడ్డు వేసుకుని చలికి వణుకుతూ, వానకు తడుస్తూ ఇబ్బంది పడుతున్నాం. ఉన్న ఇల్లు పోయి, డబుల్ బెడ్రూం రాక అవస్థలు పడుతున్నాం.

–లాల్‌కోట రాజు, చౌదరిపల్లి, మహబూబ్‌నగర్

ప్రతి చోటా రాజకీయ స్వార్థం వద్దు



ప్రభుత్వం చేపట్టే ఏ పథకమైనా అర్హులకు చేరేలా పకడ్బందీ మెకానిజం ఏర్పాటు చేయాలి. కానీ రాష్ట్రంలో అలా కనిపించడం లేదు. డబుల్ బెడ్రూం ఇళ్ల విషయంలోనూ నిజమైన నిరుపేదలను గుర్తించే బాధ్యతను అధికారులకు అప్పగించాలి. కానీ రాజకీయ సిఫారసు ఉంటేనే డబుల్ బెడ్రూం అయినా, మరోటి అయినా వచ్చే పరిస్థితి ఉంది. చాలాచోట్ల ఇళ్లు పూర్తయినా పంపిణీ చేయడం లేదు. ప్రతి పనిలో రాజకీయ స్వార్థం చూసుకోవడం వ్యవస్థకు మంచిదికాదు.

–జస్టిస్ కె. చంద్రకుమార్

కొత్త ఇళ్లు.. పాత పడిపోయినా..



కామారెడ్డి జిల్లా కేంద్రంలో 720 ఇళ్ల నిర్మాణం ఎప్పుడో పూర్తయింది. మౌలిక సదుపాయాలకు నిధులు లేక పనులు రెండేళ్లుగా నిలిచిపోయాయి. ఈలోగా ఇంటి అద్దాలు, ఇతర పరికరాలు ధ్వంసమయ్యాయి. ఆశావహుల సంఖ్య వేలల్లో, ఇళ్లు మాత్రం వందల్లో ఉండటంతో ఆలస్యమవుతోందని చెబుతున్నారు.

నిలువ నీడ కోసం.. నిలువెల్లా కనులై..



కామారెడ్డిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో తమకు అవకాశం వస్తుందన్న ఆశతో ఈ నిరుపేద దంపతులు నిలువెల్లా కనులతో ఎదురుచూస్తున్నారు. ఊరూరా తిరుగుతూ చిరు వ్యాపారం చేసుకుంటూ తమ ఇద్దరు పిల్లల్ని చదివిస్తున్నారు అంద్రాసి సాయవ్వ, రంగయ్యలు. ఇప్పుడు పూరి గుడిసెలో నివాసముంటున్నారు. సొంత ఇంటి కలను నెరవేర్చుకునేందుకు వీళ్లు వెళ్లని ఆఫీసు, కలవని అధికారి లేడంటే అతిశయోక్తి కాదు.

తొలి అడుగు పడిందిలా..

2015 తొలినాళ్లలో సికింద్రాబాద్ బోయిగూడలో ఐడీహెచ్ కాలనీతోపాటు మరో నాలుగు మురికివాడల్లో ఇరుకుగదులు, కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఆ ఇళ్లలో ఉంటున్న వారిని ఒప్పించి రూ.37 కోట్ల వ్యయంతో జీ ప్లస్ టు పద్ధతిన 33 బ్లాకుల్లో ప్రతి ఇల్లు 560 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక వంటగది రెండు బెడ్రూంలను కేవలం 11 నెలల్లో నిర్మించి 396 మందికి అందజేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.7.90 లక్షలు, డ్రైనేజీ, మంచినీరు, రోడ్లు ఇతర సదుపాయాల కోసం రూ.1.33 లక్షల చొప్పున ఖర్చు చేసి యాభై ఏళ్ల మురికివాడను క్లాస్ కాలనీగా తీర్చిదిద్దారు. జీహెచ్ఎంసీ చొరవతో చేపట్టిన ఈ ప్రయోగం సక్సెస్ కావడంతో రాష్ట్రమంతటా డబుల్‌బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని ప్రభుత్వం 2015 నవంబర్‌లో ప్రకటించింది.

'డబుల్' లెక్కలు

ఈ పథకానికి ఇప్పటిదాకా చేసిన వ్యయం సుమారు **రూ.10,000 కోట్లు**

అత్యధికంగా ఇళ్ల నిర్మాణం జరిగిన జిల్లా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా **18,070 ఇళ్లు**

దరఖాస్తులు

జీహెచ్ఎంసీలో **10,00,000**

జిల్లాల్లో **8,00,000**

మొత్తం **18,00,000**

అత్యధిక నిర్మాణ జాబితాలో రెండో స్థానంలో ఉన్నది ఉమ్మడి మెదక్ జిల్లా **10,928 ఇళ్లు**

ఒక్కో యూనిట్‌కు అయిన వ్యయం సుమారుగా..
జీహెచ్ఎంసీలో రూ.**7,90,000**
ఇతర పట్టణాల్లో రూ.**5,30,000**
గ్రామాల్లో రూ.**5,04,000**
(ఇందులో పట్టణాల్లో రూ.1.50 లక్షలు, గ్రామాల్లో రూ.72 వేలను కేంద్రం భరిస్తుండగా, మిగిలిన మొత్తం రాష్ట్రం కేటాయిస్తోంది)

పేదలను వదిలి.. నాయకులకు..



మహబూబ్‌నగర్‌లో ఏటా నీటమునిగే బస్తీల్లో శిథిలావస్థకు చేరిన పేదల కోసం దివిటిపల్లిలో 1,024 డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించారు. అయితే ఇందులో ఇప్పటికే 100 ఇళ్లను ముఖ్యనాయకుల సిఫారసుల మేరకు కేటాయించారు. మిగిలిన ఇళ్లను వార్డు, ఇతర ముఖ్యుల సూచన మేరకు కేటాయించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో కేటాయింపుల కోసం భారీగా డబ్బులు వసూలు చేయడం, కొందరిని అరెస్ట్ చేయడం, మంత్రి పీఏ కుమారుడి ఆత్మహత్య లాంటి ఘటనలతో ప్రక్రియ మొత్తం ఆగిపోయింది. ఫలితంగా అవన్నీ ఇప్పుడు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాక పోవడంతో మౌలిక సదుపాయాల పనులు నిలిపేశారు.

2,225 పోస్టుల భర్తీ

▶ మొదటి పేజీ తరువాయి
166 పోస్టుల భర్తీకి మరో జీవోను ఆర్థిక శాఖ జారీ చేసింది. గురుకులాల్లో బోధన పోస్టుల భర్తీ బాధ్యతలు టీఆర్‌ఈఐఆర్‌బీకి, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీని టీఎస్‌పీఎస్సీకి, స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీని టీఎంహెచ్ఎస్ఆర్‌బీకి అప్పగించింది.



తాజాగా అనుమతులిచ్చిన పోస్టులు, నియామక సంస్థలు ఇలా

కేటగిరీ	పోస్టులు	నియామక సంస్థ
బీసీ గురుకుల సొసైటీలో		
స్టాఫ్ నర్స్	63	టీఎంహెచ్ఎస్ఆర్‌బీ
ప్రిన్స్‌పల్(స్కూల్)	10	టీఆర్‌ఈఐఆర్‌బీ
డిగ్రీ లెక్చరర్	480	టీఆర్‌ఈఐఆర్‌బీ
జూనియర్ లెక్చరర్	185	టీఆర్‌ఈఐఆర్‌బీ
పీజీటీ	235	టీఆర్‌ఈఐఆర్‌బీ
టీజీటీ	324	టీఆర్‌ఈఐఆర్‌బీ
లైబ్రేరియన్	11	టీఆర్‌ఈఐఆర్‌బీ
లైబ్రేరియన్ (డిగ్రీ)	37	టీఆర్‌ఈఐఆర్‌బీ
లైబ్రేరియన్ (స్కూల్)	11	టీఆర్‌ఈఐఆర్‌బీ
ఫిజికల్ డైరెక్టర్ (డిగ్రీ)	20	టీఆర్‌ఈఐఆర్‌బీ
పీఈటీ(స్కూల్స్)	33	టీఆర్‌ఈఐఆర్‌బీ
ఆర్ట్/క్రాఫ్ట్/మ్యూజిక్	33	టీఆర్‌ఈఐఆర్‌బీ
అసిస్టెంట్ లైబ్రేరియన్ (డిగ్రీ)	15	టీఆర్‌ఈఐఆర్‌బీ
ల్యాబ్ అసిస్టెంట్	60	టీఆర్‌ఈఐఆర్‌బీ
కంప్యూటర్ ల్యాబ్ అసిస్టెంట్	30	టీఆర్‌ఈఐఆర్‌బీ
స్టోర్ కీపర్	15	టీఆర్‌ఈఐఆర్‌బీ
జూనియర్ లెక్చరర్	417	టీఆర్‌ఈఐఆర్‌బీ
జూనియర్ అసిస్టెంట్	141	టీఎస్‌పీఎస్సీ
జూనియర్ అసిస్టెంట్ (హెచ్‌ఓ)	12	టీఎస్‌పీఎస్సీ
జనరల్ గురుకుల సొసైటీలో		
టీజీటీ	87	టీఆర్‌ఈఐఆర్‌బీ
ఆర్ట్/క్రాఫ్ట్/ మ్యూజిక్	06	టీఆర్‌ఈఐఆర్‌బీ
సమాచార పౌరసంబంధాల శాఖలో		
అసిస్టెంట్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్	41	టీఎస్‌పీఎస్సీ
అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్	16	టీఎస్‌పీఎస్సీ
ఎడిటర్ (ఉర్దూ)	01	టీఎస్‌పీఎస్సీ
ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్	22	టీఎస్‌పీఎస్సీ
పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్	04	టీఎస్‌పీఎస్సీ
పబ్లిసిటీ అసిస్టెంట్	82	టీఎస్‌పీఎస్సీ

పది రోజుల్లో ప్రకటనలు!

కసరత్తు చేపట్టిన గురుకుల నియామకాల బోర్డు

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో కొలువుల భర్తీకి సంబంధించిన అనుమతులు వచ్చేశాయి. గురుకులాల్లో 2,225 ఉద్యోగాల భర్తీకి ఆర్థిక శాఖ ఆరు రకాల ఉత్తర్వులను జారీ చేసింది. ఇందులో 2,009 పోస్టులను గురుకుల నియామకాల బోర్డు ద్వారా భర్తీ చేస్తారు. గతంలో అనుమతిచ్చిన 9,096 పోస్టులతో కలుపుకుంటే గురుకుల బోర్డు ద్వారా భర్తీ చేయనున్న మొత్తం పోస్టుల సంఖ్య 11,005కు చేరుతుంది. వీటన్నింటికి సంబంధించిన నోటిఫికేషన్లు పది రోజుల్లో వెలువడే అవకాశం ఉంది. 2022–23 విద్యా సంవత్సరంలో కొత్తగా ఏర్పాటైన గురుకులాల్లో పోస్టుల భర్తీకి అనుమతుల కోసం చాలాకాలం ఎదురుచూసిన గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్‌ఈఐఆర్‌బీ) తాజా అనుమతులతో ఇప్పుడు భర్తీ ప్రక్రియను వేగవంతం చేసింది.

వాటికి పూర్తిస్థాయిలో పరిశీలన

ఇప్పటికే 9,096 పోస్టుల భర్తీకి సంబంధించి సొసైటీల వారీగా ప్రతిపాదనలు గురుకుల బోర్డుకు చేరాయి. వీటికి సంబంధించి పోస్టుల రిజర్వేషన్లు, రోస్టర్ తదితర పూర్తిస్థాయిలో పరిశీలన చేసి నిర్ధారణ చేసుకుంది. తాజాగా 2,009 పోస్టులకు సంబంధించి మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ, తెలంగాణ గురుకుల విద్యాసంస్థల సొసైటీలు ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉంది. వీటికి సంబంధించిన ఇండెంట్లు ఒకట్రెండు రోజుల్లో గురుకుల సొసైటీకి చేరే అవకాశం ఉంది. ఆ తర్వాత వాటిని పరిశీలించాక వరుసగా ప్రకటనలు జారీ చేయనున్నట్లు గురుకుల నియామకాల బోర్డు వర్గాలు చెబుతున్నాయి.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, నేషనల్ గైడ్స్ కమిషనర్‌గా కవిత



సాక్షి, హైదరాబాద్: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, నేషనల్ గైడ్స్ కమిషనర్‌గా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నియమితులయ్యారు. ఈ విషయాన్ని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ డైరెక్టర్ రాజ్‌కుమార్ కౌశిక్ శుక్రవారం ప్రకటించారు. కవిత నేషనల్ గైడ్స్ కమిషనర్‌గా ఏడాది పాటు సేవలందించనున్నారు. ఆమె 2015 నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర చీఫ్ కమిషనర్‌గా సేవలందించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో దేశవ్యాప్తంగా విద్యార్థుల భాగస్వామ్యం మరింత పెరిగేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా కవిత తెలిపారు.

ప్రతి పోలీస్‌కు కేఎస్ వ్యాస్ మార్గదర్శకుడు

'ధీశాలి కేఎస్ వ్యాస్' పుస్తకావిష్కరణలో వక్తలు

సాక్షి, హైదరాబాద్: పోలీస్ ఉద్యోగంలో చేరే ప్రతి ఒక్కరికీ సీనియర్ ఐపీఎస్ అధికారి కేఎస్ వ్యాస్ మార్గదర్శకుడని కేఎస్ వ్యాస్ 30వ వర్ధంతి సభకు హాజరైన వక్తలు అభిప్రాయపడ్డారు. ఇతరులతో వ్యాస్‌కు ఉన్న సాన్నిహిత్యం, ఆయన క్రమశిక్షణను మరిచిపోలేమని గుర్తు చేసుకున్నారు. వ్యాస్ 30వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర పోలీస్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనపై రిటైర్డ్ అదనపు ఎస్పీ డా.కరణం సత్యనారాయణ రచించిన 'పాథ్ ఫైండర్', 'ధీశాలి కేఎస్ వ్యాస్' పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయితను పోలీస్ అకాడమీ డైరెక్టర్ సందీప్ శాండిల్య, వ్యాస్ సహచరులుగా పనిచేసిన రిటైర్డ్ ఐపీఎస్‌లు ఎంవీ కృష్ణారావు, కేసీరెడ్డి, వ్యాస్ కుమారుడు శ్రీవాత్సవ అభినందించారు.

మంత్రి పువ్వాడకు హైకోర్టు నోటీసులు

- మెడికల్ ఫీజుల కేసులో తీర్పు ఎందుకు అమలు చేయలేదు..
- వివరణ ఇవ్వాలని ఆదేశించిన న్యాయస్థానం

సాక్షి, హైదరాబాద్: పీజీ మెడికల్ ఫీజులకు సంబంధించి న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో చెప్పాలంటూ రాష్ట్ర మంత్రి, మమతా ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పువ్వాడ అజయ్ కుమార్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 17వ తేదీకి వాయిదా వేసింది. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయవద్దని, ఫీజు రెగ్యులేటరీ కమిటీ (ఎఫ్ఆర్‌సీ) నిర్ణయించిన మేరకే వసూలు చేయాలని పలు కాలేజీలను ఆదేశిస్తూ ఓ రిట్ పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టు 2022లో ఉత్తర్వులు ఇచ్చింది. ఒకవేళ అధిక ఫీజు వసూలు చేస్తే దాన్ని తిరిగి ఇచ్చేయాలని స్పష్టంచేసింది. అలాగే విద్యార్థుల సర్టిఫికెట్లు కూడా ఇచ్చేయాలని ఆదేశించింది. అయితే ఈ ఉత్తర్వులను మమతా కాలేజీ యాజమాన్యం పాటించకపోవడంతో వరంగల్‌కు చెందిన డాక్టర్ నిఖిల్ గుర్రపు కోర్టు ధిక్కార పిటిషన్ వేశారు. దీనిపై చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎస్.తుకారాంజీ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది సామ సందీప్‌రెడ్డి వాదనలు వినిపించారు. కోర్టు ఆదేశాలను మమతా కాలేజీ పలు కాలేజీలు కావాలనే పాటించలేదని.. దీంతో విద్యార్థులు అధిక ఫీజు చెల్లించాల్సి వచ్చిందన్నారు. వెంటనే ఆ ఫీజు తిరిగి ఇచ్చేలా కాలేజీ యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. మంత్రి పువ్వాడకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను వాయిదా వేసింది.

త్రీఫేజ్.. ఎప్పుడొస్తుందో ఎప్పుడు పోతుందో?

కరెంటు కోతలపై ఆదిలాబాద్ జిల్లాలో రైతుల నిరసన

సాక్షి, ఆదిలాబాద్: 'త్రీఫేజ్ కరెంటు ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉంది.. 24 గంటల విద్యుత్ సరఫరా అంటున్నారు. 5 నుంచి 8 గంటల్లోపు కూడా రావడం లేదు. అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు పడుతున్నాం. యాసంగి పంటలకు నీళ్లందించలేని పరిస్థితి ఉంది'అంటూ ఆదిలాబాద్ జిల్లాలో రైతులు రెండు రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం జిల్లాలోని తాంసి, తలమడుగు, బజార్‌హత్నూర్, ఇచ్చోడ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ఎదుట ఆయా మండలాల్లోని రైతులు ఆందోళన చేపట్టారు. శనగ, జొన్న, మొక్కజొన్న, గోధుమ, ఇతర పంటలకు నీరందడం లేదని, వారం రోజులుగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు పరిస్థితిపై విద్యుత్ అధికారులను నిలదీశారు. కొన్నిచోట్ల పోలీసులు రైతులను సముదాయించి నిరసన విరమింపజేశారు. కరెంటు కోతల కారణంగా పంటలకు నీరందించలేక పోతున్నామని రైతులు చెపుతున్నారు.

ఓటు లేదని వివక్ష..!

ఎస్‌జీటీ స్పౌజ్‌ల్లో ఆందోళన

సాక్షి, హైదరాబాద్: స్పౌజ్‌లుగా ఉన్న ఎస్‌జీటీల విషయంలో విద్యాశాఖ అనుసరిస్తున్న తీరు తీవ్ర వివాదాస్పదమవుతోంది. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్కూల్ అసిస్టెంట్లకు ఓటు హక్కు ఉండబట్టే వారికి అవకాశం ఇచ్చారని, తమకు లేదంటూ వివక్ష చూపుతున్నారని ఎస్‌జీటీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 317 జీవో కారణంగా జరిగిన బదిలీల్లో భార్యాభర్తలను వేర్వేరు ప్రాంతాలకు పంపారు. దీనిపై ఏడాదిగా పోరాటాలు నడుస్తున్నాయి. తాజాగా జరుగుతున్న బదిలీల్లో స్కూల్ అసిస్టెంట్స్ 615 మందికి సొంత జిల్లాలకు వెళ్లేందుకు అనుమతించారు. కానీ 1,585 మంది ఎస్‌జీటీల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో వారిలో నిరసన వ్యక్తం అవుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా తమ గోడు వినాలని వారు కోరుతున్నారు.

మా ఇద్దరి మధ్య 250 కి.మీ. దూరం



నేను మహబూబాబాద్‌లో, నా భర్త సిద్దిపేట పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్నాం. ఇద్దరు పనిచేసే ప్రాంతాల మధ్య దూరం 250 కిలోమీటర్లు. దీంతో ఇద్దరు పిల్లలను చెరొకరం పంచుకున్నాం. తీవ్రమైన మానసిక వ్యథతో 13 నెలలుగా విధులు నిర్వర్తిస్తున్నాం. తల్లిగా ఓడిపోతున్నాను. భర్తకు దూరమవుతున్నాను. ఈ బదిలీల్లోనైనా న్యాయం జరుగుతుందనే ఆశ కన్పించడం లేదు.

– ఎస్.మమత (ఎస్‌జీటీ, మహబూబాబాద్)

50,000 మంది టీచర్లకు బదిలీ!

ఉపాధ్యాయ ఖాళీలు లెక్కతేల్చే పనిలో అధికారులు

- అనివార్యంగా బదిలీ కావలసిన వారు 25 వేల మంది
- ఐదేళ్లుగా ఒకే స్కూల్‌లో పనిచేస్తున్నవారు 25 వేల మంది
- పదోన్నతులపై ప్రభావం చూపించనున్న స్పౌజ్ కేసులు
- పదోన్నతులు, బదిలీలపై మంత్రి సబిత సమీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ వేగం పుంజుకుంది. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాఠశాల విద్య డైరెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం ఈ అంశంపై అధికారులతో చర్చించారు. శనివారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. మరోవైపు పదోన్నతులకు వీలుగా ఖాళీలను లెక్క తేల్చే పనిలో జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటివరకు సేకరించిన వివరాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మంది టీచర్లకు స్థాన చలనం కలగనుంది. ఒకేచోట 8 ఏళ్ల సర్వీసు నిండి అనివార్యంగా బదిలీ అవ్వాల్సిన వాళ్లు 25 వేల మంది ఉంటే..ఐదేళ్లుగా ఒకే స్కూల్‌లో పనిచేస్తున్న 25 వేల మంది కూడా బదిలీకి దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇదిలావుండగా పలు ఉపాధ్యాయ సంఘాలు బదిలీలు ప్రహసనంగా మారాయని, నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ పలుకుబడి ఉన్నవాళ్లకు కోరిన ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. అధికారులను నిలదీస్తే పైనుంచే పైరవీలు వస్తున్నాయని వారు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారని, దీనిపై ఆందోళనలకు సిద్ధమవుతున్నట్లు తెలిపాయి.

సొంత జిల్లాల్లో ఖాళీలన్నీ స్పౌజ్‌లతోనే భర్తీ!

భార్యాభర్తల (స్పౌజ్) బదిలీలకు ప్రభుత్వం అనుమతించడం టీచర్ల పదోన్నతిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. స్పౌజ్‌ల్లో 80 శాతం మంది మహిళలే ఉన్నారు. వీళ్లంతా స్కూల్ అసిస్టెంట్లు. 317 జీవో కారణంగా వేర్వేరు జిల్లాలకు బదిలీ అయ్యారు. స్కూల్ అసిస్టెంట్ ఖాళీల్లో 70 శాతం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు (ఎస్జీటీలు) పదోన్నతులు ఇవ్వడం ద్వారా, 30 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేస్తారు. ప్రస్తుతం దాదాపు 427 మంది స్పౌజ్‌లను సొంత ప్రాంతాలకు పంపుతున్నారు. ఖాళీ అయ్యే స్కూల్ అసిస్టెంట్ స్థానాల్లో ముందుగా వీరిని నియమిస్తారు. ఫలితంగా 13 జిల్లాల్లో ఎస్‌జీటీలు స్కూల్ అసిస్టెంట్స్‌గా పదోన్నతి పొందేందుకు ఉన్న ఖాళీల సంఖ్య తగ్గే అవకాశం కన్పిస్తోంది. ఇంగ్లిష్, గణితం, భౌతిక శాస్త్రం సబ్జెక్టుల్లో పదోన్నతులకు ఎక్కడా అవకాశం లేకుండా పోతోంది. దీనిపై ఎస్‌జీటీలు మండిపడుతున్నారు. మరోవైపు స్పౌజ్‌లు తిరిగి తమ జిల్లాలకు రావడంతో, వారు ఇప్పటివరకు పనిచేసిన 19 జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లో తక్కువ సీనియారిటీ ఉన్న ఎస్‌జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందే అవకాశం వస్తోంది.

ప్రక్రియ మొదలుకాక ముందే బదిలీలు!

బదిలీల ప్రక్రియ మొదలవ్వక ముందే దాదాపు 120 మందిని కోరుకున్న ప్రాంతాలకు పంపుతూ ఉత్తర్వులు వెలువడటం తీవ్ర దుమారం రేపుతోంది. మరో 200 వరకు ఇదే విధమైన సిఫారసులు వచ్చినట్టు సంఘాల నేతలు చెబుతున్నారు. ఈ అంశంపై ఉపాధ్యాయ నేతలు మంత్రి సబిత వద్ద తీవ్ర నిరసన తెలిపారు. మరోవైపు పైరవీల జోరు పెరగడంతో టీచర్లు కొంతమంది ఉపాధ్యాయ సంఘాల నేతలను, రాజకీయ ప్రముఖులను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో కొంతమంది మధ్యవర్తులు పుట్టుకొస్తున్నారు. పైనుంచి బదిలీ ఆదేశాలు తెప్పిస్తామని చెబుతూ రూ. లక్షల్లో డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

నేటి నుంచి నిరసనలు: యూటీఎఫ్

బదిలీల్లో పైరవీలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా శనివారం నుంచి నిరసనలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపునిచ్చినట్లు టీఎస్ యూటీఎఫ్ నేత చావా రవి తెలిపారు. ప్రభుత్వమే పైరవీలకు తెరలేపడం టీచర్లలో అశాంతి కల్గిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. టీచర్లందరికీ వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.

29న డైరెక్టరేట్ ముట్టడి: టీఎస్పీటీఏ

స్పౌజ్ టీచర్లు 2,200 మంది వేర్వేరు ప్రాంతాల్లో ఉంటే ఓటు హక్కు ఉండే 625 మంది స్కూల్ అసిస్టెంట్లకే బదిలీకి కల్పించడం అన్యాయమని టీఎస్పీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ షౌకత్ అలీ అన్నారు. మిగతా స్పౌజ్‌ల సంగతి తేల్చకుంటే 29న పాఠశాల విద్యా డైరెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.



బారులు తీరిన టీచర్లు

ఉపాధ్యాయ పదోన్నతులకు సంబంధించి నల్లగొండలో ప్రారంభమైన సర్టిఫికెట్ల పరిశీలనకు ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం (డైట్) వద్ద బారులుతీరారు.

- నల్లగొండ

'మత్తు' కట్టడికి పటిష్ట వ్యూహం: డీజీపీ

సాక్షి, హైదరాబాద్: సమాజాన్ని భ్రష్టుపట్టించే మాదక ద్రవ్యాలపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని డీజీపీ అంజనీకుమార్ ఆదేశించారు. యువతతోపాటు సమాజంలోని కొన్ని వర్గాల్లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యవస్థీకృత నేరంగా మారిందని... డ్రగ్స్ పంపిణీని అరికట్టడానికి శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు చేయాలన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వెనకున్న పూర్తి లింకులను పకడ్బందీగా తెలుసుకోవాలని డీజీపీ సూచించారు. డ్రగ్స్ కట్టడిలో భాగంగా తెలంగాణ పోలీసు శాఖ సీఐడీ విభాగం అదనపు డీజీ మహేశ్ భగవత్ అధ్యక్షతన శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనిట్ల పోలీస్ అధికారులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. డీజీపీ కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ శిక్షణను ప్రారంభించిన సందర్భంగా డీజీపీ అంజనీకుమార్ కీలక అంశాలపై మాట్లాడారు. కాగా, గత మూడేళ్లలో 3,133 కేసులు నమోదు చేయడంతోపాటు 7498 మందిని అరెస్టు చేసింది. అలాగే 416 మంది నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసింది.

జౌళి బోర్డును కోల్‌కతా బోర్డులో కలపొద్దు

కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్‌కు మాజీ ఎంపీ మల్లురవి లేఖ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో ఉన్న జాతీయ జౌళి బోర్డును కోల్‌కతా బోర్డులో కలపొద్దని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లురవి కోరారు. ఈ మేరకు కేంద్ర జౌళి శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌కు శుక్రవారం ఆయన లేఖ రాశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన జౌళి పరిశ్రమ ఈ బోర్డుపైనే ఆధారపడి పనిచేస్తోందని, ఇప్పుడు ఆ బోర్డును కోల్‌కతా బోర్డులో కలిపితే స్థానిక పరిశ్రమల రంగానికి నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

క్రమశిక్షణ లేకపోతే బుద్ధి నిలకడగా, మనసు ఏకాగ్రతగా ఉండదు. నిలకడ, ఏకాగ్రత లేకపోతే మనశ్శాంతి ఎక్కడి నుంచి వస్తుంది?
– భగవద్గీత

సాక్షి

శనివారం, జనవరి, 28

జర్మనీ నిర్ణయం సబబేనా?

ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధం రేపో మాపో పరిసమాప్తం కాకతప్పదని, పెను సంక్షోభంలో చిక్కుకున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు కోలుకోవటం మొదలవుతుందని ఆశిస్తున్నవారిని తాజా పరిణామం తీవ్ర నిరాశలోకి నెట్టింది. ఉక్రెయిన్‌కు లెపార్డ్ 2 రకం భారీ యుద్ధ ట్యాంకులు అందజేయడానికి గత కొన్ని నెలలుగా ససేమిరా అంటున్న జర్మనీ ఎట్టకేలకు తన నిర్ణయాన్ని మార్చుకుంది. యుద్ధంలో ఆయుధ సంపత్తి ప్రధానమే కావొచ్చుగానీ... ప్రతిఘటనదారుల సంకల్పబలం ముందు అవి దిగదుడుపేనని యుద్ధ నిపుణులంటారు. ఒక చిన్న దేశం వియత్నాం ముందు అరవయ్యో దశకంలో అమెరికా చిత్తయిన ఉదంతం మొదలుకొని తాజాగా రష్యాపై ఉక్రెయిన్ సాగిస్తున్న ప్రతిఘటన వరకూ అది రుజువవుతూనే ఉంది. నెలరోజుల్లో ఉక్రెయిన్‌ను పాదాక్రాంతం చేసుకోవాలనుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్ ఏడాది గడిచాక దాన్నుంచి బయటి కొచ్చే దారీతెన్నూ కానక ఆపసోపాలు పడుతున్నారు. అందరూ ఏకమై పుతిన్ మెడలువంచి ఆయన్ను చర్చలకు ఒప్పించాల్సివున్న ఈ తరుణంలో ఉక్రెయిన్‌కు ఆయుధాలందిస్తూ ఆ యుద్ధాన్ని మరింత సాగదీసేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. అయితే జర్మనీ అంత సులభంగా ట్యాంకు లివ్వటానికి అంగీకరించలేదు. అమెరికా తన ఎం1 అబ్రామ్ ట్యాంకుల్ని కూడా తరలించేందుకు ఒప్పుకుంటేనే లెపార్డ్ 2 ట్యాంకులు అందిస్తామన్న షరతు విధించింది. ఈ విషయంలో జర్మనీ చాన్సలర్ ఒలోఫ్ షుల్జ్ మనసు మారేలా చేసేందుకు అమెరికా అన్నివిధాలా ప్రయత్నించింది. జర్మనీలోని పాలక, ప్రతిపక్షాలతోపాటు నాటో కూటమి దేశాలు సైతం షుల్జ్‌పై ఒత్తిళ్లు తెచ్చాయి. నేరుగా ఉక్రెయిన్‌కు ఇవ్వటం అభ్యంతరమైతే తమకు సరఫరా చేసిన లెపార్డ్‌లివ్వటానికైనా అనుమతించాలని పోలెండ్ గత కొన్ని వారాలుగా డిమాండ్ చేస్తోంది. నిజానికి ఇది ట్యాంకు లివ్వటంతో ఆగదు. విమాన విధ్వంసక చీతా ట్యాంకులివ్వాలని కూడా జర్మనీపై ఒత్తిడి ఉంది. వాటితోపాటు ఉక్రెయిన్ ఎఫ్–16 యుద్ధ విమానాలివ్వాలని చాన్నాళ్లుగా అమెరికాను కోరుతోంది.

ఉక్రెయిన్‌కు ఏడాదిగా జర్మనీ చేస్తున్న సాయం తక్కువేం కాదు. కానీ అదంతా నాటో కూటమి సాయంలో భాగంగా ఉంది. ప్రత్యక్షంగా ట్యాంకులు పంపటం మొదలైతే ఆ చర్య రష్యాను రెచ్చగొడుతుందన్న భయం షుల్జ్‌కి ఉంది. అదే జరిగితే ఆర్థికంగా, సైనికంగా కూడా జర్మనీ నష్టపోతుందని ఆయన అంచనా. దానికితోడు అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ పుణ్యమా అని జర్మనీకి ఆ దేశంపై ఎన్నో సంశయాలున్నాయి. యుద్ధంలోకి దిగాక చివరివరకూ అమెరికా అండగా ఉంటుందా అన్నది దాని ప్రధాన సందేహం. అబ్రామ్ ట్యాంకులు విడుదల చేయటం ససేమిరా కుదరదని అధ్యక్షుడు బైడెన్ చెప్పటం ఆ సందేహాన్ని మరింత పెంచింది. అమెరికా రక్షణమంత్రి లాయిడ్ ఆస్టిన్ జర్మనీని ఈ విషయంలో ఒప్పించటానికి అన్నివిధాలా ప్రయత్నించి విఫలమయ్యాక చివరకు బైడెన్‌ను అంగీకరింపజేయగలిగారు. అయితే తన అమ్ములపొదిలో ఉన్న ట్యాంకులు కాకుండా తయారీదారులనుంచి కొనుగోలు చేసుకోవాలని అమెరికా అంటోంది. జర్మనీకి మరో సమస్య కూడా ఉంది. దానిదగ్గర ప్రస్తుతం లెపార్డ్ 2 ట్యాంకులు భారీ సంఖ్యలో లేవు. ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో 4,000 వరకూ ఉండే ఆ ట్యాంకుల సంఖ్య ఇప్పుడు 300కు పడిపోయింది. వాటిని పెంచుకోవాలంటే చాన్నాళ్లు పడుతుంది. పైగా తోటి యూరప్ దేశాలకు ఇప్పటికే ఎగుమతి చేసిన ట్యాంకులకు విడి భాగాలు అందించాల్సివుంది. నిజానికి అమెరికా సైతం అలాంటి అభ్యంతరమే చెప్పింది. ప్రస్తుతం తమ బలగాల దగ్గరున్న 4,000 ట్యాంకులు దేశ భద్రతరీత్యా కదల్చటం సాధ్య పడదంటున్నది. అందుకు బదులు కొనుగోలు చేసుకోవాలంటున్నది. అమెరికా తయారీ అబ్రామ్‌లముందు లెపార్డ్‌లు కొంత తీసికట్టే. గల్ఫ్ యుద్ధంలో, 2003 నాటి ఇరాక్ దురాక్రమణలో, అఫ్గానిస్తాన్ దురాక్రమణలో అమెరికాకు అబ్రామ్‌లు అక్కరకొచ్చాయని సైనిక నిపుణులంటారు. అయితే ఇందుకు ఎంతో సమన్వయం అవసరం. అఫ్గాన్‌లో మందుపాతరలనూ, ఇతర బాంబు దాడులనూ అవి తట్టుకున్నాయి. కానీ వాటి సాంకేతికత అత్యంత సంక్లిష్టమైనది. నెలల తరబడి శిక్షణ ఉంటేనే వాటిని వినియోగించటం సాధ్యం. అదీగాక అబ్రామ్‌ల వ్యయం, వాటి విడి భాగాలు భారీ ఖర్చుతో కూడుకున్నవి. ఈ విషయంలో లెపార్డ్‌లు మెరుగే అయినా వాటిపైన కూడా ప్రత్యేక శిక్షణ అవసరం. అందువల్ల తక్షణం ఈ ట్యాంకులు యుద్ధ క్షేత్రానికి రాలేవు.

తనపై నేరుగా లడాయికి దిగే ధైర్యం నాటోకు ఉండదని, ఆ కూటమిలో చీలిక రావటం ఖాయమని మొదటినుంచీ అనుకుంటున్న రష్యాకు జర్మనీ నిర్ణయం శరాఘాతమే. నేరుగా తమ గడ్డపై దాడి చేయగల భారీ ట్యాంకుల్నీ, అధునాతన యుద్ధ విమానాలనూ మోహరిస్తే ఆత్మ వినాశనం కొని తెచ్చుకున్నట్టేనని రష్యా చేస్తున్న హెచ్చరికల సారాంశం పుతిన్ మొదటినుంచీ బెదిరిస్తున్న అణుయుద్ధమే అయితే ప్రపంచానికి చేటుకాలం దాపురించినట్టే. తమ ఆహార అవసరాల్లో 80 శాతం వరకూ ఉక్రెయిన్‌పైనే ఆధారపడ్డ ఈజిప్టువంటి దేశాలు ఇప్పటికే సంక్షోభంలో పడ్డాయి. ఇతరత్రా ఉత్పత్తులు మందగించి ప్రపంచ దేశాలన్నీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో పరిస్థితి మరింత క్షీణించేలా మారణాయుధాలు తరలించటంకాక యుద్ధం ఆపేందుకు అవసరమైన ఇతరత్రా చర్యలన్నిటిపైనా దృష్టి సారించాలి. ఆ విషయంలో శాంతిని కోరుకునే ప్రపంచ ప్రజానీకం ఒత్తిళ్లు తీసుకురావాలి. అప్పుడు మాత్రమే పరిస్థితి కుదుటపడుతుంది.

పులులు పెరిగాయ్... బతికే చోటేదీ?

విశ్లేషణ



ఆనంద బెనర్జీ

దేశంలో పెద్ద పులుల సంఖ్య పెరుగుతోంది. కానీ ప్రతి మూడు పులుల్లో ఒకటి రిజర్వ్ ఫారెస్టుకు వెలుపల ఉండాల్సి వస్తోంది. ఇది మానవ–జంతు ఘర్షణలకు దారి తీస్తోంది. రక్షిత ప్రాంతాల వెలుపల పులులు మాత్రమే కాక, అనేక జీవజాతులు కూడా మనుగడ కోసం పోరాడుతున్నాయి. 80–100 పులుల జనాభాను పోషించడానికి పెద్దపులులకు 800 నుంచి 1,200 చదరపు మీటర్ల మేర ఇతరులు చొరబడలేని స్థలం అవసరం. కానీ, మనలాంటి చిక్కటి జనసాంద్రత కలిగిన దేశంలో... అలాంటి సహజమైన అరణ్యాలను ఆశించడం ఆశావహమైన కోరిక మాత్రమే. వన్యప్రాణులు సంచరించే స్థలాలు తగ్గిపోతున్నట్లు పలు శాస్త్రీయ నివేదికలు చెబుతున్నప్పటికీ మనం ఇప్పటికీ పులుల సంఖ్య పెరుగుదలను మాత్రమే పట్టించుకుంటున్నాము.

ఈ సంవత్సరం వార్తాయోగ్యమైన రెండు ఘటనలు జరిగాయి. ఒకటి – ప్రపంచంలోనే అత్యధిక జనాభా విషయంలో భారతదేశం చైనాను దాటేసింది. కేవలం 2 శాతం భూప్రాంతం కలిగిన దేశం 145 కోట్ల ప్రజలు లేదా విశ్వ మానవ జనాభాలో 18 శాతం మందికి ఆవాస ప్రాంతంగా ఉంటోందని ఊహించండి. జనసాంద్రత రీత్యా, భారతదేశం... చైనా కంటే మూడు రెట్ల రద్దీతో ఉంటోంది. రెండు – భారతదేశంలో అత్యంత విజయవంతమైన వన్యప్రాణి రక్షణ పరిశ్రమ అయిన ప్రాజెక్ట్ టైగర్ ఏర్పడి ఈ ఏప్రిల్ నాటికి 50 ఏళ్లు దాటుతుంది. పెరుగుతున్న పులుల సంఖ్య విషయంలో రికార్డు అంచనాలు ఉన్నాయి. 2022 నాటి పెద్దపులుల జనాభా లెక్కలు కూడా ఈ సంవత్సరంలోనే విడుదల చేయవచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే దేశంలో పులుల సంఖ్య 3 వేలను దాటి ఉంటుందని ఒక అంచనా.

దేశంలో ప్రాజెక్టు టైగర్ 1973 ఏప్రిల్ 1న ప్రారంభమైంది. 2014 నాటికి దేశంలో 2,226 పులులు ఉండగా, 2018లో వీటి సంఖ్య 2,967కి పెరిగిందని జాతీయ పులుల పరిరక్షణ అథారిటీ (ఎన్టీసీఏ) నివేదించింది. దేశంలో పులుల సంఖ్యలో అమాంతం 33 శాతం పెరుగుదల నమోదు కావడం మీడియా దృష్టిని ఆకర్షించింది. ప్రపంచంలో అతిపెద్ద వన్యప్రాణి సర్వేగా ఇది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులకు ఎక్కింది. 2006లో పులుల జనాభా లెక్కల ప్రక్రియను శాస్త్రీయమైన బిగువుతో, కెమెరా ట్రాప్ టెక్నాలజీతో సరిదిద్దినప్పటి నుంచి నాలుగేళ్లకోసారి జరిపే పులుల జనాభా లెక్కల్లో సంఖ్యలు పెరుగుతూ వచ్చాయి.

2006లో దేశంలో 1411 పులులు ఉండేవనీ, 2010 నాటికి వాటి సంఖ్య 1706కు పెరిగిందనీ ఎన్టీసీఏ అంచనా వేసింది. విజయవంతమైన పులుల పరిరక్షణ ఏర్పాట్లకు ఈ సంఖ్యలు సాక్ష్యంగా నిలుస్తున్నప్పటికీ దీనిలో నాణేనికి మరో వైపు కూడా ఉంది. పులులు ఒంటరి జీవులు. వీటికి నిర్దిష్టంగా స్థలం అవసరం. పెద్దపులులు వాటితోపాటు సాధారణంగా వన్యప్రాణులు కూడా మానవులు గీసిన హద్దులు కానీ, మ్యాప్‌లను (జాతీయ పార్కులను, వన్యప్రాణి కేంద్రాలను లేదా టైగర్ రిజర్వ్‌లను) కానీ అర్థం చేసుకోవు. గత నెల అస్సాంలో, ఒక పులి బ్రహ్మపుత్ర నదీ ప్రవాహం వెంబడి 120 కిలోమీటర్ల దూరం నడిచి వచ్చిన వార్త పతాక శీర్షికలకు ఎక్కింది. ఒరాంగ్ నేషనల్ పార్కు నుంచి గౌహతిలోని ఉమానంద ద్వీపం వరకు అది నడిచివచ్చింది. 79 చదరపు కిలోమీటర్ల పరిధిలోని చిన్న కీలకమైన ప్రాంతంలో ఉండే ఒరాంగ్, తనలో పెరుగుతున్న పులుల జనాభాకు తగినట్టు ఆశ్రయం ఇవ్వలేక కొట్టుమిట్టాడుతోంది. మానవుల ఆవాసానికి లోపలా, వెలుపలా పులులు తిరగడం రోజువారీ వ్యవహారం అయింది.

బిహార్ పశ్చిమ చంపారణ్ ప్రాంతంలోని వాల్మీకి టైగర్ రిజర్వ్ వంటి అతి పెద్ద రక్షిత ప్రాంతాలు కూడా ఇదే విధమైన సవాళ్లను



ఎదుర్కొంటున్నాయి. దశాబ్దం క్రితం వాల్మీకి టైగర్ రిజర్వ్... పెద్ద పులుల సంరక్షణ మ్యాప్‌లో స్థానం కోల్పోయింది. కానీ బిహార్ అటవీ శాఖ, ఇతర లాభరహిత పరిరక్షణ సంస్థల ప్రయత్నాల కారణంగా ఇప్పుడది భారతదేశంలోనే అత్యుత్తమంగా పనిచేసే టైగర్ రిజర్వులలో ఒకటిగా నిలిచింది. 2021లో కన్జర్వేషన్ అస్యూర్డ్ టైగర్ స్టాండర్డ్స్ (సీఏటీఎస్) గుర్తింపు పొందిన దేశంలోని 14 టైగర్ రిజర్వులలో ఒకటయ్యింది. పులుల పరిరక్షణలో ఉత్తమ ఆచరణలు, ప్రమాణాలకు సంబంధించి ఇది ఒక అంతర్జాతీయ గుర్తింపు.

అయితే ఈ విజయం అటు అటవీ శాఖకూ, ఇటు స్థానిక కమ్యూనిటీకీ కొత్త తలనొప్పికి కారణమైంది. గత అక్టోబర్‌లో తొమ్మిది మంది ప్రజల హత్యకు కారణమైన మూడేళ్ల మగపులిపై కనిపిస్తే కాల్చివేత ఆదేశం ఇవ్వాల్సి వచ్చింది. ఆ తర్వాత దాన్ని కాల్చి చంపారు. జనవరి 10న ఈ ప్రాంతం నుంచే ఒక మైనర్ బాలికపై మరో పులి దాడి చేసిన ఘటన వార్తలకెక్కింది.

దేశవ్యాప్తంగా ఇలాంటి కొన్ని దురదృష్టకర ఘటనలు జరగడంతో ప్రజలు పులులకు వ్యతిరేకంగా మారుతున్నారు. మన జాతీయ జంతువును కాపాడే మంచి పరిరక్షణ కృషికి వీరు వ్యతిరేకమవుతున్నారు. పెరుగుతున్న పులుల సంఖ్య పులుల పరిరక్షణ విజయానికి తిరుగులేని నిదర్శనం కాగా, అదే సమయంలో దానికి వ్యతిరేక పరిస్థితి కూడా రంగం మీదికొచ్చింది. ఎన్టీసీఏ అంచనా ప్రకారం చూసినప్పటికీ దేశంలోని ప్రతి మూడు పులుల్లో ఒకటి రక్షిత అభయారణ్య ప్రాంతాల వెలుపల నివసిస్తున్నాయి. ప్రపంచ పులుల జనాభాలో 70 శాతం ఉన్న భారత్ అతిపెద్ద టైగర్ జనాభా కేంద్రంగా వెలుగుతోంది. 1973లో దేశంలో 9 టైగర్ రిజర్వులు ఉండగా 2022 నాటికి ఈ సంఖ్య 53కు పెరిగింది.

ఈ వెయ్యికిపైగా పులులను తరచుగా భారతదేశ నిరుపేద, నిరాశ్రయ పులులుగా పేర్కొంటూ ఉంటారు. ఇప్పుడు దేశంలోని 53 టైగర్ రిజర్వులు 75 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండవచ్చు.

కానీ వీటిలో ఎక్కువ భాగం మనుషులు నివసించే ప్రాంతాలే. ఇవి చిన్నవిగానూ, లేదా ముక్కచెక్కలైపోయిన అటవీ భాగాలుగా ఉంటూ వస్తున్నాయి. టైగర్ రిజర్వులు పులులకు, వన్యప్రాణులకు మాత్రమే సంబంధించినవని అందరూ ఊహిస్తుంటారు కానీ వాటిలో అనేక గ్రామీణ ఆవాసాలు ఉంటున్నాయి. వేలాది ప్రజలు, పశువులు ఉండటంతోపాటు రోడ్లు, రైలు పట్టాలు కూడా వీటిగుండా పోతుంటాయి. దీనికి పశ్చిమబెంగాల్ లోని బక్సా టైగర్ రిజర్వ్ ఒక మంచి నిదర్శనం అని చెప్పాలి.

కేంద్ర ప్రాంతంలో కనీసం 80–100 పులుల జనాభాను పోషించడానికి పెద్దపులులకు 800 నుంచి 1,200 చదరపు మీటర్ల మేరకు ఇతరులు చొరబడకూడని స్థలం అవసరమవుతుందని రీసెర్చ్ డేటా సూచిస్తోంది. కానీ మనలాంటి చిక్కటి జనసాంద్రత కలిగిన దేశంలో, సహజమైన అరణ్యాలు కోరుకోవడం ఆశావహమైన కోరిక మాత్రమే. దానికి తోడుగా రెండు లేదా అంతకంటే ఎక్కువ రక్షిత ప్రాంతాలను అనుసంధానిస్తున్న అటవీ కారిడార్లు... మనుషులు, వన్యప్రాణుల మధ్య ఇరుకైన స్థలాన్ని మాత్రమే మిగుల్చుతున్నాయి. భారతదేశ స్థానిక ప్రజలు, వెనుకబడిన కమ్యూనిటీలు సాంస్కృతికంగా, సామాజికంగా, ఆర్థికంగా ఈ రిజర్వు ప్రాంతాల్లో నివసించాల్సిన పరిస్థితుల్లోనే ఉన్నారు. మధ్యప్రదేశ్‌లోని బాంధవ్‌గఢ్ టైగర్ రిజర్వ్ లోపల, వెలుపల నివసిస్తున్న ప్రజలు ఇప్పుడు అదనంగా ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వస్తున్న అటవీ ఏనుగులతో కూడా వ్యవహరించాలి. ఉమరియా జిల్లా (బాంధవ్‌గఢ్) ప్రజలకు తరతరాలుగా ఏనుగులతో తలపడిన చరిత్ర లేదు. కానీ ఇప్పుడు మాత్రం మానవులు–పులులు, మానవులు–ఏనుగుల మధ్య ఘర్షణ తలెత్తే పరిస్థితులు రావడం వన్యప్రాణుల పరిరక్షణలో కీలకమైన సవాలుకు దారితీస్తోంది.

పెరుగుతున్న పులుల సంఖ్యలు మాత్రమే విజయానికి కొలబద్దగా ఉంటున్న సమాజంలో పులుల సంఖ్య క్షీణించడం సమీప భవిష్యత్తులో సాధ్యం కాదు. ప్రకృతి మనకు విధిస్తున్న పరిమితులను గుర్తించి మసులుకోవడం మనకు సాధ్యం కావడం లేదు. వన్యప్రాణులు సంచరించే స్థలాలు తగ్గిపోతున్నట్లు పలు శాస్త్రీయ నివేదికలు చెబుతున్నప్పటికీ మనం పులుల సంఖ్య పెరుగుదలను మాత్రమే పట్టించుకుంటున్నాం. పులులు, సింహాలు, ఏనుగులు లేదా ఖడ్గమృగాల వంటి జీవుల సంఖ్య పట్ల మన ఆసక్తి పెరుగుతోంది. దేశంలో మరిన్ని ప్రాంతాలు శీఘ్రంగా నగరీకరణకు గురవుతుండడంతో... మన నగరాల అంచుల్లో, తగ్గిపోతున్న అడవుల్లో, వ్యవసాయ క్షేత్రాల్లో లేదా ఎస్టేట్‌లలో పులులు ఉనికి కోసం పోరాడుతున్నాయి. ఒక్క పులులే కాదు... ఈ మారుతున్న ప్రపంచంలో తమ ఉనికి కోసం అనేక జీవజాతుల పరిస్థితీ అదే!

వ్యాసకర్త రచయిత, ఆర్టిస్ట్, వన్యప్రాణి పరిరక్షణవాది
('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

రోజూ పరీక్షే!



ఇంట్లో మీ అమ్మగారి సమయ నిర్వహణ నైపుణ్యాలను కనుక మీరు నిశితంగా గమనిస్తే, పరీక్షలకు సిద్ధమయేందుకు మీరు మీ సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలనేది మీకు చక్కగా అర్థమౌతుంది.

– నరేంద్ర మోదీ, భారత ప్రధాని

బిగ్ బ్రదర్స్



రిపబ్లికన్ పార్టీ రష్యా ఏజెంటుగా మారిందని తెలిస్తే రొనాల్డ్ రీగన్ మృతదేహానికి గుండెపోటు వస్తుంది. ట్రంప్, పుతిన్‌లు ఎప్పుడూ కూడా అమెరికా ప్రయోజనాల గురించి ఆలోచించలేదు, ఎప్పటికీ కూడా ఆలోచించబోరు.

– అరిక్ ఎల్.మన్, జాతీయవాది

హి(ం)డెన్ అజెండా



హిండెన్‌బర్గ్ అపరాధ పరిశోధన: కంపెనీ స్థాపన 2017. కంపెనీ సిబ్బంది 10 మంది. ఇంత పెద్ద పరిశోధనా సంస్థ అదానీ గ్రూపును బెదిరిస్తోంది. ఇదంతా చూస్తుంటే అమెరికా వారి సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ భారత దేశాన్ని కిందికి పడదోయడానికి పన్నిన కుట్రలా ఉంది.

– క్యూరియస్ శుభమ్, ట్రేడర్

మంచిదైంది!



పనివారీగా నాకు ఆసక్తి కలిగించే విషయం ఏదీ కనబడకపోయే సరికి 2017 చివరిలో అకడమిక్ ఎకానమిస్టుగా నేను నా కెరియర్‌ను అర్ధంతరంగా ముగించాను. అకాడమీలలో నేటి స్థితిని చూస్తుంటే ఆనాడు నేను తీసుకున్న నిర్ణయం నా కెరియర్‌లోనే అత్యుత్తమ మైనదిగా అనిపిస్తోంది.

– తౌమస్ మలినెన్, ఎకనమిస్ట్

అత్యుత్సాహం



సోషల్ మీడియా యూజర్లు చాలా మంది కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ తన తండ్రిని కలుసుకున్నారంటూ కొన్ని ఫొటోలను షేర్ చేస్తున్నారు. నిజానికవి వారణాసిలో తమిళకవి భారతీయార్ కుటుంబ సభ్యులను ఆమె కలుసుకున్నప్పటి ఫొటోలు.

– మొహమ్మద్ జుబెయిర్, ఫ్యాక్ట్ చెకర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

టీచర్లందరికీ అవకాశం

తెలంగాణ ప్రభుత్వం దాదాపు 8 సంవత్సరాల తర్వాత ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియకు అనుమతి ఇచ్చింది. దాదాపు 25 వేల నుండి 30 వేల మంది ఉపాధ్యాయులు ఇప్పుడు బదిలీ అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం గత సంవత్సరం 317 జీవో ద్వారా కొత్త జిల్లాలకి సీనియర్, జూనియర్ లిస్టుల పేరుతో ఉపాధ్యాయులను కేటాయించింది. మొత్తం లక్ష 5 వేల మందిలో 25 వేల మంది ఒక జిల్లా నుండి మరొక జిల్లాకి బదిలీ అయ్యారు. మిగతా 80 వేల మంది పని చేసే చోటే మళ్ళీ పోస్టింగ్ పొందినారు. ఇప్పుడు అందరు టీచర్లకు బదిలీ అవకాశం ఇవ్వాలి. నచ్చిన చోట ఖాళీ ఉంటే వెళ్ళే వెసులుబాటు ఇవ్వాలి. కొందరి లబ్ధి కోసం 317 జీవో అమలు చేసి మళ్ళీ ఇప్పడు వేరే జిల్లాలకి బదిలీ అయిన టీచర్లకు 2 సంవత్సరాల సర్వీస్ రూల్ ఉండాలనడం అర్థం లేని నిబంధన.

ఇక 80 వేల ఉద్యోగాల్లో భాగంగా ఇప్పటికే వివిధ ఉద్యోగాలకి ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వడం, నోటిఫికేషన్లు జారీ కావడం జరుగుతోంది. కానీ టెట్ ముగిసి 8 నెలలు అవుతున్నా ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి టీఆర్టీ నోటిఫికేషన్ జారీకి ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వకపోవడం వల్ల 4 లక్షల మంది అభ్యర్థులు నిరాశలో ఉన్నారు. టెట్‌లో ఉత్తీర్ణత పొందనివారూ, కొత్తగా డీఎడ్, బీఎడ్ పూర్తి చేసిన బ్యాచులవారూ మరో టెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఖాళీల వివరాలు వెల్లడి అవుతాయి. సంవత్సరం క్రితం ఆర్థిక శాఖ అనుమతి కోసం 9,600 పోస్టులతో విద్యాశాఖ అధికారులు ఫైల్ పంపినారు. అది ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. ఇప్పుడు టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తయిన తర్వాత ఏర్పడే 10 వేల ఖాళీలను కూడా పాత ఖాళీల్లో కలిపి భారీ డీఎస్సీ విడుదల చేయాలని నిరుద్యోగులు కోరుకుంటున్నారు.

– రావుల రామ్మోహన్ రెడ్డి, తెలంగాణ డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం అధ్యక్షులు

సారాంశం

సరికొండ చలపతి

సీతమ్మ వాకిట్లో... మధ్యతరగతి

బడ్జెట్ ముందు



...తర్వాత



ఇది గత బడ్జెట్ తర్వాత సోషల్ మీడియాలో బాగా తిరిగిన మీమ్. బడ్జెట్ ప్రసంగం సమయంలో, ముగిసిన తర్వాత మధ్యతరగతి పరిస్థితి ఇదీ అని... మధ్యతరగతికి బడ్జెట్‌లో ఒరిగిందేమీ లేదంటూ దీనికి మోదీ ఫొటోనే వాడేసుకున్నారు.

బడ్జెట్ ఏమి తెస్తుందో లేదో తెలియదు కానీ, ప్రతిసారీ కావల్సినన్ని చెణుకులు, మీమ్స్ మాత్రం తెస్తోంది.

....

మధ్యతరగతి ఇళ్లలో తండ్రి, కొడుకుల మధ్య తరచూ వినబడే సంభాషణట ఇది వినండి...

'కొనడం ఎన్ని రోజులు పోస్టుపోన్ చేస్తావ్ నాన్నా, ఈ ఫోన్ చూడు.'

– ... దీనికి ఏమైందిరా?

'నాన్నా... ఎన్ని సార్లు అడుగుతావ్? రోజుకు 50 సార్లు హ్యాంగ్ అవుతోంది, మాట్లాడుతూంటేనే కట్ అవుతోంది.'

– ...అవును, కానీ మంచి ఫోనురా...

'మంచిదే కానీ, పాతదయిపోయింది. కొత్తది కొనాల్సిందే...'

– .. సరే, చూద్దాం...

ఆ తర్వాత రోజు..

'ఫోన్ సంగతి ఏమైంది నాన్నా...'

– సరే ఫస్ట్‌కు చూద్దాం...

ఓ నెల తర్వాత..

'..ఫొటోస్, ఫైల్స్ మిస్సవుతున్నాయి నాన్నా..'

– ..ఏదీ చూద్దాం..

'..చూడడానికి ఏముంది.. అన్నీ పోయాయి.. కొత్తఫోన్ కొను నాన్నా.

– ..అలాగే చూద్దాం..

మధ్యతరగతి జీవితాల్లో చూద్దాం... అంటే వారాలు నెలలు సంవత్సరాలు.. అన్నమాట!

....

కొడుకు తండ్రివైపు ఆశగా చూస్తూనే ఉంటాడు.. ఏదో ఒకరోజు కొనివ్వకపోతాడా...అని.

విచిత్రం ఏమిటంటే మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్ కూడా అంతే..

ఈసారైనా బడ్జెట్‌లో ఏదైనా ఉండకపోతుందా అని ఇలా..

కొడుకుకు దొరికిన సమాధానమే కనిపిస్తుంది..

– నెక్స్ట్ బడ్జెట్‌లో చూద్దాం.. అని.

అందుకే ప్రతి బడ్జెట్‌లో శాలరీ శ్లాబ్‌లు.. తాయిలాలు ఏముంటాయో చూద్దాం అని ఆశపడడం, ఉసూరుమనడం..

నెక్స్ట్ బడ్జెట్ మీద ఆశలు పెట్టుకోవడం.. ఇదీ వరుస

– సరే చూద్దాం.. ఈ బడ్జెట్‌లో ఎలా ఉంటదో.

....

వంటింట్లో కూడా జీఎస్టీతో తిరగమోత పెట్టి, రేట్ల ఘాటు నషాళానికి అంటించిన ఆర్థిక మంత్రి సీతారామన్ మొన్నీమధ్య మాట్లాడుతూ–

..' నేను కూడా మధ్యతరగతి నుంచే వచ్చాను, వారి ఒత్తిళ్లు, బాధలు నాకు తెలుసు .. ' అని చెప్పడంతో ఇప్పటిదాకా పడ్డ వాతలు, పెరిగిన గ్యాస్, పెట్రోల్, నిత్యావసరాలు..అన్నీ మరచిపోయి మధ్యతరగతి బడ్జెట్‌వైపు ఆశగా చూస్తోంది.

....

'గాలి పీల్చుకోనిస్తున్నాం, నీళ్ల తాగనిస్తున్నాం, తిండి తిననిస్తున్నాం.. ఇది చాలదా, ఇంకేం కావాలి..' –పోయిన బడ్జెట్ మధ్యతరగతికి ఏమిచ్చింది.. అంటే ఓ నెటిజన్ సరదా కామెంట్.

....

కానీ, ఓ నెటిజన్ సీరియస్ కామెంట్ చూదండి..

''సమాజాన్ని స్టేబుల్‌గా ఉంచేదే మధ్యతరగతి. బిజినెస్ క్లాస్‌కు సేవలతో, కింది తరగతికి తన పన్నులతో సపోర్ట్ చేసేదే.. మిడిల్‌క్లాస్. గత నలభై ఏళ్లుగా మిడిల్ క్లాస్ పెరుగుతోంది. పన్నులు చెల్లించేవారు పెరుగుతున్నారు. కాగా, పెట్రోల్, కరెంట్, కూరగాయలు, నిత్యావసరాలు.. ఇలా పెరిగిన ప్రతి రేటు మధ్యతరగతి జీవితాన్ని ఎక్కడ ఉన్నవాడిని అక్కడేవుండేట్లు చేస్తోంది. బడ్జెట్‌లో సరైన సపోర్ట్ లేకుంటే సమాజం, ప్రభుత్వం కూడా నష్టపోతుంది...'

దీనికి సపోర్ట్‌గా మరో నెటిజన్ పొలిటికల్ అనాలసిస్ ఇదీ..

''సాధారణంగా పాలిటిక్స్‌కు, ఓటింగ్‌కు దూరంగా ఉండే మిడిల్ క్లాస్ మోదీకి దగ్గరవుతున్నారు. వీరు మోదీ ర్యాలీలకు, సభలకు హాజరవడం చూస్తున్నాం. అలా కాకపోయినా, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండడం, మోదీ చెబుతున్న నేషనలిజాన్ని నెత్తికెత్తుకుంటూ ఆయనకు వెన్నుదన్నుగా ఉంటున్నారు. చాలా మంది మధ్యతరగతి ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక చింతన మోదీ టీమ్ నడిపిస్తోన్న హిందుత్వాన్ని బలోపేతం చేస్తున్నాయి... దీనికితోడు మోదీ తరచుగా చెప్పే ఆధునికత్వాన్ని కూడా మధ్యతరగతే ముందుకు తీసుకెళ్తోంది... వీరి సపోర్ట్ లేకుండా మోదీ విజన్ సాధ్యం కాదు.. గతంలో కంటే మిడిల్ క్లాస్ పాపులేషన్ బాగా పెరుగుతోంది. ఇది మోదీకి అనుకూలమైన విషయమే. ఈ సెక్షన్‌ను విస్మరించడం మోదీ గవర్నమెంట్‌కు అంత మంచిది కాదు.. ఈ విషయం ఆర్థిక మంత్రికీ తెలిసే ఉండాలి..''

....

విద్య, వైద్యం, దైనందిన జీవితంలో పెరిగిన రేట్లు.. ప్రతిదీ మధ్యతరగతి జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తదో.. ఆర్థికంగా ఎలా ఎదగకుండా చేస్తదో చెబుతూ వీటన్నింటినీ బడ్జెట్ పరిశీలించాలంటూ తన సొంత అనుభవాన్ని ఓ నెటిజన్ ఇలా పంచుకున్నారు..

''మా నాన్న ఫ్రెండ్ ఓ స్టాక్ బ్రోకర్. ఇరవై ఏళ్ల క్రితం ఆయనిచ్చిన సలహాతో మంచి షేర్లలో పెట్టుబడి పెట్టాడు.

ఇప్పటికి వాటి ధర 200 రెట్లు పెరిగింది.. మేం నిజానికి లక్షాధికారులం కావాలి.. కానీ కాలేదు. కారణం చూడండి..

కొన్న రెండు సంవత్సరాలకు రెసిషన్ వచ్చింది.. నాన్న ఉద్యోగం పోయింది. 20 శాతం షేర్లు అమ్మితే ఇల్లు గడిచింది.

ఆ తర్వాత ఏదో చిన్న ఉద్యోగం సంపాదించాడనుకోండి.

కానీ, మరో 20 శాతం మా తాత హార్ట్ సర్జరీ కోసం అమ్ముకున్నాం.

మరికొన్ని షేర్లు నాకు, తమ్ముడి చదువులకు హారించుకుపోయాయి.

కొద్ది రోజులకు మరికొన్ని అక్క పెళ్లికి హారతి..

ఇలా ఒక్కో సమస్య షేర్లను తినేసింది.

....

నాకేం అర్థమయ్యిందంటే సమాజంలో ఏం తేడా చేసినా.. అంటే మాంద్యం వచ్చినా, ఉద్యోగాలు పోయినా, ట్యాక్సులు పెరిగినా, మెడికల్ బిల్లులు పెరిగినా, చదువుల ఖర్చు పెరిగినా, రెగ్యులర్‌గా ఉండే కరెంట్, పాలు, నిత్యావసరాలు, గ్యాస్, పెట్రోల్.. ఇవన్నీ నిరంతర మధ్యతరగతిని ఎదగకుండా జాగ్రత్త కాపలా కాస్తుంటాయి.. పై చదువులు బాగా చదివినట్లే ఉంటుంది, శాలరీ పెరిగినట్లే ఉంటుంది.. లైఫ్‌లో రిస్క్, సమస్యలు మాత్రం అలాగే ఉంటాయి..

వీటన్నింటినీ బడ్జెట్ పరిగణనలోకి తీసుకోవాలి...'

....

ఇదీ ఉద్యోగుల పరిస్థితి



బడ్జెట్ ప్రసంగంలో ఆదాయ పన్ను మినహాయింపు ప్రకటనపై ఉద్యోగులు ఇలా ఎదురు చూస్తున్నారంటూ చెణుకులు

....

సరే చూద్దాం..

ఈసారి బడ్జెట్ ఎప్పటిలాగే మీమ్స్, జోక్స్ మిగులుస్తుందా.. కాసిన్ని ఆశలు మిగులుస్తుందా..

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.సప్తమి ప.2.32 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: అశ్వని రా.12.32 వరకు, తదుపరి భరణి, వర్జ్యం: రా.8.32 నుండి 10.08 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.37 నుండి 8.08 వరకు, అమృతఘడియలు: సా.5.12 నుండి 6.47 వరకు, రథసప్తమి; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.49

క్లుప్తంగా...

'పరీక్షా పే చర్చ'లో నవోదయ విద్యార్థిని


సంజన

కూసుమంచి: ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన 'పరీక్షా పే చర్చ'లో ఖమ్మం జిల్లా పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ధరావత్ సంజన పాల్గొంది. దేశవ్యాప్తంగా ఈ చర్చలో 400 మంది విద్యార్థులు పాల్గొనగా.. తెలంగాణ నుండి సంజనకు అవకాశం దక్కడం గర్వకారణమని ప్రిన్సిపాల్ చంద్రబాబు తెలిపారు. విద్యాలయలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరపై.. ప్రధాని పాల్గొన్న చర్చను విద్యార్థులు సహా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తదితరులు వీక్షించారు.

అధ్యయనోత్సవాలకు శ్రీకారం


తిరుమంజనం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో నాలుగు రోజుల పాటు జరిగే అధ్యయనోత్సవాలకు శుక్రవారం పాంచరాత్ర ఆగమ సంప్రదాయాలతో ఆచార్యులు శ్రీకారం చుట్టారు. ఉదయం నిత్యారాధనల అనంతరం తిరుమంజన మహోత్సవం, సాయంత్రం తొలక్కం పూజ నిర్వహించారు. పారాయణికులు పారాయణాలు పఠించారు.

కేసీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి


రఘునందన్‌రావు

యాదగిరిగుట్ట: రాజ్యాంగంపట్ల, కోర్టుల పట్ల గౌరవం లేకుండా జాతీయ జెండాను అవమానిస్తున్న సీఎం కేసీఆర్ వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 15 ఆగస్టు, 26 జనవరిని గొప్పగా జరుపుకోవాల్సిన సందర్భంలో కరోనా సాకుతో దూరం పెట్టడం బాధాకరమన్నారు. హైకోర్టు చెప్పిన తరువాత కూడా పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా ఎగురవేసేందుకు సీఎం కేసీఆర్‌కు మనసు రాకపోవడం దారుణమన్నారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో.. రైతుల ఆత్మహత్యలు, ప్రజా సమస్యలు లేవనెత్తుతానని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యలను అరికట్టలేని సీఎం కేసీఆర్ ఇతర రాష్ట్రాలకు వెళ్లి ఆత్మహత్యలను అరికడుతామని, వారికి డబ్బులు ఇచ్చి వస్తున్నారని విమర్శించారు. వీఆర్ఏల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడాలని కోరుతూ స్థానిక వీఆర్ఏలు ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేశారు.



వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన ఈమె పేరు కాలం రజిత. ఇటీవలే 2.16 ఎకరాలకు పాసు పుస్తకం వచ్చింది. నవంబర్ 16నే రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకున్నా ఇప్పటికీ రాలేదు. దీంతో పెట్టుబడి కోసం ఎకరానికి రూ. 20 వేలు అప్పు చేయాల్సి వచ్చింది.



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గోపాలరావుపల్లెకు చెందిన ఈయన కడారి శ్రీనివాస్‌రెడ్డి. అదే మండలంలోని వెంకటాపూర్ శివారులో 6 నెలల కిందట 3 ఎకరాల భూమి కొన్నారు. పాస్ బుక్ వచ్చింది. రైతుబంధుకు దరఖాస్తు చేసుకున్నా రాలేదు.



ఈమె నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చింతపల్లికి చెందిన కట్టెబోయిన విష్ణుప్రియ. తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆరెకరాల భూమికి ఆగస్టులో పాసుపుస్తకం వచ్చింది. యాసంగి రైతుబంధు సహాయం కోసం ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో దరఖాస్తు చేసుకుంది. అయినా రైతుబంధు మంజూరు కాలేదు. దీంతో పెట్టుబడి కోసం అప్పు చేయాల్సి వచ్చింది.

రైతుబంధు వచ్చేదెప్పుడో?

లక్షన్నర మంది రైతుల నిరీక్షణ

- కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతులకు అందని పెట్టుబడి సాయం
- దరఖాస్తు చేసుకున్నా ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడమే కారణం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్రంలో గతేడాది జూలై నుంచి ఇప్పటివరకు కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొంది రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకున్న దాదాపు లక్షన్నర మంది రైతులందరిదీ ఇదే బాధ. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడమే ఇందుకు కారణం. ప్రభుత్వం ఈ యాసంగి సీజన్‌లో పెట్టుబడి సాయం అందించే క్రమంలో రైతుబంధు పథకానికి 2022 డిసెంబర్ 20 నాటికి కొత్తగా పాస్ పుస్తకాలు లభించిన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. జిల్లాల్లో వ్యవసాయ అధికారులు కూడా స్థానికంగా ప్రకటనలు జారీ చేశారు. జనవరి 7 వరకు గడువు ఇచ్చారు. దీంతో హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, కామారెడ్డి మినహా మిగతా 28 జిల్లాల్లో 1,40,668 మంది రైతులు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకొని ఎదురుచూస్తున్నారు.

నిలిచిన లాగిన్ సౌకర్యం..

గత వానాకాలం సీజన్‌లో జూన్ 28 నుంచి పెట్టుబడి సాయం అందించారు. జూన్ 20 వరకు పాస్‌పుస్తకాలు కలిగిన లేదా రిజిస్ట్రేషన్లు అయిన రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వం సాయం అందించింది. జూలై 20 తరువాత కొనుగోలు చేసిన లేదా వారసత్వం కింద రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వారికి యాసంగి పెట్టుబడి కోసం రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మరోవైపు ధరణి సమస్యలతో నిషేధిత జాబితాలో పడిన భూముల సమస్యలకు ఇటీవల పరిష్కారం లభించింది. అలాంటి వారికి పాస్ పుస్తకాలు వచ్చాయి. వారంతా మండల స్థాయిలో రైతుబంధుకు దరఖాస్తు చేసుకున్నారు. వారి వివరాలను ఏవో, ఏఈవోలు రైతుబంధు పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంది. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ పోర్టల్‌లో అధికారులకు ప్రభుత్వం లాగిన్ అవకాశం ఇవ్వలేదు. దీంతో దరఖాస్తుదారుల వివరాలను వారు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. ఫలితంగా ఆయా రైతులకు యాసంగి పెట్టుబడి సాయం అందలేదని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలవారీగా కొత్త పాసు పుస్తకాలు వచ్చి, రైతుబంధు కోసం వ్యవసాయ అధికారుల కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు..

ఖమ్మం	8,556	సూర్యాపేట	6,200	ములుగు	1,036	ఆసిఫాబాద్	5,800
భద్రాద్రి కొత్తగూడెం	1,445	యాదాద్రి	6,700	సంగారెడ్డి	8,000	మహబూబ్‌నగర్	3,640
నిజామాబాద్	7,176	హనుమకొండ	4,536	మెదక్	11,176	నాగర్‌కర్నూల్	8,245
కరీంనగర్	6,191	వరంగల్	3,750	సిద్దిపేట	8,000	జోగుళాంబ గద్వాల	648
పెద్దపల్లి	4,360	జనగామ	6,863	మంచిర్యాల	2,684	వనపర్తి	1,048
రాజన్నసిరిసిల్ల	4,237	మహబూబాబాద్	5,491	నిర్మల్	2,350	నారాయణపేట	447
జగిత్యాల	6,468	భూపాలపల్లి	2,821	ఆదిలాబాద్	3,800	మొత్తం	1,40,668
నల్లగొండ	9,000						

- వానాకాలంలో ధాన్యం కొనుగోలుకు నాబార్డు నుంచి రూ.3వేల కోట్ల రుణం తీసుకున్నామని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రుణ సేకరణకు నిర్వహించిన టెండర్ ప్రక్రియలో.. టెండర్ వేశామని.. ప్రభుత్వం అనుమతిచ్చిన రుణపరిమితి నిబంధనలకు అనుగుణంగా నాబార్డు నుంచి రుణ సేకరణ చేశామని పేర్కొన్నారు. ఈ ఏడాది వానాకాలంలో పౌరసరఫరాల సంస్థ 9.65 లక్షల మంది రైతుల నుంచి రూ.13,189 కోట్ల విలువైన 64.12 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని వివరించారు.

జాన్‌పహాడ్ ఉర్సుకు పోటెత్తిన భక్తులు

- వైభవంగా గంధోత్సవం


దర్గా వద్దకు తీసుకువస్తున్న గంధాన్ని తాకేందుకు పోటీపడుతున్న భక్తులు

పాలకవీడు: సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా ఉర్సుకు శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారు. ఉర్సు రెండవ రోజు ప్రధాన ఘట్టమైన గంధం ఊరేగింపు నిర్వహించారు. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి తీసుకు వచ్చిన పవిత్ర గంధాన్ని చందన్‌ఖానాకు తరలించి ముస్లిం మత పెద్దలు, ప్రముఖుల సమక్షంలో గంధం కలిపారు. అనంతరం అశ్వంపై జాన్‌పహాడ్ పుర వీధుల్లో ఊరేగించారు. ఊరేగింపు సందర్భంగా గంధాన్ని తాకేందుకు భక్తులు పోటీపడ్డారు. మూడు గంటలకు దర్గాకు చేరుకున్న గంధాన్ని బాబాల సమాధులపై చల్లి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు యాదాద్రిలో రథసప్తమి వేడుకలు


రథ సప్తమి వేడుకకు సిద్ధమైన సూర్యప్రభ వాహనం

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం మొదటిసారిగా రథసప్తమి వేడుకలకు సిద్ధమైంది. ప్రధానాలయం పునఃప్రారంభమైన తర్వాత.. శనివారం రథ సప్తమి రోజు శ్రీస్వామి వారిని ఉదయం సూర్యప్రభ వాహనంలో భక్తుల మధ్య ఊరేగించనున్నట్లు ప్రధానార్చకుడు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు వెల్లడించారు. తొలిసారి నిర్వహిస్తున్న రథ సప్తమి వేడుకకు ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

'నవోదయ'లో విద్యార్థులకు అస్వస్థత

- ఖమ్మం జిల్లా పాలేరులో ఘటన
- వంట సరుకుల శాంపిళ్లు సేకరించిన అధికారులు


విద్యార్థులకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

కూసుమంచి: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో సుమారు 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. రెండు రోజులుగా పలువురు విద్యార్థులు కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడుతుండగా, శుక్రవారం వీరి సంఖ్య పెరగడం, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం జరగడంతో తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు స్థానిక వైద్య సిబ్బంది చికిత్స చేశారు. అయితే, విద్యార్థులు అస్వస్థతకు గురికావటానికి గల కారణాలు స్పష్టంగా తెలియడంలేదు. విద్యార్థులకు మెనూ ప్రకారం బుధవారం చికెన్ వడ్డించగా, అది తిన్నాక కడుపునొప్పి, వాంతులు అయ్యాయని విద్యార్థులు చెబుతున్నారు. కానీ ఇటీవల విద్యార్థులు సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లి వచ్చినప్పుడు తెచ్చుకున్న పిండి వంటలు తినడంతోనే ఇలా జరిగిందని ప్రిన్సిపాల్ చంద్రబాబు వివరణ ఇచ్చారు. విద్యార్థుల పరిస్థితిపై డీఎంహెచ్ఓ డాక్టర్ మాలతి పాఠశాలకు వచ్చి మెడికల్ ఆఫీసర్ కిషోర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే, జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పిండివంటలతో పాటు భోజనం తయారీలో వాడే సరుకుల శాంపిళ్లను సేకరించారు. విద్యార్థులకు చికిత్స కొనసాగుతోందని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని డీఎంహెచ్ఓ వెల్లడించారు.

కాంట్రాక్టు వైద్య ఉద్యోగికి గుండెపోటు

- నగదు రహిత వైద్యం అందించాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశం


హరికృష్ణ

సూర్యాపేట: గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురైన ఓ కాంట్రాక్టు వైద్య ఉద్యోగికి వైద్యశాఖ మంత్రి హరీశ్‌రావు అండగా నిలిచారు. సూర్యాపేట జిల్లా పెంచికలదిన్నె పీహెచ్‌సీలో హరికృష్ణ అనే వ్యక్తి హెల్త్ అసిస్టెంట్‌గా 20 ఏళ్లుగా పనిచేస్తున్నారు. కంటి వెలుగు–2 విధి నిర్వహణలో ఉండగా శుక్రవారం హరికృష్ణ గుండెపోటుకు గురయ్యారు. తోటి సిబ్బంది హుటాహుటిన మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. వైద్యశాఖలో పనిచేస్తున్న హరికృష్ణకు ఆరోగ్యశ్రీ వంటి పథకాలు వర్తించకపోవడం, చాలీచాలని జీతం, పేదరికం కారణంగా వైద్య ఖర్చులకు సరిపడా డబ్బులు కూడా లేకపోవడంతో ఈ విషయాన్ని ఉద్యోగుల యూనియన్ (హెచ్1) మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లింది. వెంటనే స్పందించిన మంత్రి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో హరికృష్ణకు నగదురహిత వైద్యం అందించాలని ఆదేశాలిచ్చారు.

సిద్ధమవుతున్న 'మల్లన్నసాగర్ భగీరథ'

మార్చి నెలాఖరులోగా ఈ పథకం పనుల పూర్తికి చర్యలు

- సిద్దిపేట, జనగామ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాలకు కొరత లేకుండా తాగునీరు
- ప్రస్తుతం ఎల్లంపల్లి–హైదరాబాద్ పైప్‌లైన్ నుంచి నీటి సరఫరా
- క్షేత్రస్థాయిలో పనుల పరిశీలనకు నేడు స్మితా సబర్వాల్ రాక


మల్లన్నసాగర్ రిజర్వాయర్ వద్ద నిర్మిస్తున్న నీటి శుద్ధి ట్యాంకు

గజ్వేల్: 'మల్లన్నసాగర్ భగీరథ పథకం 'సిద్ధమవుతోంది. మార్చి నెలాఖరులోగా ఈ పథకం పనులను పూర్తి చేయడానికి సంబంధిత యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోంది. సిద్దిపేట, జనగామ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాలకు ఇక ఇక్కడి నుంచే మంచినీటి సరఫరా జరగనుంది. ప్రస్తుతం ఈ జిల్లాలకు ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్లే పైప్‌లైన్ నుంచి నీటిని సరఫరా చేస్తుండగా, మార్చి తర్వాత దీనిని హైదరాబాద్‌కే పరిమితం చేసి.. ఈ పైప్‌లైన్‌కు సమాంతరంగా నిర్మిస్తున్న మల్లన్నసాగర్ భగీరథ కొత్త లైన్ ద్వారా మంచినీటి సరఫరా చేపట్టనున్నారు. ఈ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి సీఎం కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్ శనివారం పర్యటించనున్నట్లు తెలుస్తోంది.

కొరత లేకుండా మల్లన్న సాగర్ నుంచి నీరు..

హైదరాబాద్‌లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు గోదావరి సుజలస్రవంతి పథకాన్ని పదేళ్ల క్రితం రూ.3,375 కోట్ల వ్యయంతో పూర్తి చేశారు. కరీంనగర్ జిల్లా ఎల్లంపల్లి బ్యారేజీ నుంచి 10 టీఎంసీల నీటిని తరలించేందుకు 186 కిలోమీటర్ల మేర పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఈ లైన్ ద్వారా 735 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) నీటి సరఫరా జరుగుతోంది. ఇందులో సిద్దిపేట, జనగామ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాలకు భగీరథ పథకం అవసరాల కోసం సుమారుగా 300 ఎంఎల్‌డీ నీటిని వాడుకుంటున్నారు. మిగతా నీరు హైదరాబాద్ అవసరాలకు వెళ్తుంది. దీనివల్ల హైదరాబాద్‌కు వెళ్లే నీటిలో అప్పుడప్పుడు కొరత ఏర్పడుతోంది. అంతేకాకుండా నీరు తక్కువగా వచ్చినప్పుడు ఈ జిల్లాలకు కూడా ఇబ్బంది ఏర్పడుతోంది. దీంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనే దిశలో గజ్వేల్ నియోజకవర్గంలోని మల్లన్నసాగర్ నీటిని మిషన్ భగీరథ కోసం వాడుకోవాలని నిర్ణయించారు. ఇందుకోసం కొండపాక మండలం మంగోల్ వద్ద 540 ఎంఎల్‌డీ సామర్థ్యంతో చేపట్టిన డబ్ల్యూటీపీ పనులు పూర్తి కావొస్తున్నాయి. మార్చి నాటికి హైదరాబాద్ లైన్‌పై నీటిని తీసుకునే వాల్వులను మూసి వేయనున్నారు. సిద్దిపేట, జనగామ, యదాద్రి, సూర్యా పేట జిల్లాలకోసం మల్లన్నసాగర్ నుంచే లైన్‌లను నిర్మిస్తున్నారు.

ఇబ్బంది లేకుండా నీటి సరఫరా..

మల్లన్నసాగర్ మిషన్ భగీరథ పథకం ద్వారా మొదటగా జనగామ జిల్లాకు నీటిని సరఫరా చేస్తారు. మల్లన్నసాగర్ నుంచి కొమురవెల్లి కమాన్ వద్ద గల ఓవర్‌హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా జనగామ జిల్లాకు తాగునీరు వెళ్లనుంది. ఇందుకోసం మల్లన్నసాగర్ నుంచి కొమురవెల్లి కమాన్ వరకు 6.9 కిలోమీటర్ల మేర ప్రత్యేక లైన్ నిర్మించారు. ప్రస్తుతం నీటిని తీసుకుంటున్న హైదరాబాద్ లైన్ వల్ల ఎప్పుడైనా నీటి కొరత ఏర్పడితే తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడేవి. మార్చి తర్వాత అలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు. ఇదే తరహాలో సిద్దిపేట, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లోనూ భగీరథ పథకానికి ప్రత్యేక వ్యవస్థను తీసుకురానున్నారు. స్మితా సబర్వాల్ పర్యటన సందర్భంగా మార్చి ఆఖరులోగా పనులు పూర్తి చేయడానికి దిశానిర్దేశం చేయనున్నారు.

మార్చి నెలాఖరులో పనులు పూర్తిచేయడమే లక్ష్యం


నాలుగు జిల్లాల తాగునీటి సరఫరాకు సంబంధించి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడటమే 'మల్లన్నసాగర్ భగీరథ పథకం'ఉద్దేశం. దీనికి సంబంధించి పనులు సాగుతున్నాయి. మార్చి నెలాఖరు వరకు పనులు పూర్తి చేస్తాం.

– రాజయ్య, మిషన్ భగీరథ ఈఈ, గజ్వేల్

క్లుప్తంగా

2 రోజుల్లోనే రూ. 200 కోట్లపైమాటే..

భారీగా వసూళ్లు రాబడుతున్న 'పఠాన్'



న్యూఢిల్లీ: బాలీవుడ్ కింగ్‌ఖాన్ షారూక్ ఖాన్, దీపికా పదుకోన్ నటించిన పఠాన్ మూవీ భారీగా వసూళ్లు సాధిస్తోంది. ఈ నెల 25న విడుదలైన ఈ చిత్రం తొలి రెండు రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా వసూలు చేసింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత షారూక్‌కు పెద్ద విజయం దక్కింది. ''వెనక్కి తిరిగిరావడం కోసం ప్లాన్ చేసుకోవద్దు. మున్ముందుకే అడుగులు వేయాలి. వెనక్కి తగ్గొద్దు. ప్రారంభించిన పనిని ముగించేందుకు ప్రయత్నించండి'' అని సోషల్ మీడియాలో కింగ్‌ఖాన్ సూచించారు. చిత్ర విజయం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. పఠాన్ చిత్రాన్ని ప్రఖ్యాత యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది.

మోర్బీ ఘటనలో అభియోగాలు నమోదు

మోర్బీ: గుజరాత్‌లోని మోర్బీ పట్టణంలో గత ఏడాది అక్టోబర్‌లో 135 నిండు ప్రాణాలను బలిగొన్న తీగల వంతెన కుప్పకూలిన దుర్ఘటన కేసులో రాష్ట్ర పోలీసులు శుక్రవారం అభియోగాలు నమోదు చేశారు. ఈ కేసులో 9 మంది అరెస్ట్ అయ్యారు. పదో నిందితుడిగా తీగల వంతెనకు మరమ్మతులు నిర్వహించి పునరుద్ధరణ పనులు చేసిన ఒరెవా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ జయ్‌సుఖ్ పటేల్ పేరును చేర్చారు. ఈ విషయాన్ని బాధితుల తరపు లాయర్ దిలీప్ వెల్లడించారు. జయ్‌సుఖ్ పటేల్‌ను అరెస్ట్ చేయాల్సిందిగా మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. బ్రిటిష్ కాలం నాటి ఈ తీగల వంతెనకు ఒరెవా గ్రూప్ మరమ్మతులు నిర్వహించిన విషయం తెలిసిందే.

త్వరలోనే ఇతర పార్టీలతో చర్చలు: నితీశ్

పట్నా: 2024 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి భావ సారూప్యత గల పార్టీలతో త్వరలోనే చర్చలు జరుపుతామని జేడీయూ నేత, బిహార్ సీఎం నితీశ్ కుమార్ చెప్పారు. బీజేపీని విభేదించే పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి, ఎన్నికలపై వ్యూహరచన చేస్తామన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ముగిసిన వెంటనే ఇందుకు సంబంధించిన భేటీ జరుగుతుందన్నారు. జోడో యాత్ర కాంగ్రెస్ పార్టీ సొంత వ్యవహారమని ఆయన చెప్పారు. బిహార్‌లోని మహా కూటమి ప్రభుత్వంలో జేడీయూ, కాంగ్రెస్ వంటి ఏడు పార్టీలు భాగస్వాములుగా ఉన్న విషయం తెలిసిందే.

అడ్డదారులను నమ్ముకుంటే కష్టాలే

'పరీక్షా పే చర్చ'లో ప్రధాని నరేంద్ర మోదీ హితవు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో ప్రధాని మోదీ

- కేవలం తెలివితేటలను నమ్ముకోండి
- ఫోన్లపై కాదు.. చదువులపై దృష్టి పెట్టండి
- ఎలక్ట్రానిక్ పరికరాలను అతిగా వాడొద్దు
- తరచుగా 'టెక్నాలజీ ఉపవాసం'తో మేలు
- విద్యార్థుల పరిధి మరింత విస్తృతం కావాలి
- వారిని ఆంక్షల వలయంలో బందీలను చేయొద్దు
- పరీక్ష ఫలితాలే జీవితానికి ముగింపు కాదు

న్యూఢిల్లీ: విద్యార్థులు షార్ట్‌కట్‌లను (అడ్డదారులు) ఎప్పుడూ నమ్ముకోవద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హితవు పలికారు. పరీక్షల్లో చీటింగ్ చేయడం వల్ల ఒకటి రెండు సార్లు లాభపడొచ్చేమో గానీ భవిష్యత్తులో మాత్రం కష్టాలు తప్పవని హెచ్చరించారు. ఆయన శుక్రవారం ఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో ఆరో ఎడిషన్ 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో విద్యార్థులతో సంభాషించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. పరీక్షల వేళ ప్రధానంగా చదువులపైనే దృష్టి పెట్టాలని సూచించారు. దృష్టి మళ్లించే పనులకు దూరంగా ఉండాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలను అతిగా వాడొద్దని, తెలివితేటలపై నమ్మకం ఉంచాలి తప్ప మొబైల్ ఫోన్లపై కాదని వ్యాఖ్యానించారు. టెక్నాలజీ వల్ల చదువుల్లో నష్టపోకుండా జాగ్రత్తపడాలన్నారు. ఫోన్లు వాడడానికి, సోషల్ మీడియా ద్వారా ఇతరులతో అనుసంధానం కావడానికి ప్రత్యేకంగా కొంత సమయం కేటాయించుకోవాలని చెప్పారు.

ఏకాగ్రత మొత్తం చదువుపైనే..

పరీక్షల్లో కాపీయింగ్ గురించి ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. తప్పుడు పనుల వల్ల చెడ్డ ఫలితమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. నిజాయితీగా కష్టపడే తత్వమే జీవితంలో మనల్ని ముందుకు తీసుకెళ్తుందని విద్యార్థులకు ఉద్బోధించారు. ఒత్తిళ్లకి లోను కాకుండా పరీక్షలకు ప్రశాంతంగా సిద్ధం కావాలని అన్నారు. మన బలాలను మనం సరిగ్గా అర్థం చేసుకుంటే ఒత్తిడికి తావుండదని వివరించారు. పిల్లలపై కుటుంబ సభ్యులు ఎన్నో అంచనాలు పెట్టుకోవడం సహజమేనని గుర్తుచేశారు. పరీక్ష ఫలితాలు జీవితానికి ముగింపు కాదని స్పష్టం చేశారు. తన వైపు విసిరే బంతిపైనే క్రికెట్ క్రీడాకారుడు ఫోకస్ చేస్తాడని, ఫోర్లు, సిక్సుల కోసం వినిపించే అరుపులను ఏమాత్రం పట్టించుకోడని, విద్యార్థులు సైతం అలాగే ఉండాలని, వారి ఏకాగ్రత మొత్తం చదువుపైనే ఉండాలని స్పష్టం చేశారు. పిల్లల చదువులు, వారు సాధించబోయే మార్కుల గురించి తల్లిదండ్రులు గొప్పలు చెబుతుంటారని, విద్యార్థుల్లో ఒత్తిడికి ఇది కూడా ఒక కారణమని ఉద్ఘాటించారు. పిల్లలు చెప్పింది విశ్వసించాలని తల్లిదండ్రులకు హితవు పలికారు. పరీక్ష ఫలితాల గురించి లేనిపోని అంచనాలు పెట్టుకోవద్దని అన్నారు.

ప్రశ్నలడిగే వారిని స్వాగతించాలి

విద్యార్థుల పరిధి మరింత విస్తృతం కావాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. 10, 12వ తరగతుల పరీక్షలు పూర్తయిన తర్వాత విద్యార్థులకు కొంత డబ్బు ఇవ్వాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆ డబ్బుతో కొత్త ప్రాంతాల్లో పర్యటించాలని, అక్కడి అనుభవాలను పుస్తకంలో రాయాలని విద్యార్థులతో చెప్పారు. పిల్లలను ఆంక్షల వలయంలో బందీలను చేయడం ఎంతమాత్రం సరి కాదన్నారు. కొత్త ప్రాంతాలను దర్శించేలా, కొత్త మనుషులను కలిసి మాట్లాడేలా ప్రోత్సహించాలన్నారు. ప్రశ్నలడిగే విద్యార్థులను స్వాగతించాలని ఉపాధ్యాయులకు ప్రధాని మోదీ సూచించారు. ఒక విద్యార్థి ప్రశ్నలు అడుగుతున్నాడంటే అతడిలోని పరిశోధకుడు మేల్కొన్నట్లు గుర్తించాలని, అది చాలా మంచి పరిణామం అని తెలియజేశారు.

ఏది మంచి? ఏది చెడు?

దేశంలో పౌరులు నిత్యం సగటున 6 గంటలకు పైగానే ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు చూస్తున్నట్లు ఒక అధ్యయనంతో తేలిందని నరేంద్ర మోదీ వెల్లడించారు. గాడ్జెట్లకు జనం బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏది మంచో, ఏది చెడో నిర్ణయించుకొనే జ్ఞానాన్ని, స్వతంత్ర వ్యక్తిత్వాన్ని దేవుడు మనకు ఇచ్చాడని, గాడ్జెట్లకు బానిసలుగా మారకుండా ఇకనైనా అప్రమత్తంగా ఉందామని పిలుపునిచ్చారు.

భారత్ 'సగటు' దేశం కాదు

ప్రభుత్వంలో సగటు(యావరేజ్) వ్యక్తులే ఉన్నారని, భారత్ ఒక సగటు దేశంగానే కొనసాగుతోందంటూ వస్తున్న విమర్శలను ప్రధాని మోదీ తిప్పికొట్టారు. భారత్ సగటు దేశం ఎంతమాత్రం కాదని తేల్చిచెప్పారు. ప్రపంచంలో మన దేశం వెలిగిపోతోందని, ప్రపంచ దేశాలకు భారత్ ఒక ఆశారేఖగా మారిందని స్పష్టం చేశారు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ మనదేనని అన్నారు. గొప్ప విజయాలు సాధించిన వారిలో చాలామంది ఒకప్పుడు సగటు వ్యక్తులేనని వ్యాఖ్యానించారు. అందరూ 'తీస్‌మార్‌ఖాన్'లు కావాల్సిన అవసరం లేదన్నారు. విమర్శలకు, ఆరోపణలకు మధ్య చాలా వ్యత్యాసం ఉందన్నారు. విమర్శ అనేది మనం బలంగా మారడానికి ఉపయోగపడే ఒక టానిక్ లాంటిదన్నారు. ఎవరైనా ఆరోపణలు చేస్తే సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని విద్యార్థులకు సూచించారు. కొందరు ఎప్పుడూ ఆరోపణలు చేస్తుంటారని, వారి అసలు ఉద్దేశం వేరే ఉంటుందని, పట్టించుకోవద్దని చెప్పారు.

తెలివిగా వాడుకోవడమే తెలివి

మీ గాడ్జెట్ మీ కంటే తెలివైందని ఎన్నడూ అనుకోవద్దని విద్యార్థులతో మోదీ చెప్పారు. ఆన్‌లైన్ గేమ్‌లు, సోషల్ మీడియాకు బానిసలుగా మారొద్దన్నారు. తరచుగా 'టెక్నాలజీ ఉపవాసం' చేయాలన్నారు. ఫోన్లను పూర్తిగా పక్కన పెట్టాలని వెల్లడించారు. అలాగే ప్రతి ఇంట్లో టెక్నాలజీ-ఫ్రీ-జోన్ ఉండాలన్నారు. దీనివల్ల ఇంట్లో ఆనందం వెల్లివిరుస్తుందని, పిల్లలు గాడ్జెట్స్‌కు బానిసలుగా మారకుండా ఉంటారని వివరించారు. తాను రాజకీయాల్లో చురుగ్గా ఉన్నప్పటికీ చేతిలో ఫోన్‌తో చాలా అరుదుగా కనిపిస్తుంటానని మోదీ తెలిపారు. ఫోన్‌లో మాట్లాడడానికి కొంత సమయం కేటాయించుకుంటానని అన్నారు. టెక్నాలజీని పూర్తిగా పరిహరించాలని తాను చెప్పడం లేదని, మనకు అవసరమైన పరికరాలు అవసరమైనంత మేరకే వాడుకోవడం ఉత్తమమని వెల్లడించారు. మనం తెలివైనవాళ్లమా? లేక మన ఫోన్ తెలివైనదా? అనేది విద్యార్థులు నిర్ణయించుకోవాలన్నారు. ఫోన్ మాత్రమే తెలివైందని భావిస్తే సమస్య మొదలైనట్లేనని పేర్కొన్నారు. ఫోన్‌ను తెలివిగా వాడుకోవడంలోనే తెలివి దాగి ఉందన్నారు. ఫోన్‌ను ఉత్పాదకత పెంచుకోవడానికి ఉపయోగపడే ఒకపరికరంగా భావించాలని కోరారు.

జోడో యాత్రలో భద్రతా లోపం

అర్ధంతరంగా ఆపేసిన రాహుల్ గాంధీ



ఖానాబల్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో జమ్మూకశ్మీర్‌లో కొనసాగుతున్న భారత్ జోడో యాత్ర శుక్రవారం అర్ధంతరంగా నిలిచిపోయింది. యాత్రకు భద్రత కల్పించడంలో జమ్మూకశ్మీర్ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని రాహుల్ గాంధీ ఆరోపించారు. పోలీసులు సరైన ఏర్పాట్లు చేయనందునే యాత్రను నిలిపివేశామని చెప్పారు. జమ్మూలోని బనిహాల్ నుంచి శుక్రవారం ఉదయం యాత్రను ప్రారంభించిన ఆయన అనంతరం బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో జవహర్ టన్నెల్‌ను దాటారు. క్వాజిగుండ్ వద్ద కశ్మీర్ లోయలోకి ప్రవేశించి సుమారు 500 మీటర్ల నడిచాక యాత్రను అకస్మాత్తుగా నిలిపివేశారు. అక్కడ తమకు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు వేచి ఉన్నారని, అదుపు చేయాల్సిన పోలీసులు ఎక్కడా కనిపించకపోవడం దురదృష్టకరమని రాహుల్ మీడియాకు చెప్పారు. వ్యక్తిగత భద్రతా సిబ్బంది సలహా మేరకు మిగతా యాత్రను ఆపేస్తున్నట్లు ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం 11 కిలోమీటర్ల మేర సాగి అనంత్‌నాగ్ జిల్లాలోని ఖానాబల్ వద్ద రాత్రి విశ్రాంతి కోసం ఆపేయాల్సి ఉంది. యాత్రకు భద్రతపై కశ్మీర్ యంత్రాంగంతో చర్చిస్తున్నట్లు కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇటువంటి సమయంలో రాజకీయాలకు పాల్పడటం దిగజారుడు తనమని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఈ ఆరోపణలను జమ్మూకశ్మీర్ అదనపు డీజీపీ విజయ్ కుమార్ ఖండించారు. బనిహాల్ వద్ద భారీగా జనం గుమికూడే విషయం యాత్ర నిర్వాహకులు ముందుగా తెలపలేదని పేర్కొన్నారు. ఇలా ఉండగా, శుక్రవారం యాత్రలో కశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా పాల్గొన్నారు. రాహుల్‌తో కలిసి 3 కిలోమీటర్ల మేర నడిచారు. వణికించే చలిలోనూ రాహుల్, ఒమర్ ఇద్దరూ తెల్ల టీ షర్ట్ ధరించి యాత్రలో పాల్గొన్నారు.

భారత్, చైనా మధ్య మరిన్ని ఘర్షణలు!

డీజీపీల సమావేశంలో అధికారుల నివేదిక

న్యూఢిల్లీ: వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వద్ద డ్రాగన్ దేశం చైనా రెచ్చిపోతోంది. డ్రాగన్ సైన్యం భారత భూభాగంలోకి క్రమంగా చొచ్చుకొస్తూ సరిహద్దును సైతం మార్చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అంతేకాకుండా ఆధునిక మౌలిక సదుపాయాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన డీజీపీల సమావేశంలో చైనా వ్యవహారంపై అధికారులు సమర్పించిన ఓ నివేదికలో పలు సంచలన అంశాలు బహిర్గతమయ్యాయి. సరిహద్దు ప్రాంతంలో చైనా కొత్త సైనిక స్థావరాలను ఏర్పాటుచేస్తున్న నేపథ్యంలో భారత్-చైనా సైనికుల నడుమ మరిన్ని ఘర్షణలు జరగవచ్చని అంచనా వేస్తున్నట్లు ఈ నివేదికలో పేర్కొన్నారు. దీనిపై అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ ఒక కథనాన్ని వెలువరించింది. భారత్-చైనాల మధ్య కొన్నేళ్లుగా నెలకొన్న ఉద్రిక్తతలు, నిఘా సంస్థలు సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదిక రూపొందించారు. ''2013-14 తర్వాత రెండు మూడేళ్లకోసారి ఇరు దేశాల నడుమ ఉద్రిక్తతల తీవ్రత పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. సరిహద్దులో ఇరు దేశాలు పోటాపోటీగా సైనిక బలగాలను పెంచుకుంటున్నాయి. చైనా చర్యల వల్ల తూర్పు లద్దాఖ్‌లో భారత్ ఇప్పటికే పలు కీలక గస్తీ పాయింట్లను కోల్పోయింది. చైనా దూకుడును అడ్డుకోవాలంటే సరిహద్దు ప్రాంతాల్లో అభివృద్ధిని వేగవంతం చేయాలి. సరిహద్దు పర్యాటకాన్ని ప్రోత్సహించాలి'' అని సూచించారు.

రాజా చారికి బ్రిగేడియర్ జనరల్ హోదా

ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్



వాషింగ్టన్: భారతీయ అమెరికన్ వ్యోమగామి, కల్నల్ రాజా జె.చారి(45) ఎయిర్ ఫోర్స్ బ్రిగేడియర్ జనరల్ హోదాకు ఎంపికయ్యారు. ఈ హోదాకు ఆయన్ను ఎంపిక చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు బైడెన్ గురువారం ఒక ప్రకటన చేశారు. ఈ నియమాకాన్ని సెనేట్ ఆమోదించాల్సి ఉంది. అధ్యక్షుడు జరిపే అన్ని పౌర, సైనిక నియామకాలపై సెనేట్ సాధారణంగా ఆమోదముద్ర వేస్తుంటుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం రాజా చారి టెక్సాస్‌లోని నాసాకు చెందిన జాన్సన్ స్పేస్ సెంటర్‌లో క్రూ-3 కమాండర్, ఆస్ట్రోనాట్‌గా ఉన్నారు. రాజా చారి తండ్రి శ్రీనివాసా చారి తెలంగాణకు చెందిన వారు. ఆయన హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చదివి అమెరికాకు చేరుకున్నారు. వాటర్‌లూలోని జాన్ డీర్ సంస్థలో పనిచేశారు. రాజా చారి మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఏరోనాటిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ, మేరీల్యాండ్‌లోని యూఎస్ నేవల్ టెస్ట్ పైలట్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 461వ ఫ్లైట్ టెస్ట్ స్క్వాడ్రన్ కమాండర్‌గా, ఎడ్వర్డ్స్ ఎయిర్ ఫోర్స్ బేస్‌లో ఎఫ్-35 ఇంటిగ్రేటెడ్ టెస్ట్ ఫోర్స్‌కు డైరెక్టర్‌గాను వ్యవహరించారు. రాజా చారి తన కెరీర్‌లో 2,500 గంటలకు పైగా ఫ్లైట్ టైంను సాధించారు. అమెరికా ఎయిర్‌ఫోర్స్‌లో బ్రిగేడియర్ జనరల్(బీడీ) ఒన్ స్టార్ జనరల్ ఆఫీసర్ స్థాయి. ఇది కల్నల్‌కు ఎక్కువ, మేజర్ జనరల్ స్థాయికి తక్కువ.

సింధు జలాల ఒప్పందాన్ని మారుద్దాం

న్యూఢిల్లీ: భారత్, పాకిస్తాన్ మధ్య దశాబ్దాల క్రితం నాటి సింధు నదీ జలాల పంపిణీ ఒప్పందం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ ఒప్పందాన్ని సవరించాలంటూ పాకిస్తాన్‌కు భారత్ నోటీసులు పంపింది. ఒప్పందం అమలు విషయంలో పాక్ అనుసరిస్తున్న మొండి వైఖరిని భారత్ ఎండగట్టింది. సింధు నదీ జలాల ఒడంబడికకు సంబంధించిన కమిషనర్ల ద్వారా జనవరి 25 పాకిస్తాన్‌కు నోటీసులు పంపినట్టుగా కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ ఒప్పందం అమలులో దశాబ్దాలుగా విభేదాలు సాగుతున్నాయి. 'సింధు నదీ జలాల ఒప్పందం అమలుకు అడ్డంకి కలి

పాకిస్తాన్‌కు భారత్ నోటీసులు

గించేలా పాకిస్తాన్ చర్యలు ఉంటున్నాయి. నోటీసు అందుకున్న 90 రోజుల్లోగా భారత్, పాకిస్తాన్ మధ్య చర్చలు జరగాల్సి ఉంటుంది. గత 62 ఏళ్లుగా నేర్చుకున్న పాఠాలతో ఒప్పందాన్ని సవరించుకొని ముందుకు సాగే అవకాశం లభిస్తుంది'' అని ఆ వర్గాలు వివరించాయి.

ఏమిటీ ఒప్పందం?

భారత్, పాక్ సరిహద్దుల్లో పారే సింధు నదీ జలాల పంపిణీపై 1960లో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం సింధు ఉప నదుల్ని తూర్పు, పశ్చిమ నదులుగా విభజించారు. సట్లెజ్, బియాస్, రావి తూర్పు నదుల జలాలను భారత్ వాడుకోవచ్చు. ఇక జీలం, చీనాబ్, సింధులను పశ్చిమ నదులుగా పేర్కొంటూ వాటిపై హక్కుల్ని పాక్‌కు కట్టబెట్టారు. అయితే పశ్చిమ నదుల్లో జల విద్యుత్, వ్యవసాయ అవసరాలకు నీటిని భారత్ కూడా వినియోగించుకునే హక్కు ఉంది. ఒప్పందం అమలును పర్యవేక్షించడానికి శాశ్వత సింధు కమిషన్ ఏర్పాటైంది. 2017-2022 మధ్య అయిదు సార్లు సమావేశమైనా సమస్యలపై ఏకాభిప్రాయం కుదరలేదు. చివరికి భారత్ ఆ ఒప్పందాన్ని మారుద్దామంటూ పాక్‌కు నోటీసులు పంపింది.

మహారాష్ట్రలో పరువు హత్య

ముంబై: మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో వైద్య విద్యార్థిని పరువు హత్యకు గురైంది. ప్రేమ వ్యవహారంతో తమ పరువు తీసిందనే కోపంతో తండ్రి, సోదరుడు ఇతర కుటుంబసభ్యులు కలిసి ఆమెను ఉరి వేసి చంపి, ఆపై దహనం చేశారు. లిబ్‌గావ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పింప్రి మహిపాల్ గ్రామంలో ఈ నెల 22వ తేదీన ఈ అమానుష ఘటన చోటుచేసుకుంది. హోమియోపతి మెడిసిన్ అండ్ సర్జరీ(బీహెచ్ఎంఎస్) మూడో సంవత్సరం చదువుతున్న శుభాంగి జొగ్‌దండ్‌కు ఇటీవల కుటుంబసభ్యులు పెళ్లి సంబంధం కుదిర్చారు. అయితే, తను గ్రామానికే చెందిన మరో వ్యక్తిని ప్రేమిస్తున్నానని, అతడినే పెళ్లి చేసుకుంటానని శుభాంగి వరుడికి తెలిపింది. పెళ్లి ఆగిపోవడంతో గ్రామంలో పరువు పోయిందని కుటుంబసభ్యులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ నెల 22 రాత్రి తండ్రి, సోదరుడు, మరో ముగ్గురు కుటుంబసభ్యులు కలిసి శుభాంగిని తమ పొలానికి తీసుకెళ్లి తాడుతో ఉరివేశారు. అనంతరం మృతదేహాన్ని కాల్చివేసి, మిగిలిన ఆనవాళ్లను నీళ్లలో పడవేశారు. ఈ మేరకు ఐదుగురిపై హత్య, తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.


ఢిల్లీ యూనివర్సిటీలో బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శనకు ప్రయత్నం

న్యూఢిల్లీ: గుజరాత్ మత ఘర్షణలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే బాధ్యుడని ఆరోపిస్తూ బీబీసీ రూపొందించిన వివాదాస్పద డాక్యుమెంటరీ స్క్రీనింగ్ సెగలు పెట్టిస్తోంది. ఢిల్లీ యూనివర్సిటీ కేంపస్‌లోని ఆర్ట్స్ ఫ్యాకల్టీ భవనంలో కొంత మంది బయటవారు ఈ డాక్యుమెంటరీ ప్రదర్శనకు ప్రయత్నించడంతో పోలీసుల్ని పిలవాల్సి వచ్చిందని రిజిస్ట్రార్ వికాస్ గుప్తా చెప్పారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు శుక్రవారం 24 మంది విద్యార్థుల్ని అదుపులోనికి తీసుకున్నారు. ఇప్పటికే జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, జామై మిలియా ఇస్లామియాలో డాక్యుమెంటరీ ప్రదర్శనకు సంబంధించి ఇదే తరహాలో ఆందోళనలు చెలరేగిన విషయం తెలిసిందే.

ఆరోగ్య పంజాబ్ సృష్టికి తీవ్ర కృషి: సీఎం మాన్

అమృత్‌సర్: పంజాబ్‌ను ఆరోగ్యకరంగా, శక్తివంతంగా మార్చేందుకు తమ ప్రభుత్వం తీవ్ర కృషి చేస్తోందని ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ చెప్పారు. ప్రతి రంగంలోనూ రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమన్నారు. శుక్రవారం అమృత్‌సర్‌లో ఆయన ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తో కలిసి 400 ఆమ్ ఆద్మీ క్లినిక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఎన్నికల సమయంలో తమ పార్టీ ఇచ్చిన హామీలన్నిటినీ మాన్ సర్కార్ నెరవేరుస్తుందని కేజ్రీవాల్ చెప్పారు. ఆప్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న పంజాబ్ ప్రజలు ఆకాంక్షలు నెరవేరేందుకు కొద్దిగా ఓపిక పట్టాలన్నారు. అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 500 ఆమ్ ఆద్మీ క్లినిక్కులను ఏర్పాటు చేయనుండటం సంతోషకరమని చెప్పారు.

దక్షిణాఫ్రికా నుంచి భారత్‌కు 12 చీతాలు



జోహన్నెస్‌బర్/న్యూఢిల్లీ: భారత్‌కు మరో డజను చీతాలు రాబోతున్నాయి. ఈ మేరకు దక్షిణాఫ్రికా, భారత్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. వచ్చే నెలలో దక్షిణాఫ్రికా నుంచి విమానంలో వచ్చే చీతాలను మధ్యప్రదేశ్‌లో కునో జాతీయ ఉద్యానవనంలో ఉంచుతారు. దేశంలో అంతరించిపోయిన చీతాల సంతతిని మళ్లీ పెంచేందుకు కొద్ది నెలల క్రితం నమీబియా నుంచి 8 చీతాలను ప్రత్యేక విమానంలో తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు వాటికి తోడుగా ఫిబ్రవరిలో 12 చీతాలు దక్షిణాఫ్రికా నుంచి వస్తాయని అటవీ, మత్స్య సంపద సంరక్షణ, పర్యావరణ (డీఎఫ్ఎఫ్ఈ) శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. దక్షిణాఫ్రికాతో కుదిరిన ఒప్పందంలో భాగంగా తొలి దశలో 12 చీతాలు వస్తే, ఆ తర్వాత ఎనిమిది నుంచి పదేళ్ల పాటు ఏడాదికి 12 చీతాలు చొప్పున వస్తాయి. ప్రపంచంలోనున్న 7 వేల చీతాల్లో అత్యధికం దక్షిణాఫ్రికా, నమీబియా, బోట్స్‌వానా దేశాల్లో ఉన్నాయి.

నన్ను చంపించేందుకు జర్దారీ కుట్ర: ఇమ్రాన్

ఇస్లామాబాద్: మాజీ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ తనను చంపించేందుకు ఉగ్రవాదులకు ముడుపులిచ్చారని పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్(70) ఆరోపించారు. ఇప్పటికే తనపై జరిగిన రెండు హత్యాయత్నాలు విఫలం కావడంతో ఈ కొత్త పథకం వేశారని పేర్కొన్నారు. అవినీతితో సంపాదించిన డబ్బు జర్దారీ వద్ద చాలానే ఉందని ఆయన వ్యాఖ్యానించారు. తాజా కుట్రలో జర్దారీతోపాటు మరో ముగ్గురికి కూడా భాగముందని ఇమ్రాన్ విమర్శించారు. వజీరాబాద్ హత్యాయత్నంతో ఏర్పడిన బుల్లెట్ గాయాలు మానాక తిరిగి పోరాటం మొదలుపెట్టడం ఖాయమన్నారు. తనకు ఏదైనా జరిగితే అందుకు కారణమైన వారిని దేశ ప్రజలు ఎన్నటికీ క్షమించరని ఇమ్రాన్ అన్నట్లు ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ పత్రిక పేర్కొంది.

పాక్ రూపాయి మరింత పతనం

కరాచీ: ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్తాన్ రూపాయి విలువ మరింత దిగజారింది. అమెరికా డాలరుతో పోలిస్తే మారకం విలువ రూ.262.6కు పడిపోయింది. శుక్రవారం బహిరంగ మార్కెట్‌లో ఒక దశలో డాలరుతో పోలిస్తే రూ.265కు, ఇంటర్ బ్యాంకింగ్‌లో రూ.266కు క్షీణించింది. చివరికి కోలుకుని రూ.262.6 వద్ద స్థిరపడింది. గురువారంతో పోలిస్తే శుక్రవారం కరెన్సీ విలువ రూ.7.17 అంటే 2.73% మేర పడిపోయినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాకిస్తాన్(ఎస్‌బీపీ) తెలిపింది. ఇంటర్ బ్యాంకింగ్ కార్యకలాపాల్లో రూపాయి విలువ గురు, శుక్రవారాల్లో రూ.34 మేర దిగజారిందని, దేశం 1999లో నూతన ఎక్స్ఛేంజి రేట్ విధానాన్ని వచ్చాక ఇంత భారీగా పతనమవడం ఇదే మొదటిసారి. కాగా, అమెరికా డాలరుతో భారత్ రూపాయి మారకం విలువ రూ.81.61గా ఉంది.

భరోస్.. డేటా భద్రతకు ఓఎస్!

తొలిసారిగా దేశీయ మొబైల్ ఆపరేటింగ్ సిస్టమ్

- అభివృద్ధి చేసిన ఐఐటీ-మద్రాస్
- నిధులు సమకూర్చిన కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ
- 'డిజిటల్ ఇండియా'కు మరింత ఊతం

ప్రపంచమంతటా కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు విలాసాలు కాదు.. నిత్యావసరాలుగా మారిపోయాయి. మన దేశం కూడా అందుకు మినహాయింపు కాదు. దాదాపు అన్ని రంగాల్లో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల వాడకం తప్పనిసరిగా మారింది. ఇక ఫోన్ల గురించి చెప్పాల్సిన పనిలేదు. ధనవంతుల నుంచి సామాన్యుల దాకా అందరి చేతుల్లోనూ దర్శనమిస్తున్నాయి. కంప్యూటర్లు, ఫోన్లు పని చేయాలంటే అందులో ఆపరేటింగ్ సిస్టమ్(ఓఎస్) కచ్చితంగా ఉండాలి. ఇలాంటి ఓఎస్ కోసం మనం ఇన్నాళ్లూ విదేశాలపైనే ఆధారపడుతున్నాం. ఓఎస్‌ను దేశీయంగా మనమే తయారు చేసుకోలేమా? అన్న ప్రశ్నకు సమాధానమే 'భరోస్'. డిజిటల్ ఇండియా కలను సాకారం చేసే దిశగా ఫోన్లలో ఉపయోగపడే ఓఎస్‌ను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)-మద్రాస్ అభివృద్ధి చేసింది. కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, అశ్వినీ వైష్ణవ్ స్వయంగా పరీక్షించారు. భరోస్ పరీక్ష విజయవంతమైందని ప్రకటించారు. ఈ ఓఎస్ అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములైన వారిని అభినందించారు.

ఏమిటీ భరోస్?

- విదేశీ ఓఎస్‌పై ఆధారపడడాన్ని తగ్గించుకోవడం, స్థానికంగా అభివృద్ధి చేసిన టెక్నాలజీ వాడకాన్ని ప్రోత్సహించడాన్ని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.
- ఇందుకోసం భరోస్ పేరిట దేశీయ ఆపరేటింగ్ సిస్టమ్ అభివృద్ధికి నిధులు సమకూర్చింది.
- ప్రపంచవ్యాప్తంగా గూగుల్ ఆండ్రాయిడ్, ఆపిల్ ఐఓఎస్ ఆపరేటింగ్ సిస్టమ్స్ బాగా ప్రాచుర్యంలో ఉన్నాయి. ఈ ఓఎస్‌లతో డిఫాల్ట్ యాప్‌లు, గూగుల్ సర్వీసులు తప్పనిసరిగా వస్తాయి. వాటిలో చాలావరకు మనకు అవసరం లేనివే ఉంటాయి. అవి ఏ మేరకు భద్రమో తెలియదు.
- భరోస్ ఓఎస్ వీటి కంటే కొంత భిన్నమనే చెప్పాలి. ఇదొక ఉచిత, ఓపెన్-సోర్స్ ఆపరేటింగ్ సిస్టమ్. ఇది నో డిఫాల్ట్ యాప్స్(ఎన్‌డీఏ)తో వస్తుంది. అంటే భరోస్ ఓఎస్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్న ఫోన్‌లో ఎలాంటి యాప్‌లు కనిపించవు.
- గూగుల్ ఆండ్రాయిడ్ వెర్షన్లతో క్రోమ్, జీమెయిల్, గూగుల్ సెర్చ్, యూట్యూబ్, మ్యాప్స్ వంటివి డిఫాల్ట్‌గా వస్తుండడం తెలిసిందే.
- డిఫాల్ట్‌గా వచ్చే యాప్‌లతో మోసాలకు గురవుతుండడం వినియోగదారులకు అనుభవమే. అందుకే భరోస్ ఓఎస్ ఉన్న ఫోన్లలో అవసరమైన యాప్‌లను ప్రైవేట్ యాప్ స్టోర్ సర్వీసెస్(పాస్) నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.
- 'పాస్'లో బాగా నమ్మకమైన, ప్రభుత్వ అనుమతి ఉన్న, అన్ని రకాల భద్రత, గోప్యత ప్రమాణాలు కలిగిన యాప్‌లు మాత్రమే ఉంటాయి. దీనివల్ల ఫోన్లలోని డేటా చోరీకి గురవుతుందన్న ఆందోళన ఉండదు.
- స్మార్ట్‌ఫోన్ల కంపెనీలకు ఈ ఓఎస్‌ను ఎలా అందజేస్తారు? ప్రజలకు ఎప్పటి నుంచి అందుబాటులోకి తీసుకొస్తారు? రెగ్యులర్ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులందరికీ ఇస్తారా? లేదా? అనేదానిపై ఐఐటీ-మద్రాస్ ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు.



ఎవరు వాడుతున్నారు?

- కఠినమైన భద్రత, గోప్యత అవసరాలు కలిగిన కొన్ని సంస్థలు ప్రస్తుతం భరోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను పరీక్షిస్తున్నాయి.
- రహస్య సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకొనే ప్రభుత్వ కంపెనీలు ఈ ఓఎస్‌ను వాడుతున్నట్లు సమాచారం.

ఎందుకీ ఓఎస్?

- గూగుల్ మొబైల్ ఓఎస్ ఆండ్రాయిడ్‌పై కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖకు చెందిన కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) గతంలో అభ్యంతరాలు వ్యక్తం చేసింది.
- ఆండ్రాయిడ్‌తో డిఫాల్ట్‌గా వస్తున్న కొన్ని యాప్‌ల్లో భద్రతాపరమైన లోపాలు ఉన్నట్లు తెలియజేసింది.
- ఈ నేపథ్యంలోనే దేశీయ ఆపరేటింగ్ సిస్టమ్ తయారీపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

విప్లవాత్మక ముందడుగు

ఐఐటీ-మద్రాసు ఆధ్వర్యంలో స్థాపించిన జండ్ కే ఆపరేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్(జండ్‌కాప్స్) అనే లాభాపేక్ష లేని స్టార్టప్ కంపెనీ భరోస్ ఓఎస్‌ను అభివృద్ధి చేసింది. 'నేషనల్ మిషన్ ఆన్ ఇంటర్ డిసిప్లినరీ సైబర్ ఫిజికల్ సిస్టమ్స్' కింద కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ నిధులు అందజేసింది. నమ్మకం అనే పునాదిపై భరోస్ మొబైల్ ఆపరేటింగ్ వ్యవస్థను రూపొందించినట్లు ఐఐటీ-మద్రాస్ డైరెక్టర్ చెప్పారు. తమ అవసరాలను తీర్చే యాప్‌లను పొందే స్వేచ్ఛను వినియోగదారులకు కల్పించాలన్నదే ఈ ప్రాజెక్టు ఉద్దేశమని వివరించారు. దీనివల్ల సంబంధిత యాప్‌లపై వారికి తగిన నియంత్రణ ఉంటుందన్నారు. ఫోన్లలోని డేటా భద్రతకు భరోసా కల్పించే విషయంలో ఇదొక విప్లవాత్మకమైన ముందడుగు అని అభివర్ణించారు. మన దేశంలో ఈ ఓఎస్ వినియోగాన్ని పెంచేందుకు ప్రైవేట్ పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలు, వ్యూహాత్మక సంస్థలు, టెలికాం సర్వీస్ ప్రొవైడర్లతో కలిసి పని చేస్తామని వివరించారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి
కరీంనగర్
శనివారం : 28 : జనవరి : 2023



రాజన్న సన్నిధిలో భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్నను శుక్రవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.15 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు ఇంటర్ విద్యాశాఖ పలు మార్పులు తీసుకవస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/14.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. చలితీవ్రత కొనసాగుతుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కమిషనరేట్‌ను పరిశీలించిన సీపీ



వెల్ఫేర్ స్టోర్‌ను పరిశీలిస్తున్న సీపీ

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు కమిషనరేట్ కేంద్రంలోని వివిధ విభాగాలకు చెందిన కార్యాలయాలను శుక్రవారం పరిశీలించారు. కమిషనరేట్‌లోని సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ (సీఏఆర్) క్వార్టర్స్ గార్డు, ఆయుధాగారం, నూతనంగా నిర్మించిన కార్యాలయంలోని టాస్క్‌ఫోర్స్, జిమ్, యూనిట్ ఆసుపత్రి, వాటర్ ప్లాంట్, వెల్ఫేర్ స్టోర్, రేంజ్ డీఐజీ కార్యాలయం పరిపాలన విభాగం భవనం, మోటారు ట్రాన్స్‌పోర్ట్ విభాగాలను పరిశీలించారు. రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహించుకోవాలని సీపీ సూచించారు.

సాంకేతిక విద్యతో ముందుకెళ్లాలి



కంప్యూటర్‌ను పరిశీలిస్తున్న వీసీ మల్లేశ్

కరీంనగర్‌రూరల్: విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నతస్థాయికి చేరుకునే అవకాశముందని శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ సంకశాల మల్లేశ్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, స్మార్ట్ క్లాస్‌రూమ్, కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. తరగతి గదులు, ప్రయోగశాల, లైబ్రరీ, వసతి గదులు, వంటశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, విద్యార్థులు తమ మూలాలను మరిచిపోకుండా ఉన్నత విద్యను అభ్యసించి ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ సమత, సిరిసిల్ల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ పద్మజ, స్టాఫ్ సెక్రటరీ రోజారమణి, ఎన్‌ఎస్‌ఎస్ పీవో లావణ్య, ఏసీవో సుష్మ, లైబ్రేరియన్ మోహన్‌రావు, కల్చరల్ కోఆర్డినేటర్ కవిత పాల్గొన్నారు.

రెండు నెలల సదరం షెడ్యూల్ ఖరారు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో దివ్యాంగుల నిర్ధారణ కోసం 2023వ సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలల్లో నిర్వహించే సదరం షెడ్యూల్‌ను శుక్రవారం ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రత్నమాల ప్రకటించారు. ఈనెల 28 నుంచి స్లాట్ బుకింగ్ మీసేవ కేంద్రంలో ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఫిబ్రవరి నెలలో 2వ తేదీన ఆర్థో, 7వ తేదీన మానసిక రోగులు, 14వ తేదీన కంటి చూపు, 20వ తేదీన వినికిడి మూగ (చెవుడు), మార్చి నెలలో 2వ తేదీన ఆర్థో, 137వ తేదీన మానసిక రోగులు, 16వ తేదీన కంటిచూపు, 30వ తేదీన వినికిడి మూగ (చెవుడు) శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వికలాంగులు నిర్ధారించిన తేదీలలో వాటికి సంబంధించిన వైద్య పత్రాలు, మీసేవలో బుక్ చేసుకున్న రోజుతోపాటు పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకుని సదరం క్యాంపునకు హాజరుకావాలని కోరారు.

ఆప్షన్ ఫామ్స్ అందజేసిన 60 మంది స్పౌజ్‌లు



ఆప్షన్ ఫామ్స్ అందిస్తున్న స్పౌజ్‌లు

కరీంనగర్: గతేడాది క్రితం 317 జీవో అమలులో భాగంగా వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయిన భార్యభర్తలు (స్పౌజ్) ఎట్టకేలకు శుక్రవారం డీఈవో కార్యాలయానికి చేరుకొని ఆప్షన్ ఫామ్స్ అందజేశారు.60 మంది శుక్రవారం వారు పనిచేస్తున్న ప్రాంతాల నుంచి రిలీవ్ అయి డీఈవో కార్యాలయంలో రిపోర్టు చేశారు. దీంతో ఏడాది కాలంగా స్పౌజ్ సమస్యను పరిష్కరించాలని వివిధ ఆందోళనలు చేపట్టిన స్పౌజ్ ఫోరం కృషి ఫలించినట్లయింది. స్పౌజ్ ఉపాధ్యాయుల ఆప్షన్ ఫామ్స్ అందాయని వాటిని నిశితంగా పరిశీలించి దంపతులకు ఒకేచోట పోస్టింగ్ ఇవ్వనున్నామని అక్కడ ఖాళీలు లేకపోతే సమీప పాఠశాలలో పోస్టింగ్ ఇవ్వనున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

స్వామివారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



- శాస్త్రోపేతంగా ప్రారంభమైన వెంకన్న ఉత్సవాలు
- శ్రీహరి నామస్మరణలతో మార్మోగిన నగరం
- పుట్టమన్నుతో భారీ ర్యాలీ

కరీంనగర్‌కల్చరల్: మార్కెట్ రోడ్డులోని శ్రీవేంకటేశ్వరసామి ఆలయ షష్ఠమ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. గుదిమెళ్ల విజయ్‌కుమారాచార్యులు ఆధ్వర్యంలో అనువంశిక అర్చకులు చేనోజ్వల నాగరాజాచార్యులు, ఈవో వెంకన్న పుణ్యాహవచనం చేశారు. మహిళల కోలాట నృత్యాలు, భక్తుల గోవిందానామస్మరణల మధ్య ఆలయం నుంచి శరణు ఘోషలు, శంఖనాథాలు, వేద మంత్రోచ్చారణలు, ఛత్రచామరలతో పాతబజార్ శివాలయం చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్ట మట్టిని సేకరించి పరమ పవిత్రంగా తలపై పెట్టుకొని ఈవో, ధర్మకర్త చకిలం గంగాధర్, చకిలం శ్రీనివాస్, భక్తుల గోవిందనామస్మరణలు, హరిదాసుల కీర్తనలు, కోలాటాల మధ్య ఊరేగుతూ వేంకటేశ్వరసామి ఆలయానికి చేరుకున్నారు. మంగళ వాయిద్యాలు, మంగళ హారతులు, వేద మంత్రోచ్చారణలు, వివిధ అలంకరణలు, కోలాట నృత్యాలు భక్తిపారవశ్యంతో శ్రీవారు ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

గోగుల ప్రసాద్ ఆధ్వర్యంలో హనుమాన్ సాయి భజన మండలి, చొప్పదండి, శివరామకృష్ణ భజన మండలి, గట్టుదుద్దెనపల్లి వారిచే భజనలు, వెన్నెల శిష్యబృందం భక్తి సంకీర్తనలు, సినీ నేపథ్య గాయకులు శ్రీకృష్ణ, చిలువేరు శ్రీకాంత్ భక్తి కీర్తనలు అలరించాయి.



స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న మంత్రి కమలాకర్



స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పుట్టమట్టి తీసుకొస్తున్న ఈవో, ధర్మకర్త, తదితరులు



సినీ గాయకుడు శ్రీకృష్ణ సంగీత విభావరి

టీచర్ల బదిలీల ప్రక్రియ షురూ

- నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఎనిమిదేళ్లుగా ఒకేచోట పనిచేస్తే స్థానచలనమే
- బదిలీ, ప్రమోషన్లపై ఉపాధ్యాయుల్లో ఉత్కంఠ
- వెలువడని సీనియార్టీ, ఖాళీల జాబితా



కరీంనగర్‌లో కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

కరీంనగర్: ఉపాధ్యాయులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బదిలీలు, ప్రమోషన్లకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంతో శనివారం నుంచి ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోనున్నారు. బదిలీ కోరుకున్న ఉపాధ్యాయుల దరఖాస్తులు పరిశీలించిన ప్రభుత్వం వెబ్‌కౌన్సిలింగ్ ద్వారా ప్రక్రియ చేపట్టనుంది. ఎనిమిదేళ్లుగా ఒకే చోట ఒకే పాఠశాలలో ఉద్యోగం చేస్తున్న టీచర్లకు, ఐదేళ్లుగా ఒకే పాఠశాలకు పరిమితమైన హెచ్‌ఎంలకు బదిలీ తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒకే చోట కనీసం రెండేళ్లు పనిచేసిన టీచర్లను మాత్రమే బదిలీకి అనుమతించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నేటి నుంచి టీచర్ల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ కొనసాగనుంది. ఈనెల 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. హార్డ్ కాపీలను ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు.. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత టీచర్లు సంబంధిత ఎంఈవోలకు, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులు సంబంధిత కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డీఈవోకు ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2 లోపు సమర్పించాల్సి ఉంది. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మార్చి 4 వరకు జరగనుండగా.. అభ్యంతరాల స్వీకరణకు 15 రోజులు గడువు ఇచ్చారు.

మార్గదర్శకాలు ఇవే..

→ ఒకే పాఠశాలలో వరుసగా ఐదేళ్లు పనిచేసిన ప్రధానోపాధ్యాయులకు బదిలీలు తప్పనిసరి. ఒకేచోట ఎనిమిదేళ్లు పనిచేసిన టీచర్లనూ తప్పనిసరిగా బదిలీ చేయాలి.

→ బదిలీ కోరుకునే ఉపాధ్యాయుడు పాఠశాలలో రెండేళ్లపాటు పనిచేసి ఉండాలి.

→ ప్రిపరేషన్ కేటగిరీలో ఉపాధ్యాయులకు ముందుగా ప్రాధాన్యత ఇస్తారు. వితంతువులు, వ్యాధులతో బాధపడుతున్న వారికి, మానసిక వైకల్యం గల పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు బదిలీల్లో మొదటి ప్రాధాన్యత ఇస్తారు.

→ బాలికల పాఠశాలల్లో 50 ఏళ్ల లోపున్న ప్రధానోపాధ్యాయులను (పురుషులు) తప్పనిసరిగా బదిలీ చేయాలి. ఇక్కడ మహిళా హెచ్‌ఎంలను నియమించాలి. ఒకవేళ అర్హత కలిగిన మహిళలు లేకుంటే 50 ఏళ్లు పైబడిన పురుషులను నియమించవచ్చు.

→ ఎన్‌సీసీ ఆఫీసర్లుగా ఉండి ఐదేళ్లు పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయులు, ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న టీచర్లను ఎన్‌సీసీ ఉన్న పాఠశాలలకు బదిలీ చేయాలి.

→ ప్రత్యేక కేటగిరీగా ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు 10 పాయింట్లు కేటాయిస్తారు. భార్యాభర్తలు ఇద్దరు ఉద్యోగులైతే 10 పాయింట్లు.

→ పాఠశాలలను పాయింట్ల వారీగా 3 కేటగిరీలుగా విభజించారు. 17 హెచ్‌ఆర్‌ఏ శాతం ఉన్న వారికి ఏడాదికి ఒక పాయింట్, 13 హెచ్‌ఆర్‌ఏ పొందుతున్న వారికి రెండు పాయింట్లు, 11 శాతం హెచ్‌ఆర్‌ఏ పొందుతున్న వారికి 3 పాయింట్లు కేటాయిస్తారు. సర్వీస్ పాయింట్లు ఏడాదికి రెండు పాయింట్లు కేటాయిస్తారు.

తీరు మారని విద్యాశాఖ

రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ఉపాధ్యాయుల సీనియార్టీ, ఖాళీల జాబితాను శుక్రవారం ప్రకటించాల్సి ఉంటుంది. కానీ.. డీఈవో వెబ్‌సైట్‌లో ఎలాంటి జాబితాలు పొందుపర్చలేదు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జాబితాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు అవేమి పట్టనట్లుగా వ్యవహరించడమే కాకుండా జవాబుదారితనం లేకుండా పోయింది. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ జరిగినప్పుడల్లా జిల్లాలో జాబితాలు సక్రమంగా విడుదల చేయకపోవడం, కౌన్సిలింగ్ సమయంలో సంఘాల మ ధ్య గొడవలకు తావివ్వడం జరుగుతున్నా అ ధికారులు అప్రమత్తం కాకపోవడం గమనార్హం.

→ బదిలీలకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీ నిర్ణయం తీసుకున్నాక ఎలాంటి మార్పులు, చేర్పులకు అవకాశం ఉండదు.

→ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలలకు సంబంధించి జిల్లా కలెక్టర్ అధ్యక్షుడిగా, అదనపు కలెక్టర్ ఉపాధ్యక్షుడిగా, జెడ్పీ సీఈవో సభ్యులు, డీఈవో కార్యదర్శిగా వ్యవహరిస్తారు.

→ జిల్లా పరిషత్, ఎంపీపీ పాఠశాలల ఉపాధ్యాయులకు జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షులుగా, కలెక్టర్ ఉపాధ్యక్షుడిగా, అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈవో సభ్యులుగా, డీఈవో కార్యదర్శిగా వ్యవహరిస్తారు.

ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి

- కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి

కరీంనగర్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మన ఊరు- మన బడి, ఉపాధ్యాయుల బదిలీలు అంశంపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ఉపాధ్యాయులు సీనియారిటీ జాబితా, ఖాళీల జాబితా ఆన్‌లైన్‌లో ప్రదర్శించాలని, వాటిలో అభ్యంతరాలను ఉపాధ్యాయుల నుంచి స్వీకరించాలన్నారు. జిల్లాలో ఉపాధ్యాయుల కోసం తాత్కాలికంగా మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. మన ఊరు-మనబడి కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేయడంలో కలెక్టర్లు కీలక పాత్ర పోషించారని, మోడల్ పాఠశాలలను త్వరలో ప్రారంభించడం జరుగుతుందని పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ మాట్లాడుతూ, జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కోసం సీనియారిటీ జాబితా, ఖాళీల జాబితా సమర్పించామని, పారదర్శంగా నిర్వహిస్తామని తెలిపారు. మన ఊరు- మన బడి కింద ఎంపిక చేసిన 30 మోడల్ పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేస్తామని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకటి కరుణ, డైరెక్టర్ దేవాసేన, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణకు ఘన వీడ్కోలు



వాహనాన్ని తాడుసాయంతో లాగుతూ.. ఘనవీడ్కోలు పలుకుతున్న కమిషనరేట్ పోలీసులు



నూతన సీపీని సన్మానిస్తున్న మంత్రి గంగుల

- కోవిడ్ సమయంలో పోలీసుల సేవలు మరవలేనివి
- రాష్ట్ర పౌరసరఫరాల, బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్



గజమాలతో సత్కరిస్తున్న సీపీ, ఏసీపీలు

కరీంనగర్‌క్రైం: అన్నివర్గాలకు చెందిన ప్రజల మన్ననలు పొందుతూ సేవలందించే అధికారులు గుర్తుండిపోతారని రాష్ట్ర పౌరసరఫరాల, బీసీసంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బదిలీపై వెళ్తున్న సీపీ వి.సత్యనారాయణకు వీడ్కోలు, నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీపీ ఎల్.సుబ్బరాయుడుకు స్వాగతం పలుకుతూ శుక్రవారం కమిషనరేట్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి కమలాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోలీస్‌కమిషనర్‌గా వి.సత్యనారాయణ సమర్థవంతంగా పనిచేశారని అన్నారు. రాజన్న జోన్ డీఐజీ కె.రమేశ్‌నాయుడు.. మాట్లాడుతూ మానవత్వంతో స్పందిస్తూ సేవలందించే అధికారిగా సత్యనారాయణ గుర్తింపు పొందారని తెలిపారు. సత్యనారాయణ మాట్లాడుతూ.. సాహసోపేతమైన చర్యలతో కమిషనరేట్‌వ్యాప్తంగా శాంతియుత వాతావరణం ఏర్పడిందన్నారు. నూతన సీపీ ఎల్.సుబ్బరాయుడు మాట్లాడుతూ.. తనకు సుపరిచత ప్రాంతమే అయినందున సమన్వయంతో పనిచేస్తానని తెలిపారు. అనంతరం బదిలీపై వెళ్తున్న సీపీ సత్యనారాయణను మంత్రి కమలాకర్ ఆధ్వర్యంలో జ్ఞాపిక, శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ సునీల్‌రావు, కలెక్టర్ కర్ణన్, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, శిక్షణ కలెక్టర్‌లెనిన్, డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు తుల శ్రీనివాసరావు, కరుణాకర్ రావు, వెంకటరెడ్డి, మదన్‌లాల్, విజయసారథి, శ్రీనివాస్, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి వెంకన్న, ఎస్‌బీఐ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగులో సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

కరీంనగర్‌టౌన్: కంటివెలుగు కార్యక్రమంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కంటి వెలుగు ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులతో కంటివెలుగు, ఇతర ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంటి వెలుగుకు హాజరవుతున్న మహిళలకు 'ఏ ఫీల్డ్ యాప్'ను డౌన్‌లోడ్ చేయాలని, సమాచారాన్ని అప్‌డేట్ చేయాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నమాల, డీసీహెచ్ఎస్ ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో ఎంపికైన వికలాంగులకు ఉపకరణాలు



వివరాలు తెలుసుకుంటున్న సబితకుమారి

కరీంనగర్: వికలాంగుల నుంచి సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తులు స్వీకరించామని, ఎంపికైన వారికి త్వరలో సహాయ ఉపకరణాలు అందించేందుకు మరో క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కే.సబితాకుమారి తెలిపారు. శుక్రవారం అలీమ్ కో సంస్థ సహకారంతో వికలాంగులకు సహాయ ఉపకరణాలు అందజేసేందుకు వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ, శిబిరానికి వికలాంగులు పెద్ద ఎత్తున హాజరయ్యారని, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు సహా దరఖాస్తు సమర్పించారన్నారు. 400 మంది శారీరక వికలాంగులు, 120 మంది అంధులు, 220 మంది వినికిడి లోపం ఉన్నవారు శిబిరానికి హాజరై ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, అర్హతను బట్టి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 28న హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హుజూరాబాద్ డివిజన్ లో అర్హత గల వికలాంగులు శిబిరానికి హాజరు కావాలని కోరారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి రాజవీరు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, కిష్టఫర్, ఎఫ్ఆర్‌వో స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏఐఎస్ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, నాయకులు

కరీంనగర్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా సమితి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ తన కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థి ఉద్యమాలతో పాటు సామాజిక బాధ్యతతో ఏఐఎస్ఎఫ్ క్యాలెండర్ రూపొందించడం శుభపరిణామమని హర్షం వ్యక్తం చేశారు. ప్రతీ విద్యార్థి చదువుతూ, సమాజానికి ఉపయోగపడే సామాజిక కార్యక్రమాలు రూపొందించుకొని ముందుకు సాగాలన్నారు. పేద విద్యార్థులకు ఉపయోగపడే ఏ మంచి కార్యక్రమానికైనా ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్, జిల్లా ఆఫీస్ బేరర్స్ కనకం సాగర్, కేశబోయిన రాము, నగర నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్ ధర రూ.7,750


వేలం పాడుతున్న వ్యాపారులు

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో వారం రోజుల్లో పత్తి క్వింటాల్‌కు రూ.500 వరకు ధరలు తగ్గాయి. శుక్రవారం మార్కెట్‌లో క్వింటాల్ పత్తికి గరిష్ట ధర రూ.7,750 పలికింది. మార్కెట్‌కు 125 వాహనాల్లో 1,675 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా గరిష్ట ధర రూ.7,750, మోడల్ ధర రూ.7,700, కనిష్ట ధర రూ.7,200 చెల్లించారు. గన్నీ సంచుల్లో 16 మంది రైతులు 26 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,400, మోడల్ ధర రూ.7,300, కనిష్ట ధర రూ.6,000 చెల్లించారు. మార్కెట్ యార్డుకు శని, ఆదివారాలు సాధారణ సెలవులు ఉంటాయని, సోమవారం క్రయ విక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని మార్కెట్ కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ తెలిపారు.

రాష్ట్ర పరిశీలకుడిగా ఎంపిక


ఓదెల కుమార్

మానకొండూర్‌రూరల్: జాతీయ విద్యార్థి విజ్ఞాన మంత్ర ప్రయోగ పరీక్ష పరిశీలకుడిగా మండలంలోని పచ్చునూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ఓదెల కుమార్ ఎంపికయ్యాడు. ఈనెల 29న హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో సాంస్కృతిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చేసే రసాయనశాస్త్ర ప్రయోగాల నైపుణ్యాలను పరిశీలించి, జాతీయ స్థాయికి విద్యార్థులను ఎంపిక చేయనున్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా..

- ఇంటర్ విద్యార్థులకు ప్రతీ వారం పరీక్షలు, ప్రత్యేక తరగతులు
- చదువులో వెనకబడిన విద్యార్థులపై శ్రద్ధ
- ఎంసెట్, నీట్‌కు ఉచిత శిక్షణ



ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఆర్ట్స్ అండ్ కామర్స్)

కరీంనగర్: కరోనాతో రెండేళ్లు కకావికలమైన విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటుంది. ఈ ఏడాది పూర్తిస్థాయిలో తరగతులు కొనసాగించడంతో పాటు షెడ్యూల్ ప్రకారం పరీక్షల నిర్వహణకు ఇంటర్ విద్యాశాఖ ముందస్తు ప్రణాళికలు రూపొందించి ఆ దిశగా ముందుకు సాగుతోంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు ఇంటర్ విద్యాశాఖ పలు మార్పులు తీసుకవస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ కాలేజీల్లో ఎక్కువ మంది పేద విద్యార్థులే విద్యనభ్యసిస్తారు. వాటిలో చదువుతున్న వారిలో ఎక్కువ మంది గట్టెక్కడం లేదు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఇక నుంచి ప్రతీ వారం పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు ఇంటర్ విద్యాశాఖ సంస్కరణలకు సిద్ధమైంది. ఇప్పటికే సిలబస్ పూర్తి చేసి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించారు.

ఫలితాల ఆధారంగా తరగతులు

జిల్లాలో ప్రభుత్వ కాలేజీలు 11, సోషల్ వెల్ఫేర్ 4, కేజీబీవీ 5, ఆదర్శ 11, బీసీ వెల్ఫేర్ 4, మైనార్టీ 3 మొత్తం 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో 12వేల మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. వీరిలో కొందరు వ్యవసాయ, పార్ట్‌టైం పనులు చేసుకుంటూ తరగతులకు హాజరవుతున్నారు. గత విద్యా సంవత్సరం సగం మంది విద్యార్థులు కూడా ఉత్తీర్ణులు కాలేదు. ప్రతీ సంవత్సరం ఇలాంటి పరిస్థితులే నెలకొంటున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం పెంపుపై ఇంటర్ బోర్డు ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతీ వారం పరీక్షలు నిర్వహిస్తూ ఫలితాల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకోనున్నారు.

ఎంసెట్, నీట్‌కు సన్నద్ధమయ్యేలా..

ప్రైవేట్ కళాశాలల్లో ఎంసెట్, నీట్‌కు విద్యార్థుల్ని సిద్ధం చేస్తారు. ఇందుకు అధిక మొత్తంలో ఫీజులు నిర్ణయిస్తారు. ప్రభుత్వ కాలేజీల్లో విద్యార్థులు ఎలాంటి అవగాహన లేకుండా పరీక్షలు రాస్తుండడంతో ర్యాంకుల సాధనలో వెనుకబడుతున్నారు. ఈ సంవత్సరం నుంచి వీటిలోనూ ఎంసెట్, నీట్‌కు విద్యార్థుల్ని సన్నద్ధం చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ నిర్ణయంతో పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. రెండు నెలల పాటు ఎంసెట్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు పరీక్ష నిర్వహించి అందులో మెరిట్ మార్కులు సాధించిన వంద మందిని ఎంపిక చేసి ఏప్రిల్, మే నెలల్లో ప్రత్యేక వసతి, భోజనం, శిక్షణ తరగతులను ఉచితంగా అందించి సన్నద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇందుకు ప్రత్యేకంగా అధ్యాపకులను నియమించడమా, ప్రస్తుతం పని చేస్తున్న అధ్యాపకులతోనే శిక్షణ ఇవ్వడమా అన్న అంశంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఆదేశాలు పాటిస్తాం



ఇంటర్ బోర్డు ఆదేశాలకు అనుగుణంగా ముందుకు సాగుతాం. విద్యార్థులకు ప్రతీ వారం పరీక్షలు నిర్వహించడం ద్వారా సామర్థ్యాలను ముందే గుర్తించేందుకు వీలుంటుంది. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఎంసెట్, నీట్‌పై ఉన్నతాధికారుల ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ కళాశాలల్లో వారానికో పరీక్ష నిర్వహించి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా తీర్చిదిద్దుతాం.

– రాజ్యలక్ష్మి, డీఐఈవో

తపాలా అధికారుల విచారణ


సోమారంలో ఖాతాదారుల పాసు బుక్కులు పరిశీలిస్తున్న ఏఎస్‌పీ అనంతరాం నాయక్



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

- సుకన్య సమృద్ధి యోజన డబ్బులు స్వాహా కథనంపై స్పందన

సాక్షి స్పందన

సైదాపూర్(హుస్నాబాద్): మండలంలోని వెన్నంపల్లి, సోమారం, ఆరెపల్లి, లస్మన్నపల్లి గ్రామాల్లో సుకన్య సమృద్ధి యోజన ఖాతాదారుల పాసు బుక్కలను హుజూరాబాద్ పోస్టల్ ఏఎస్‌పీ అనంతరాం నాయక్, సహాయకుడు విజయరామరాజు శుక్రవారం పరిశీలించారు. ఖాతాదారుల డబ్బులు వీబీపీఎం కాజేశాడని బాధితుల ఆందోళన మేరకు ఈ నెల 26న 'సాక్షి'లో ప్రచురితమైన 'సుకన్య సమృద్ధి యోజన డబ్బులు స్వాహా' కథనానికి పోస్టల్ డిపార్టుమెంట్ ఏఎస్‌పీ స్పందించారు. వెన్నంపల్లి సబ్ పోస్టాఫీస్ పరిధిలోని వెన్నంపల్లి, ఆరెపల్లి, సోమారం, లస్మన్నపల్లి గ్రామాల్లో సుకన్య సమృద్ధి యోజన ఖాతాదారుల పాసు బుక్కుల్లో కట్టిన డబ్బులు ఎంట్రీ చేసి, పోస్టాఫీసులో జమ చేశారా? లేదా? అనే కోణంలో పరిశీలించారు. డబ్బులు ఎక్కడికీ పోవని, విచారణ అనంతరం ఖాతాల్లో జమ చేయిస్తామని ఏఎస్‌పీ ఖాతాదారులకు హామీ ఇచ్చారు. కాగా వాడుకున్న డబ్బులు రెండు రోజుల్లో ఖాతాదారులకు ఇస్తానని వీబీపీఎం చంద్రారెడ్డి ఖాతాదారులతో మాట్లాడుతున్నట్లు సమాచారం.

ఎల్లమ్మ బోనాల జాతర ఘనంగా నిర్వహిస్తాం


సమావేశంలో గౌడ సంఘం ప్రతినిధులు

కరీంనగర్: కరీంనగర్‌లో వచ్చే మార్చి, ఏప్రిల్ నెలలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాల జాతరను ఘనంగా నిర్వహిస్తామని గౌడ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బైపాస్ రోడ్డులోని ఎల్లమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కొడూరి సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో నగరంలో గౌడ ప్రజాప్రతినిధులు, నాయకులు సమావేశమయ్యారు. ఆలయానికి కేటాయించిన ఐదెకరాల స్థలాన్ని కాపాడుకోవడంతో పాటు అభివృద్ధి, సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా ఆలయాన్ని ఆనుకొని ఉన్న నగరపాలక సంస్థ డంప్‌యార్డు వల్ల తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయని, దుర్వాసనతో కనీసం అక్కడ ఉండే పరిస్థితి కూడా లేదని, దీని పరిష్కారం కోసం త్వరలో నగరపాలక మేయర్, అధికారులు, మంత్రిని కలిసి విన్నవించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా గౌడ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రతీ ఐదేళ్లకోసారి బోనాలు నిర్వహిస్తుండగా మధ్యలో కరోనాతో ఇబ్బందులు వచ్చాయని, ఈ సారి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. నగరంలోని ప్రతీ గౌడ ఇంటి నుంచి బోనం వచ్చేందుకు కృషి చేయాలని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, కార్పొరేటర్ భూమాగౌడ్, నాయకులు పిల్లి మహేష్‌గౌడ్, గుగ్గిళ్ల శ్రీనివాస్, కోడూరి మహేందర్, కోడూరి తిరుపతి, తాళ్లపల్లి హరికుమార్‌గౌడ్, జక్కుల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలు రద్దు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొత్తపల్లి(కరీంనగర్): ప్రజలకు భారంగా మారిన విద్యుత్ ఏసీడీ, ఇతర సర్వీస్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ(ఏఐఎఫ్‌బీ) ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్ఈ గంగాధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ, ప్రజలపై ఏసీడీ చార్జీల పేరుతో అదనపు భారం మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికే వినియోగదారులు ప్రతి నెలా వాడుకుంటున్న కరెంట్‌కు బిల్లులు చెల్లిస్తున్నపుడు మళ్లీ ఏసీడీ చార్జీలు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రజలు చాలా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అదనపు విద్యుత్ చార్జీలు వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి.ప్రశాంత్‌కుమార్, జె.రాజు తదితరులు పాల్గొన్నారు.

స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలి

హుజూరాబాద్: రెండు లేదా మూడు పోస్టులకు పదోన్నతి అర్హత ఉన్న ఉపాధ్యాయులను ఒకే పోస్టు పదోన్నతికి అండర్ టేకింగ్ ఇవ్వాలని ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులను (జీఓ ఎంఎస్ నం.5) వెనక్కి తీసుకోవాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోలంపెల్లి ఆదర్శన్‌రెడ్డి, గంప చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ, ఈ విషయంలో పాఠశాల విద్యాశాఖ అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని, ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని కోరారు. అలాగే ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా జీవో ఎంఎస్ 12 ప్రకారం డీయడ్/టి.టి.సి ఉన్న వారికి మాత్రమే అవకాశం కల్పించాలన్నారు. అలాగే గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా 10 ప్లస్ 2 ప్లస్ 3 విద్యార్హతలు కలిగిన తెలుగు, హిందీ స్కూల్ అసిస్టెంట్‌లు ఆ పోస్టుకు అర్హత సాధించిన సంవత్సరంతో సంబంధం లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరిని సీనియారిటీ జాబితాలోకి అవకాశం కల్పించాలని, వీటికి సంబంధించి స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

మానేరు వెలస్కో-23 పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ తదితరులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల ఆధ్వర్యంలో పద్మనగర్‌లోని మానేరు సెంట్రల్ స్కూల్‌లో వెలస్కో- 2023 పేరిట నిర్వహించే 37వ వార్షికోత్సవానికి సంబంధించి వాల్ పోస్టర్‌ను శుక్రవారం కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ జనార్దన్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత మూడేళ్లుగా విద్యార్థులు వార్షికోత్సవాలకు దూరంగా ఉన్నారని ఈ సంవత్సరం అన్ని విద్యాసంస్థలు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానేరు స్కూల్ విద్యార్థులు తమ మేధస్సుకు పదునుపెట్టి సమాజానికి ఉపయోగపడే వినూత్న ప్రదర్శనలు చేయడం అభినందనీయమన్నారు. విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ, ఈ నెల 28, 29 తేదీల్లో వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ కడారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో కరోనా లాంటి వైరస్‌లను భవిష్యత్‌లో ఎలా ఎదుర్కోవాలో తదితరవాటిని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 28న జరిగే కార్యక్రమానికి కలెక్టర్ ఆర్వీ కర్ణన్, 29న జరిగే కార్యక్రమానికి శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ సీహెచ్.మల్లేశం హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి అశోక్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, మానేరు బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి వ్యతిరేకంగా కేసీఆర్ పాలన

- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. కె. నగేశ్


మాట్లాడుతున్న డాక్టర్ కె.నగేశ్

విద్యానగర్(కరీంనగర్): అమరుల త్యాగాలతో ఏర్పాటైనా తెలంగాణను కేసీఆర్ తన ఫామ్ హౌస్‌గా భావిస్తు రాజ్యాంగానికి వ్యతిరేకంగా పాలన సాగిస్తున్నారని, ఆయనను రాష్ట్రం నుంచి తరిమి కొట్టే సమయం ఆసన్నమైందని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. సర్వోన్నతమైన భారత రాజ్యాంగాన్ని అవమానిస్తు పరేడ్ గ్రౌండ్‌లో గవర్నర్ పాల్గొనే గణతంత్ర వేడుకలను అడ్డుకోవడం సిగ్గుచేటైన విషయమన్నారు. బీఆర్ఎస్ అంటూ బయలుదేరిన కేసీఆర్ ఇక దేశాన్ని ఏమి చేస్తాడోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. మన దేశంపై, రాజ్యాంగంపై తప్పుడు సంకేతాలు ఇస్తున్న కేసీఆర్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌టీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వెన్నం రజితరెడ్డి, నాయకులు డాక్టర్ శివరాం, ఊకంటి రవీందర్‌రెడ్డి, సాన రాజన్న, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

హుజూరాబాద్: మహిళలపై ఎమ్మెల్సీ పాడికౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదని ఆరోపిస్తూ శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి ఎమ్మెల్సీ ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రథమ మహిళ అయిన గవర్నర్ తమిళిసై పైన కౌశిక్‌రెడ్డి అభ్యంతరకరమైన రీతిలో మాట్లాడడం సరికాదన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ మరో రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న మహిళపై ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడడం తగదని పేర్కొన్నారు. అధికారం ఉందని ఏది పడితే అది మాట్లాడడం చేస్తే చెల్లుబాటు అవుతుందని అనుకోవడం పొరపాటని హితవు పలికారు. ఎమ్మెల్సీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు యేముల పుష్పలత, మండల అధ్యక్షులు కొల్లూరు కిరణ్, డీసీసీ అధికార ప్రతినిధి సొల్లు బాబు, నాయకులు లావణ్య, సునీత, కరీమా, సాహెబ్ హుస్సేన్, రఘుపతి, రవీందర్, కిరణ్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, కుర్ర శ్రీనివాస్, రామకృష్ణ, రవీందర్, రాజమౌళి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద శుక్రవారం బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు గర్రెపల్లి నిరుపరాణి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గవర్నర్ తమిళసైపై మీడియా సమావేశంలో అసభ్య పదజాలంతో మాట్లాడడం తీవ్ర ఆక్షేపనీయమన్నారు. మహిళలు సభ్య సమాజం తలదించుకునేలా ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి వాఖ్యలు చేశారని, వెంటనే గవర్నర్, మహిళ సభ్య సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇటికాల స్వరూప, ఎండి రజియా, సుల్తానా, ప్రవంతి, కేశ స్వరూప, సృజన, లక్ష్మి, సరిత, శిల్ప, శిరీష, పద్మ, సుశీల, విజయ, కవిత, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

సీపీకి టీఎన్జీవోస్ శుభాకాంక్షలు


సీపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీవో నేతలు

కరీంనగర్ అర్బన్: టీఎన్జీవోల సంఘం నేతలు సీపీ సుబ్బారాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం నగరంలో సీపీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో కరీంనగర్‌లో విధులు నిర్వహించి ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, దారం శ్రీనివాస్‌రెడ్డి, మహిళా జేఏసీ చైర్మన్ శారద, కేంద్ర సంఘం నేతలు సంగెం లక్ష్మణరావు, జిల్లా సహాధ్యక్షులు రాగి శ్రీనివాస్, నేతలు మారుపాక రాజేశ్ భరద్వాజ, కార్యదర్శి నేర్శెళ్ల కిషన్, గూడ ప్రభాకర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, రాజేశ్వర్‌రావు, జలాలుద్దీన్ అక్బర్, మన్మిత్‌సింగ్, మనోహర్, బాలకిషన్‌రావు, సుస్మిత, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు టీఎన్జీవో డైరీ ఆవిష్కరణ

కరీంనగర్ అర్బన్: టీఎన్జీవో జిల్లా డైరీని శనివారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్, టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మామిళ్ళ రాజేందర్, కార్యదర్శి రాయికంటి ప్రతాప్ చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, దారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి జిల్లా, పట్టణ టీఎన్జీవో సంఘం నాయకులు, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, సమస్త కార్యవర్గం పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నియామకం


కృష్ణార్జునాచారి

కరీంనగర్‌క్రైం: సమాజంలోని అణగారిన, వెనుకబడిన వర్గాలకు ఉచిత, సమర్థవంతమైన న్యాయ సేవలు అందించేందుకు లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్‌ను జాతీయ న్యాయ సేవాధికార సంస్థ కొత్త మోడల్ లీగల్ సర్వీసెస్ డెలివరీని తీసుకొచ్చింది. దీనిలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పరిధిలో చీఫ్ లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా శ్రీరామోజు కృష్ణార్జునాచారి, డిప్యూటీ లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్‌గా తణుకు మహేష్, ఆషాడపు శ్రీనివాస్, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్స్‌గా శశిధర్, గీతా ప్రసన్నలక్ష్మిలను రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ బి.సుజయ్ తెలిపారు.

ఆగిన లారీని ఢీకొని వృద్ధుడు మృతి

కరీంనగర్‌రూరల్: వృద్ధుడు స్కూటీపై వెళ్తూ ఆగి ఉన్న లారీని వెనకనుంచి ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన సుంకే భూమయ్య(70) చిన్న కుమారుడు మహేశ్ నెలరోజుల నుంచి చల్మెడ ఆనందరావు క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రోజూ భూమయ్య ఆస్పత్రికి వెళ్లి కుమారుడికి ఆహారం ఇచ్చి వస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఆస్పత్రి నుంచి స్కూటీపై బయల్దేరిన భూమయ్య బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద రోడ్డులో నిలిపి ఉన్న లారీని వెనుకనుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తల, ఛాతీ, ఎడమచేతికి బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య భూలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన పద్మ ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి కింద పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. రూరల్ పోలీసుల కథనం.. సుల్తానాబాద్‌కు చెందిన ఎనగంటి శంకరయ్య -పద్మ దంపతులు కరీంనగర్‌లోని కమల్ సెలక్షన్స్‌లో పనిచేస్తారు. రోజూ ఉదయం స్కూటీపై ఇద్దరు కరీంనగర్‌కు వచ్చి మళ్లీ సుల్తానాబాద్‌కు రాత్రి వెళ్తారు. ఈ క్రమంలో గురువారం కరీంనగర్‌కు వస్తున్న క్రమంలో బొమ్మకల్ ఫ్లైఓవర్ సమీపంలో ప్రమాదవశాత్తు పద్మ స్కూటీ పైనుంచి కిందపడింది. గాయపడిన పద్మను చల్మెడ ఆనందరావు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం వేకువజామున మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదవశాత్తు బావిలోపడి వృద్ధురాలు మృతి


కొమురమ్మ మృతదేహం

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండల కేంద్రానికి చెందిన మంకు కొమురమ్మ (70) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందింది. పోలీసుల వివరాలు.. గురువారం రాత్రి కొమురమ్మ బహిర్భూమికి వెళ్లేందుకు ఇంటి ముందు ఉన్న చేదబావిలో నీళ్లు తోడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతిచెందింది. మృతురాలి కుమారుడు మంకు సంపత్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు.

మృతదేహం అప్పగింత

జమ్మికుంట(హుజూరాబాద్): అండమాన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్ ముందు భాగంలో చిక్కుకొని జమ్మికుంట రైల్వే స్టేషన్ వరకు చేరిన మృతదేహాన్ని వరంగల్ రైల్వే పోలీసులు బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అప్పగించారు. వరంగల్ రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా నయీమ్‌నగర్‌కు చెందిన మున్సిపల్ రిటైర్డ్ ఉద్యోగి గద్వాల ఉప్పలయ్య(73) బీపీ, షుగర్ వల్ల డయాలసిస్ చేయించుకుంటూ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మానసిక పరిస్థితి సరిగా లేక జీవితంపై విరక్తితో వరంగల్– కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య ఆఫ్‌లైన్‌పై వెళ్తున్న అండమాన్ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్యకు పాల్పడగా, మృతుడి శరీరం రైలు ఇంజిన్‌కు చిక్కుకొని జమ్మికుంట రైల్వేస్టేషన్ వరకు చేరింది. జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో శవ పంచనామా చేసి బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. ఉప్పలయ్య మనవడు గద్వాల రాహుల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వరంగల్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి.సుదర్శన్ తెలిపారు.

క్లుప్తంగా

సాయిబాబా ఆలయంలో మేయర్ పూజలు



కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని భాగ్యనగర్ సాయిబాబా ఆలయ 24వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం మేయర్ సునీల్ రావు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ బాధ్యులు మేయర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు ప్రకాశ్‌రావు, అశ్విన్, డాక్టర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం ముద్రించిన 2023 క్యాలెండర్‌ను శుక్రవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఆ సంఘం నాయకులు బూస అంజయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఐలేందర్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు గుండ్ర రాజన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కటికిరెడ్డి బుచ్చన్న, సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చిగుర్ల శ్రీనివాస్, గుండెవేని రాజు, యాదవ్ హక్కుల పోరాట సమితి అధ్యక్ష, కార్యదర్శులు బండి మల్లయ్య, జంగ కొమురయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంచాల రవీందర్ పాల్గొన్నారు.

అల్పాహారం



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని ఇటుక బట్టీ కార్మికులు, పిల్లలకు శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు చిదుర సురేశ్, మెతుకు సత్యం, చింతల కిషన్, సుమన్, చక్రాధర్, వెంకటరమణారెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ చల్మెడ ఆనందరావు ఆస్పత్రిలో నర్సయ్యపల్లి గ్రామానికి చెందిన సుంక సుగుణ చేయికి శుక్రవారం శస్త్ర చికిత్స చేసేందుకు అత్యవసరంగా రక్తం అవసరమైంది. దీంతో ఆమె బంధువులు వైకే ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర హరీశ్‌గౌడ్‌ను సంప్రదించారు. వెంటనే ఫౌండేషన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు న్యాలం అనిల్ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. అనిల్‌ను రోగి బంధువులు, ఫౌండేషన్ సభ్యులు అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ




కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలో వివిధ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందిన పలువురికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను శుక్రవారం సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావులు అందజేశారు. జి.శ్రీనివాస్‌కు రూ.60వేలు, న్యాలం తిరుపతికి రూ.60వేలు, శారదకు రూ.32వేలు, సరితకు రూ.28వేలు, నారాయణకు రూ.22,500, అనిల్‌కుమార్‌కు రూ.17,500 మంజూరయ్యాయి. ఆస్పత్రుల్లో చికిత్స పొందిన ఆరుగురికి సీఎం కేసీఆర్ రూ.2,20,500 ఆర్థికసాయం మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రామోజు తిరుపతి, గొల్లె సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమాన్ దీక్షలు

కరీంనగర్‌కల్చరల్: పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా ఈనెల 28వ తేదీ నుంచి మే 14 వరకు 108 రోజులు హనుమాన్ దీక్షలు ప్రారంభిస్తున్నట్లు శ్రీహనుమాన్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోగ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పలు ఆలయాల్లో దీక్షా స్వీకరణలు చేయవచ్చని, పూర్తి వివరాలకు 9908692567 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఆహ్లాదంపై నిర్లక్ష్యం





కరీంనగర్ నగరవాసులకు దిగువ మానేరు జలాశయం అతి సమీపంలో ఉన్నా బోటింగ్ షికారు అందని ద్రాక్షగానే మిగిలింది. కొన్నేళ్ల క్రితం టూరిజం శాఖ కరీంనగర్ ప్రజలను ఆహ్లాదపర్చేందుకు మానేరు జలాశయంలో పలు బోటింగ్‌లను అందుబాటులోకి తీసుకవచ్చింది. అయితే ప్రస్తుతం నలుగురు కెపాసిటీ గల ఒక స్పీడ్ బోటు మాత్రమే బాగుంది. మిగతా బోట్లకు మరమ్మతులు లేక మూలనపడ్డాయి. అయితే ఏడాది క్రితం క్రూజ్ బోటు (డబుల్ ఇంజన్) తీసుకవచ్చినా ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో అది శిథిలావస్థకు చేరుకుంటోంది. నగరవాసులకు డ్యాం మధ్యలో బోటింగ్‌లో పార్టీ చేసుకునే ఆశ నెరవేరడం లేదు. దీనికి తోడు డ్యాం కట్టపై పర్యాటకులు కూర్చునేందుకు వసతులపై కూడా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. జలాశయంలో బోటింగ్ సౌకర్యంతో పాటు వసతుల కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్





‘ఆధార్’తో కంటి వెలుగు

- ఐదంచెల విధానంలో వైద్యపరీక్షలు
- చామన్‌పల్లిలో కొనసాగుతున్న నేత్ర వైద్యశిబిరం
- ఆరు రోజుల్లో 770 మందికి పరీక్షలు



చామన్‌పల్లి కంటివెలుగు శిబిరంలో లబ్ధిదారుల ఆధార్‌కార్డు వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

కరీంనగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. గతంలో తలెత్తిన ఇబ్బందులను అధిగమించేందుకు కంటివెలుగుకు ఆధార్‌కార్డుతో లింక్ చేశారు. లబ్ధిదారుల ఆధార్ కార్డు వివరాలను వైద్యసిబ్బంది నమోదు చేసుకున్న తర్వాతనే నేత్ర వైద్యపరీక్షలు చేపడుతున్నారు. దీంతో కంటివెలుగు పథకానికి ఆధార్ కార్డు తప్పనిసరి కావడంతో లబ్ధిదారులందరూ కార్డుతో శిబిరానికి హాజరవుతున్నారు.

313 మందికి కళ్లద్దాలు పంపిణీ

కరీంనగర్ మండలంలోని చామన్‌పల్లిలో ఈనెల 19 నుంచి నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామ జనాభా 3,423 ఆధారంగా 12రోజుల పాటు శిబిరం నిర్వహించి నేత్ర పరీక్షలు చేసేందుకు వైద్యసిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతిరోజూ 300 మందికి వైద్య పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ వ్యవసాయ పనులతో 100 నుంచి 150 మంది వరకు పరీక్షలు చేస్తున్నారు. ఇప్పటివరకు ఆరురోజుల్లో 770 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి 313 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌తో పాటు వైద్య సిబ్బంది ప్రతిరోజూ సాయంత్రం ఇంటింటికీ తిరిగి చీటీలు ఇచ్చి మరుసటిరోజు శిబిరానికి తరలిస్తున్నారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమున్న వారికి వెంటనే కంటి అద్దాలను పంపిణీ చేస్తున్నారు.

కంటి వెలుగు వివరాలు

తేదీ	హాజరైన రోగులు	పంపిణీ చేసిన అద్దాలు
19	138	30
20	154	41
23	132	62
24	111	71
25	106	55
27	129	54
మొత్తం	770	313

ఇప్పుడు మంచిగ కనిపిస్తోంది



కండ్లు కొంచెం మసకలున్నాయని పరీక్ష చేయించుకున్న. మిషన్‌తో పరీక్ష చేసి కంటి అద్దాలు ఇచ్చారు. అద్దాలు పెట్టుకుంటే ఇప్పుడు మంచిగ కనిపిస్తోంది. ఈ అద్దాలు మంచిగనే ఉన్నాయి.

– చామన్‌పల్లి పద్మ, వ్యవసాయ కూలీ

కొత్త అద్దాలు ఇచ్చారు



కండ్లు మంచిగా కనపడకపోతే ఎప్పటి నుంచో కంటి అద్దాలు వాడుతున్న. అద్దాలు పాతబడి చూపు మంచిగ కనపడకపోతే పరీక్ష చేయించుకుందామని వచ్చాను. కొత్త అద్దాలతో ఇప్పుడు చూపు మంచిగానే కనపడుతోంది.

– రాజమ్మ, వ్యవసాయ కూలీ

ప్రతిఒక్కరూ కంటి పరీక్ష చేయించుకోవాలి



గ్రామంలో 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ కంటి పరీక్ష చేయించుకోవాలి. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి వృద్ధులు, మహిళలను వైద్య పరీక్షలకు తీసుకొస్తున్నారు.

– ఎం.అరుణ, మెడికల్ ఆఫీసర్



ఐదంచెల విధానంతో నేత్ర పరీక్షలు

- కరీంనగర్ మండలం చామన్‌పల్లిలోని కంటివెలుగు శిబిరంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఐదంచెల విధానంలో నేత్ర వైద్యపరీక్షలు చేస్తున్నారు.
- మొదటి దశలో నేత్ర పరీక్షకు వచ్చిన వారి ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ నంబర్లను ఆశా కార్యకర్త రిజిస్ట్రేషన్ చేస్తారు.
- రెండో దశలో మూడు మీటర్ల దూరంలో ఉన్న అక్షరాల చార్టును ఆశా కార్యకర్త చూపించి ప్రాథమికంగా దృష్టిలోపాన్ని పరీక్షించి రసీదులో నమోదు చేస్తారు.
- మూడో దశలో వైద్యాధికారి కంటిని పరీక్షించి సమస్యను తెలుసుకుంటారు.
- ఏ సమస్య లేకుంటే అవసరమైన చుక్కల మందు, గోళీలు ఇచ్చి ఏఎన్‌ఎం ట్యాబ్‌లో వివరాలు నమోదు చేసుకుంటుంది.
- నాలుగో దశలో కంటి సమస్యలున్న వారిని ఆటో రిఫ్రాక్టర్(ఏఆర్) మిషన్ ద్వారా నేత్ర వైద్య సహాయకులు పరీక్షిస్తారు.
- దృష్టిలోపాన్ని నిర్ధారించి అద్దాలు అవసరమని సిఫారసు చేస్తారు.
- ఐదో దశలో నేత్ర వైద్య సహాయకుడు సిఫారసు చేసిన కంటి అద్దాలను అందించి లబ్ధిదారుల ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

సర్టిఫికెట్లు పంపిణీ



సర్టిఫికెట్లు అందజేస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

కరీంనగర్: నగరంలోని చైతన్యపురిలో ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కంప్యూటర్, బ్యూటీషియన్, కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 145 మంది మహిళలకు అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ శుక్రవారం కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. స్త్రీశక్తి చాలా గొప్పదని, స్త్రీ సంపాదించే డబ్బు కుటుంబానికి ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతీ పనిలో మీకు మెళకువ అవసరమని, కష్టపడితే ఫలితం ఉంటుందని తెలిపారు. మహిళలు విద్యలో అభివృద్ధి చెందినప్పుడే మార్పు సాధ్యపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఎ.రాజా, మదర్ అన్సిస్, ప్రీతి, దీప్తి, బేస్సీ, కార్పొరేటర్ బండారి సుమరమణారెడ్డి, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, రూప, స్రవంతి, పద్మజ, సరిత,మౌనిక, అరుణ, మహిళలు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని 38వ డివిజన్ విద్యానగర్ నవీన కుర్మవాడలో నిర్మించిన బాలభక్తాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ కరపత్రాన్ని శుక్రవారం ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. జ్యోతిష్య, వాస్తు, ఆగమ శాస్త్ర పండితుడు నమిలికొండ రమణాచార్యుల ఆధ్వర్యంలో ఈనెల 30, 31, ఫిబ్రవరి 1 తేదీ ల్లో ఉదయం, సాయంత్రం ప్రతిష్ఠా కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కచ్చు రవి, దానె అశోక్, యముండ్ల రవికుమార్, మేకల నర్సయ్య, కర్రె అనిల్, శ్రీనివాస్, ఒట్టె రాజు, యముండ్ల ఐలయ్య, గోస్కుల సంతోశ్ పాల్గొన్నారు.

కత్తితో పొడుసుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కరీంనగర్ క్రైం: కుటుంబకలహాల కారణంగా ఓ కార్మికుడు శుక్రవారం కత్తితో తన కడుపులో పొడుచుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ విద్యానగర్‌కు చెందిన చంచు రాకేశ్(28) సెంట్రింగ్ పనిచేసుకుంటూ కుటుంబంతో సహా జీవిస్తున్నారు. కొంత కాలంగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం సైతం భార్యభర్తలకు మధ్య గొడవ జరిగింది. ఇంట్లో నుంచి బయటకు వచ్చి రాకేశ్ తన వెంట తెచ్చుకున్న కత్తితో కడుపులో పొడుచుకున్నాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న 108 సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

భూ సేకరణకు సహకరించండి



రైతులతో సమావేశమైన ఆర్డీవో ఆనంద్‌కుమార్

కొత్తపల్లి: పద్మనగర్–ఎలగందుల రహదారి విస్తరణలో భాగంగా చేపట్టే భూ సేకరణకు రైతులు సహకరించాలని కరీంనగర్ ఆర్డీవో ఆనంద్‌కుమార్ కోరారు. కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ మొగిలి మంజుల సమ్మయ్య అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆర్డీఓ మాట్లాడుతూ నాలుగేళ్ల కిందట సర్వే చేసి నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. నోటిఫికేషన్ ప్రకారం భూ సేకరణ చేపట్టామని, అత్యధిక మార్కెట్ విలువ ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపారు. సుమారు 25 మంది రైతులకు సంబంధించిన 1.16 గుంటల భూమిని సేకరించి రహదారి విస్తరణ చేపడుతున్నట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి అభ్యంతరాలున్నా కలెక్టర్‌కు నివేదించుకోవచ్చునన్నారు. 4, 5 రోజుల్లో పూర్తిస్థాయి సర్వే చేపట్టి భూ సేకరణ చేపడతామని వెల్లడించారు. కాగా రైతులంతా భూమిని ఇచ్చేందుకు ఒప్పుకున్నప్పటికీ.. 66 ఫీట్లున్న రోడ్డును ప్రస్తుతం 100 ఫీట్లకు మార్చడం వల్ల కొంత భూమిని నష్టపోతున్నామని, అదేవిధంగా రహదారి ఎత్తులో నిర్మిస్తుండటం వల్ల తమ భూములకు నష్టం వాటిల్లనుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. తహసీల్దార్ గందె లక్ష్మీనరసింహారావు, ఆర్ఐ నర్సయ్య, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అలరించిన ఉర్దూ కవి సమ్మేళనం



గానం చేస్తున్న కవి

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని ఎస్ఎస్ గార్డెన్‌లో గురువారం అర్ధరాత్రి జరిగిన అల్ ఇండియా ఉర్దూ కవి సమ్మేళనంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కవులు తమ కవితాగానంతో అలరించారు. జోహార్ ఖనపూరి(లాక్నో), ముంతాజ్ నసీమ్ (ఢిల్లీ), హాసిం ఫెరోజాబది (ఢిల్లీ), అబ్రార్ కాశిఫ్ (నాందేడ్), వహీద్ పాషా కద్రి(హైదరాబాద్), సాబీర్ కాగజనగరి (కాగజ్‌నగర్), టిఫికల్ (జగిత్యాల), సలీం అంజాద్, మాసూద్ అలీ అక్బర్ (కరీంనగర్)లు ఉర్దూ కవితలు వినిపించారు. మంత్రి గంగుల కమలాకర్, నగర మేయర్ సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు హరిశంకర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ షేక్ యూసుఫ్, సులేమాన్ తవ్వకలి, మీరు శోకతలి, మహమ్మద్ ఆసిఫ్, ఎంఏ కరీం, ఉలాస్ అహ్మద్, వాజిద్, అబ్దుల్ గఫార్, మీరోజుద్దీన్, టాబ్రీజ్ ఖనా, మొహమ్మద్ సలీం, పిస్తా, అహ్మద్ ఫారుఫీ తదితరులు పాల్గొన్నారు.

‘దేశంలో ముస్లింలకు రక్షణ లేదు’

విద్యానగర్(కరీంనగర్): దేశంలో దళితులకు, ముస్లింలకు రక్షణ లేకుండా పోయిందని ఎంఐఎం కరీంనగర్ నగర అధ్యక్షుడు సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా శుక్రవారం నగరంలోని ఇస్లామియా మదర్సా ఫైజే అబ్రార్‌లో ‘గణతంత్రం పౌరులకు కల్పించిన హక్కులు’ అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ వాక్కు పఠించే ముస్లిం విద్యార్థులను, ఇస్లామిక్ మదర్సాలపై దేశ వ్యతిరేక ముద్ర వేస్తూ అలజడి సృష్టిస్తున్నదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, మదర్సా ఫైజే అబ్రార్ ప్రిన్సిపాల్ హఫీజ్ సయ్యద్ రిజ్వాన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘అంబేడ్కర్ పేరు పెట్టి కేసీఆర్ పుట్టినరోజున ప్రారంభమా..?’

కరీంనగర్‌టౌన్: రాష్ట్రంలో నూతనంగా నిర్మించిన సచివాలయానికి బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టి సీఎం కేసీఆర్ పుట్టిన రోజు ఫిబ్రవరి 17న ప్రారంభిస్తామని ప్రకటించడాన్ని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. శుక్రవారం రేకుర్తిలో విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగంపై చిత్తశుద్ధి లేని, రాజ్యాంగాన్ని గౌరవించలేని కేసీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టిన సచివాలయాన్ని ఏ విధంగా ఫిబ్రవరి 17న ప్రారంభిస్తారని ప్రశ్నించారు. అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14న ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సత్యనారాయణరెడ్డి, లక్ష్మీరాజం, గోదారి నరేశ్, తిరుమలరెడ్డి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.





ముగిసిన మార్వాడీ మందిర్ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని మార్వాడీ మందిర్ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిసాయి. రాజస్థానీ సేవా సమాజ్, మార్వాడీ మందిర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన రామ, శివ, హనుమాన్ ఆలయాల ప్రతిష్ఠలో భాగంగా రాజస్థాన్–జాలరియా పీఠాధిపతి ఘనశ్యామాచార్య స్వామిజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం, మధ్యాహ్నం యంత్ర, విగ్రహ, మందిర ప్రతిష్ఠలు, సాయంత్రం స్వామిజీ పాదపూజ, హారతి నిర్వహించారు. మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు హాజరయ్యారు. వారిని ఆలయ కమిటీ శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి రూప25 లక్షల నిధులు కేటాయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు హరిశంకర్, ఆలయ కమిటీ బాధ్యులు చాంద్మాల్ ముందడా, లక్ష్మీనారాయణధోడియా, వేణుగోపాలా కార్వా, కమల్ కిషోర్ సోనీ, లడ్డు ముందడా, మహేశ్ జోడియా, సరళాముందడా, ఊర్మిళాసోని, శశిసాల్లా, తారాథోడియాతో తదితరులు పాల్గొన్నారు.



మంత్రి గంగుల కమలాకర్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

అలరించిన స్వాగతోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

శాతవాహనయూనివర్సిటీ: నగరంలోని మంకమ్మతోటలో గల శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాల స్వాగతోత్సవ వేడుకలు శుక్రవారం చింతకుంటలోని ఎస్‌వీఆర్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మార్కెట్‌కు అనుగుణంగా కోర్సులు చేస్తూ తొందరగా ఉద్యోగాలు సాధించాలని, నైపుణ్యాలు పెంచుకుంటూ భవిష్యత్తు బంగారం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్ మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన పరీక్షల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చి వివిధ విభాగాల్లో మొదటి ర్యాంకులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారులు సుమన్, శ్రీనిధి తమ పాటలతో అలరించారు. అనంతరం విద్యార్థులు డ్యాన్సులు, సెల్ఫీలతో హోరెత్తించారు.

జమున మృతికి సంతాపం

కరీంనగర్ కల్చరల్: ప్రముఖ సినీ నటి జమున మృతికి కరీంనగర్‌లోని విశ్రాంత భౌతిక శాస్త్ర అధ్యాపకులు ఎల్లాల లక్ష్మారెడ్డి, జాతీయ యువజన పురస్కార గ్రహీత కిరణ్‌కుమార్, ప్రముఖ కవి సంకేపల్లి నాగేంద్ర శర్మ, సంతాపం ప్రకటించారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: 33 కేవీ నూతన విద్యుత్ లైన్ల పనులు కొనసాగుతున్నందున కరీంనగర్‌లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 11 కేవీ ఇండస్ట్రియల్/పద్మనగర్ ఫీడర్ పరిధిలోని పద్మనగర్, ఫ్రాస్టాప్, ఇండస్ట్రియల్, ప్రగతినగర్, సాయిబాబా ఆలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. అదేవిధంగా 11కేవీ రాంనగర్ ఫీడర్ పరిధిలోని పద్మనగర్, పరమేశ్వర రైస్‌మిల్, శ్రీహరినగర్, సంతోశ్‌నగర్, సత్యనారాయణ ఆలయం, సిద్ధార్థ స్కూల్, వాసర ఆసుపత్రి, పారమిత స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా...



ఠాణాలో మాజీ కలెక్టర్ ఆకునూరి మురళి

పోలీస్‌స్టేషన్‌లో మాజీ కలెక్టర్ మురళి

- రోడ్డుపై వాహనదారుడిని చితకబాదిన ఎస్‌ఐ
- అడ్డుకున్న మాజీ కలెక్టర్, ఠాణాలో ఎస్సైపై ఫిర్యాదు

భూపాలపల్లి: ఆయన జిల్లా మాజీ కలెక్టర్. రహదారిపై ఓ వాహనదారుడికి జరుగుతున్న అన్యాయాన్ని చూసి అడ్డుకున్నారు. ప్రత్యక్ష సాక్షిగా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాధితుడితో కలిసి ఫిర్యాదు అందించారు. ఈ ఘటన పూర్వాపరాలిలా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లాకేంద్రానికి చెందిన కూనారపు భిక్షపతి శుక్రవారం సాయంత్రం పట్టణంలో బైక్‌పై వెళ్తుండగా స్థానిక ఎస్సై రామకృష్ణ అతని వాహనాన్ని ఆపారు. రాంగ్‌రూట్‌లో ఎందుకు వచ్చావంటూ దురుసుగా వ్యవహరిస్తూ, లాఠీతో చితకబాదుతుండగా అదే సమయంలో అటుగా వెళ్తున్న మాజీ కలెక్టర్ ఆకునూరి మురళి ఈ ఘటనను చూసి ఆగారు. ఎస్సై దాడిని ఆపి, 'మనం ఏ రాష్ట్రంలో ఉన్నాం.. అతడిని ఎందుకు కొడుతున్నావు' అని ప్రశ్నించారు. అనంతరం బాధితుడు భిక్షపతిని వెంట తీసుకొని భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐపై ఫిర్యాదు చేయించారు. తానే ప్రత్యక్ష సాక్షినని సంతకం చేసి ఆ ఫిర్యాదును అందజేశారు. డీఎస్పీ రాములు, సీఐ రాజిరెడ్డితో మాట్లాడి ఎస్సై రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని మురళి డిమాండ్ చేశారు.

కేలండర్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో 'తెలంగాణా నాన్ గెజిటెడ్ యూనిట్' కేలండర్‌ను ఆ శాఖ సంచాలకుడు బి.రాజమౌళి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సమాచార శాఖ అదనపు సంచాలకులు నాగయ్య కాంబ్లీ, కిశోర్ బాబు హాజరయ్యారు.



హక్కుల రక్షణకు రచయిత కాపలాదారు కావాలి

- కవులు, రచయితలు, మేధావులను హతమార్చడం పిరికిపందల చర్య
- రాజ్యాంగంపై పూర్తి నమ్మకం ఉంది..
- కొంకణి భాషకు అధికారహోదా కోసం సుదీర్ఘ ఉద్యమం
- పోర్చుగీసువారి రాకతోనే దాడి మొదలైంది
- ప్రముఖ కొంకణి రచయిత దామోదర్ మౌజో
- ప్రారంభమైన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్
- ఆదివారం వరకు వేడుకలు..



మాట్లాడుతున్న రచయిత దామోదర్ మౌజో

సాక్షి, సిటీబ్యూరో: ప్రాథమిక హక్కుల రక్షణ, రాజ్యాంగ పరిరక్షణకు రచయితలు, కవులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు కాపలాదారుగా వ్యవహరించాలని ప్రముఖ కొంకణి రచయిత, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత దామోదర్ మౌజో అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల కోసం సాహిత్య సృజన చేసే కవులు, రచయితలను హతమార్చడం పిరికిపందల చర్య అన్నారు. సత్యాన్ని ఎదుర్కోలేకనే కల్‌బుర్గి, దభోల్కర్, గౌరీలంకేష్ వంటి మేధావులను, రచయితలను హత్య చేశారని ఆరోపించారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ శుక్రవారం విద్యారణ్య స్కూల్‌లో ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ వేడుకల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కీలకోపన్యాసం చేశారు. ఇందిరాగాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కవులు, రచయితలు ప్రజలను చైతన్యం చేశారన్నారు. తనకు రాజ్యాంగం పట్ల పూర్తి నమ్మకం ఉందన్నారు. జీవించే హక్కుతో సహా ప్రాథమిక హక్కులకు రక్షణ లేకపోవడం దారుణమన్నారు. మనుషులు ఏం తినాలో, ఏం తినకూడదో కూడా వాళ్లే నిర్ణయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఢిల్లీ జేఎన్‌యూ క్యాంటీన్‌లో మాంసాహారం వండకూడదని ఒక విద్యార్థి సంఘం హెచ్చరించడం దారుణమన్నారు. ఇలాంటి అప్రజాస్వామిక ధోరణుల ను నిరసించాలన్నారు. అలాగే హక్కులను కాపాడుకోవాలని చెప్పారు. రచయితగా తాను సైతం తీవ్రమైన హెచ్చరికలు, ఒత్తిళ్లను ఎదుర్కొన్నట్లు చెప్పారు.

కొంకణి భాష కోసం సుదీర్ఘమైన ఉద్యమం...

గోవా ప్రజలు తమ అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు పెద్ద ఉద్యమమే చేయాల్సి వచ్చిందన్నారు. మౌర్యుల కాలం నుంచి ఒక ఉనికిని కలిగి ఉన్న కొంకణి ప్రాంతం పోర్చుగీసు వారి రాకతో విచ్ఛిన్నమైందన్నారు. మతమార్పిడులు, సాహిత్య, సాంస్కృతిక మార్పిడులు తమ ఉనికిని ప్రమాదంలోకి నెట్టాయన్నారు. కొంకణిభాషకు లిపి లేకుండా పోయిందన్నారు. పోర్చుగీసు దాడుల నేపథ్యంలో ప్రజలు పెద్ద సంఖ్యలో వలసి వెళ్లారని చెప్పారు. ఈ క్రమంలో కొంకణి మాతృభాషగా కలిగిన వారు ఆయా రాష్ట్రాల్లోని భాషల లిపినే కొంకణి లిపిగా మార్చుకున్నారన్నారు. గోవా స్వతంత్ర రాష్ట్రంగా అవతరించిన తర్వాత దేవనాగరి భాషను కొంకణి అధికార భాషగా గుర్తించేందుకు తాము సుదీర్ఘ ఉద్యమం చేపట్టినట్లు గుర్తు చేశారు. గోవాలోని మారుమూల పల్లెటూరుకు చెందిన తాను ప్రజల జీవితాలను, కష్టాలను, బాధలను దగ్గర నుంచి చూడడం వల్ల ప్రజల గాథలనే ఇతివృత్తంగా ఎంచుకుని రచనావ్యాసంగం కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

వేడుకలు వైవిధ్యం...

హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్ అధ్యక్షత వహించారు. జర్మనీ రాయబార కార్యాలయం ప్రతినిధి స్టీఫెన్ గ్రాబర్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ డైరెక్టర్‌లు అమితాదేశాయ్, ప్రొఫెసర్ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభిన్న భాషల సాహిత్యాన్ని ఒక వేదికకు తేవడం గొప్ప కార్యక్రమమని వక్తలు కొనియాడారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ఒక వైవిధ్యభరితమైన వేడుక అని స్టీఫెన్ చెప్పారు. జర్మనీ భాషా సాహిత్యాలను, కళలను ఈ వేదికపైన ప్రదర్శించే చక్కటి అవకాశం లభించిందన్నారు.

తారకరత్నకు గుండెపోటు

- లోకేశ్ పాదయాత్రలో ఆదిలోనే అపశ్రుతి
- నడక ప్రారంభించిన పది నిమిషాల్లోనే కుప్పకూలిన వైనం
- అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లిన కార్యకర్తలు
- తారకరత్న వెంట వెళ్లకుండా పాదయాత్ర కొనసాగించిన లోకేశ్
- యాత్ర కొనసాగింపుపై టీడీపీ నేతల విస్మయం

కుప్పం/కుప్పం రూరల్ (చిత్తూరు జిల్లా) : టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ ప్రారంభించిన పాదయాత్రలో ఆదిలోనే అపశ్రుతి చోటుచేసుకుంది. లోకేశ్‌తో పాటు పాదయాత్రలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీరామారావు మనుమడు తారకరత్న గుండెపోటుతో కుప్పకూలిపోయారు. ఆయన ఎన్టీఆర్ కుమారుడు నందమూరి మోహనకృష్ణ కుమారుడు. శుక్రవారం ఉదయం 11.10 గంటలకు కుప్పం మండలం లక్ష్మీపురం గ్రామంలోని శ్రీ వరదరాజస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, లోకేశ్ పాదయాత్ర ప్రారంభించారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, నందమూరి తారకరత్న, టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తదితరులు ఉన్నారు. అక్కడి నుంచి అర కిలోమీటరు దూరంలో బాబునగర్ వద్ద ఉన్న మసీదుకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 12 గంటల సమయంలో మసీదు నుంచి బయటకు వచ్చిన తర్వాత కార్యకర్తలు తోసుకొని మీద పడటంతో తారకరత్న అస్వస్థతకు గురయ్యారు. నిలదొక్కుకోలేక సొమ్మసిల్లి కింద పడిపోవటంతో కార్యకర్తలు హుటాహుటిన పట్టణంలోని కేసీ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అంబులెన్స్‌లో పీఈఎస్ మెడికల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు తారకరత్నను క్రిటికల్ కేర్ యూనిట్‌లో ఉంచి చికిత్స ప్రారంభించారు. నందమూరి బాలకృష్ణ ఆస్పత్రికి చేరుకుని వైద్యులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ, రక్తనాళాలు 90 శాతం మూసుకుపోవటంతో తారకరత్న స్పృహ కోల్పోయాడన్నారు. ప్రాణాపాయం లేదని, అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. తారకరత్నను ఆస్పత్రికి తరలించగానే మరోవైపు లోకేశ్ తన పాదయాత్రను కొనసాగించారు. తారకరత్న వెంట వెళ్లకుండా లోకేశ్ పాదయాత్ర కొనసాగించడంపై పార్టీలోని పలువురు నేతలు విస్మయం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుడు, బావ అయిన ఆయన పరిస్థితి సీరియస్‌గా ఉందని తెలిసినా, లోకేశ్ రాజకీయాలకే ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని, ప్రజల్లోకి వేరే సంకేతాలు వెళతాయని వారు చర్చించుకున్నారు. ఇదిలా ఉండగా, తారకరత్నకు చికిత్స అందిస్తున్న ఆస్పత్రి సిబ్బంది ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని, వారినెవరినీ బయటకు పంపడం లేదని.. బయటి నుంచి కూడా ఎవరినీ ఆస్పత్రి లోపలకు అనుమతించడం లేదని సిబ్బంది కుటుంబీకులు వాపోతున్నారు. అసలు ఆస్పత్రిలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదని టీడీపీ శ్రేణులే గుసగుసలు పోతుండటం గమనార్హం.

బెంగళూరు తరలింపునకు ఏర్పాట్లు.. అంతలోనే నిర్ణయం మార్పు

ఆస్పత్రిలో తారకరత్నకు వైద్యం అందించిన వైద్యులు.. బెంగళూరుకు సిఫార్సు చేశారు. ఈ విషయాన్ని టీడీపీ శ్రేణులు జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, గ్రీన్ చానల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆస్పత్రి మెడికల్ రిపోర్ట్ సమర్పిస్తే తప్పకుండా సహకరిస్తామని ఎస్పీ వారికి తెలిపారు. అంతలో తొలి రోజు పాదయాత్ర ముగించుకున్న లోకేశ్ ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. మామ బాలకృష్ణతో మాట్లాడారు. ఆ తర్వాత తారకరత్నను బెంగళూరుకు తరలించడం లేదని, బెంగళూరు నారాయణ హృదయాలయ ఆస్పత్రి నుంచి వచ్చిన వైద్యులు ఇక్కడే చికిత్స అందిస్తారని పార్టీ శ్రేణులకు వారు సమాచారం ఇచ్చారు. లోకేశ్ వెళ్లగానే నిర్ణయం మారిపోవడంతో టీడీపీ కార్యకర్తలు ఆశ్చర్యపోయారు. బెంగళూరుకు తీసుకెళ్లుంటే మరింత మెరుగైన వైద్యం అందుబాటులో ఉండేదని, ఇలా ఎందుకు చేశారో అర్థం కావడం లేదని చర్చించుకున్నారు. ఇదిలా ఉండగా రాత్రి 9.30 గంటలకు తారకరత్న భార్య అలేఖ్య రెడ్డి, కుమార్తె నిషిక(9) పీఈఎస్ ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. వీరితో పాటు తారకరత్న బావమరిదితో బాలకృష్ణ, లోకేశ్, మరికొందరు మాట్లాడాకే.. తారకరత్నకు ఇక్కడే వైద్యం అందిస్తున్నట్లు ప్రకటించారు. తారకరత్న కుటుంబ సభ్యుల అంగీకారంతోనే ఇక్కడే వైద్యం కొనసాగిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అయితే నాటకీయపరిణామాల మధ్య అర్ధరాత్రి సమయంలో తారకరత్నను మెరుగైన చికిత్స కోసం ప్రత్యేక అంబులెన్స్‌లో బెంగళూరు తరలించారు.

సింగరేణిలో 'ఫ్లోటింగ్ సోలార్' వెలుగులు

- ఎస్టీపీపీలో నేడు 5 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం
- జైపూర్ విద్యుత్ కేంద్రానికి అనుసంధానం



రిజర్వాయర్ నీటిపై తేలియాడే సోలార్ పవర్ ప్లాంటు

జైపూర్ (చెన్నూర్): మంచిర్యాల జిల్లా జైపూర్‌లో సింగరేణి సంస్థ నిర్మిస్తున్న అత్యాధునిక ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ ఉత్పత్తికి సిద్ధమైంది. సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్ (ఎస్టీపీపీ)కి నీరందించే రెండు రిజర్వాయర్ల నీటిపై తేలియాడే సోలార్ విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 700 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతున్న సింగరేణి సంస్థ ఏరియాల వారీగా ఇప్పటికే భూమిపై 219 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తోంది. కాగా, ఎస్టీపీపీలోని రెండు రిజర్వాయర్లపై రెండు విభాగాలుగా 15 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. తొలి విడతలో 5 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియకు శనివారం శ్రీకారం చుట్టనున్నారు. జైపూర్ విద్యుత్ కేంద్రానికి దీనిని అనుసంధానం చేస్తారు. వంద ఎకరాల్లోని రిజర్వాయర్–1, 2లపై రూ.78 కోట్లతో సోలార్ పవర్‌ప్లాంట్లు నిర్మించారు. ఒక రిజర్వాయర్‌పై ఐదు మెగావాట్లు, మరో రిజర్వాయర్‌పై 10 మెగావాట్ల ప్లాంట్లు ఉన్నాయి. సింగరేణి సంస్థ ఏడాదికి రూ.500 కోట్ల వరకు విద్యుత్ కోసం ఖర్చు చేస్తుండగా, సోలార్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను స్థానిక అవసరాలకు వినియోగించుకోనుంది. ఫలితంగా రూ.200 కోట్లకుపైగా సంస్థకు ఆదా కానుంది. భూమిపై నిర్మించిన సోలార్ పలకలన్నా నీటిపై నిర్మించే ఫ్లోటింగ్ సోలార్ ఫలకల జీవితకాలం ఎక్కువ అని చెపుతున్నారు. కాగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోజుకు 25 వేల యూనిట్ల విద్యుత్ చొప్పున ఏడాదికి 20 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేయనున్నారు.

సరస్వతీ అమ్మవారికి లక్ష్మీకటాక్షం

- ఒక్కరోజే రూ.71.91 లక్షల ఆదాయం
- వసంత పంచమి సందర్భంగా రికార్డుస్థాయిలో అక్షరాభ్యాసాలు

వసంత పంచమి ఆదాయం ఇలా..

సేవలు	ఆదాయం
ప్రత్యేక అక్షరాభ్యాసం	రూ.40,89,690
అక్షరాభ్యాసం	రూ.4,19,550
ప్రత్యేక దర్శనం	రూ.4,76,300
మండప ప్రవేశం	రూ.1,05,000
వసతి అద్దె	రూ.29,780
శాశ్వత పూజలు	రూ.11,976
లడ్డూ, పులిహోర	రూ.16,65,680
అమ్మవారి రాగి నాణేలు	రూ.69,550
అమ్మవారి క్యాలెండర్	రూ.14,850
అన్నదాన విరాళాలు	రూ.1,08,325
ఆన్‌లైన్ విక్రయాలు	రూ.2,01,030
మొత్తం ఆదాయం	రూ.71,91,731



చిన్నారులు, భక్తులతో కిక్కిరిసిన సామూహిక అక్షరాభ్యాస మండపం(ఫైల్)

భైంసా: నిర్మల్ జిల్లా బాసరలోని జ్ఞాన సరస్వతీ అమ్మవారికి వసంతపంచమి సందర్భంగా గురువారం ఒక్కరోజే భారీ ఆదాయం సమకూరింది. దివ్య ముహూర్తాన 6,928 అక్షరాభ్యాసాలు జరిగాయి. ఒక్కరోజే రూ.71.91లక్షల ఆదాయం సమకూరింది. గతేడాది వసంత పంచమి సందర్భంగా అమ్మవారికి రూ.46.83లక్షల ఆదాయం వచ్చింది. గతేడాదికంటే అదనంగా రూ.25.09లక్షలు సమకూరింది. అధికసంఖ్యలో బాసరకు వచ్చిన భక్తులు అమ్మవారికి కానుకలు సమర్పించారు. వేకువజాము నుంచి రాత్రి వరకు అక్షరాభ్యాస మండపాల్లో రద్దీ కనిపించింది. గంటల తరబడి నిరీక్షించి చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయించారు. వసతిగృహాలు, ప్రసాదాలు ఇతర మార్గాల్లో ఆదాయం సమకూరింది.

ముగిసిన కొనుగోళ్లు.. మూతపడ్డ 304 కేంద్రాలు

- పెద్దపల్లి జిల్లాలో 2.98లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరణ
- రైతుల ఖాతాలకు చేరిన సొమ్ము

పెద్దపల్లిరూరల్: జిల్లాలో వానాకాలం సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం సేకరణ ప్రక్రియ ముగిసింది. జిల్లాలోని 51,611 మంది రైతుల నుంచి 2,98,067 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 2,14,185 ఎకరాల్లో వరిపంట సాగు చేసిన రైతాంగం దాదాపు 4లక్షల మెట్రిక్‌టన్నుల మేర దిగుబడి సాధిస్తుందనే అంచనాను అధికారులు వేసారు. కొంతమేర దిగుబడులు తగ్గగా...జిల్లాలోని కొన్ని మండలాల్లో సన్నరకం వరి పంట సాగు చేసిన రైతులు తమ దిగుబడులను నేరుగా మిల్లర్లకు అమ్మడం కూడా మరో కారణంగా తెలుస్తోంది.

మూతపడ్డ 304 కేంద్రాలు

జిల్లాలోని 14మండలాలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన 304 కేంద్రాల ద్వారా 2,98,067 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. ఆ ధాన్యాన్ని 196 మిల్లులకు తరలించిన పౌరసరఫరాల శాఖ అధికారులు ఐకేపీ, సహకారశాఖ, డీసీఎంఎస్, మార్కెటింగ్‌శాఖల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మూసివేశారు.

రైతుఖాతాలకు సొమ్ము

పండించి ధాన్యం రాశులను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకున్న అన్నదాతల వివరాలను ఎప్పటికప్పుడే ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో చెల్లింపులు కూడా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా రూ.612.89కోట్ల విలువగల 2,98,067 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిన అధికారులు ఇప్పటివరకు రూ. 2,89,261 మెట్రిక్‌టన్నుల ధాన్యానికి రూ.594.87కోట్లను రైతుల ఖాతాకు జమచేసినట్లు అధికారులు పేర్కొన్నారు.



మిల్లులో ధాన్యం బస్తాలు

సాఫీగా ముగిసిన కొనుగోళ్లు



జిల్లాలో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లు సాఫీగా ముగిశాయి. కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడే కేటాయించిన మిల్లులకు తరలించాం. చెల్లింపులు కూడా 97శాతం మేర జరిగాయి. చిన్నచిన్న తప్పిదాల కారణంగా ఆగిన రైతులకు కూడా వీలైనంత త్వరలో చెల్లిస్తాం. కొనుగోళ్ల ప్రక్రియ పూర్తవడంతో కేంద్రాలను మూసివేశాం.

– తోట వెంకటేశ్, ఇన్‌చార్జి సివిల్‌సప్లయి డీఎం

పోలీసు బైకే చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో చోరీలకు పా ల్పడుతున్న దొంగలు ఓ అడుగు ముందుకేసి ఏకంగా పోలీసు బైక్‌పైనే కన్నేశారు. వాటిపై పోలీసు అనే స్టిక్కర్ ఉన్నా వదిలిపెట్టకుండా ఎ త్తుకెళ్లారు. జిల్లా కేంద్రంలోని క్రాంతినగర్‌కు చెందిన జాఫరొద్దీన్ ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 25న వేకువజామున 4.30 గంటల సమయంలో బస్టాండ్‌లో వాహనం పార్క్ చేసిన విధుల్లో భాగంగా హైదరాబాద్ వె ళ్లాడు. అదేరోజు రాత్రి 12గంటలకు తిరిగి రా గా బస్టాండ్ వద్ద బైక్ కనిపించకపోవడంతో అ వాక్కయ్యాడు. దీంతో ఆయన టూటౌన్‌లో ఫి ర్యాదు చేశాడు. ఎస్సై విష్ణు ప్రకాష్ కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇటీవల రిమ్స్, బస్టాండ్ ప్రాంతాల్లో పార్కింగ్ చేస్తున్న వాహనాలను దొంగలు అపహరిస్తున్నారు.

చిక్కుడు పందిరి



ఇంటి ముందు అల్లుకున్న చిక్కుడు తీగ

నెన్నెల: మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం బొప్పారంలో ఓ రైతు ఇంటి ముందు చిక్కుడు పందిరి ఆకట్టుకుంటోంది. పందిరి చుట్టూ చిక్కుడు విత్తనాలు నాటగా.. పెరిగి ఇంటిముందు పందిరిపై తీగంతా విస్తరించింది. చిక్కుడు కాయలతోపాటు ఎండ నుంచి రక్షణ కల్పిస్తోంది. రహదారి వెంట వెళ్లే వారంతా ఆలోచన అదిరింది అంటున్నారు.

జనసంద్రంగా నాగోబా



నాగోబా ఆలయంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో నాగోబా జాతర భక్తజన సంద్రంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా, ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చి ఆలయంలో పూజలు నిర్వహించారు. రాష్ట్ర గిరిజన సహకార ఆర్థికాభివృద్ధి సంస్థ(ట్రైకార్), జీసీసీ చైర్మన్లు ఇస్లావత్ రాంచందర్‌నాయక్, రమావత్ వాలియనాయక్ శుక్రవారం పూజలు చేశారు. ఆలయ నిర్మాణం, చరిత్ర, జాతర నిర్వహణ వివరాలను మెస్రం వంశీయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరంవారిని సన్మానించారు. జాతర నిర్వహణలో భాగంగా ఐటీడీఏ అధికారులతో మాట్లాడి ట్రాక్టర్ మంజూరుతోపాటు శాశ్వతంగా టెట్ సామగ్రి అందిస్తామన్నారు. జాతర శనివారం అధికారికంగా, ఇంకో రెండు రోజులపాటు కొనసాగుతుందని ఈవో రాజమౌళి తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్, ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ లక్కేరావ్, గిరిజన సహకార ఆర్థికాభివృద్ధి సంస్థ జీఎం శంకర్‌రావ్, జీసీసీ డీఎం సీతారాంనాయక్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం ఉన్నారు.



పూజల్లో రాంచందర్‌నాయక్, వాలియనాయక్



సన్మానిస్తున్న మెస్రం వంశీయులు

అభివృద్ధి పనులపై మంత్రి పీఎస్ సమీక్ష

పెండింగ్ బిల్లులు ఇప్పించాలని సర్పంచ్‌ల వినతి

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలంలో అభివృద్ధి పనులపై మంత్రి కేటీఆర్ పీఎస్ శ్రీనివాస్ ప్రజాప్రతినిధులతో శుక్రవారం సమీక్షించారు. ఎంపీపీ శరత్‌రావు కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలతో మాట్లాడారు. ఇప్పటి వరకు మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరో ఏడాదిలో తమ పాలన ముగుస్తుందని.. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని సర్పంచులు కోరారు. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేశామని, మరో ఆరు నెలల్లో చెక్‌పవర్ కూడా పోతుందని వాపోయారు. పెండింగ్ పనులపై పీఎస్ ఆరా తీశారు. మంత్రి కేటీఆర్ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారని.. పనులను మధ్యలో నిలిపివేయడం సరికాదన్నారు. ముఖ్యంగా ఈజీఎస్‌లో పెండింగ్ బిల్లులు వచ్చేలా చూడాలని పీఎస్‌ను కోరినట్లు సర్పంచులు తెలిపారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, తహసీల్దార్ మునీందర్, ఎంపీడీవో రమాదేవి, మంత్రి కేటీఆర్ పీఏ గణరాజు, నాయకులు విజయరామారావు, సురేందర్‌రావు, సర్వర్ పాల్గొన్నారు.



ఏఈతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్ పీఎస్ శ్రీనివాస్



నివాళి

జమున
(1936 - 2023)

అలిగితివా సత్యభామ



తెలుగు అలక నీవే.. తెలుగు మొలక నీవే
వాల్జడను విసిరి వలపు చూపును దూసేది నీవే
అతిశయము నీవే.. స్వాతిశయము నీవే
కనుచూపులో ధిక్కరింపు దుడుకువు నీవే
నీవు సత్యభామవు.. నీవే సతీ అనసూయవు
నీవే రాణి మాలినీదేవివి.. నీవే కలెక్టర్ జానకివి.
పాతికేళ్లపాటు తెలుగు తెరను ఏలావు.
నీ మార్గము నీదయ్యి నీ దుర్గము నీకు నిలిచింది.

ప్రజల అభిమానమే నీకు పద్మభూషణ్.
ప్రేక్షకుల ఆరాధనే రఘుపతి వెంకయ్య.
నీకు అలంకారమైన అలకతో మా నుంచి
వీడ్కోలు తీసుకున్నావని సర్ది చెప్పుకుంటున్నాము.
మరోసారి దుగ్గిరాల నుంచి పద్యమై పలుకు.
మరోసారి అపర సత్యభామవై
మువ్వల సడి చెయ్యి.
అలక తీరాక తిరిగి వస్తావు కదూ!

● ఖదీర్

సత్రాజిత్తు కుమార్తె సత్యభామ.

తప్పు.

నిప్పాణి శ్రీనివాసరావు కుమార్తె సత్యభామ.

ఒప్పు.

తెలుగువారికి సంబంధించినంత వరకు సత్యభామది దుగ్గిరాల.

●●●

'అమ్మా... కాఫీ'...

బంగారు బుగ్గలతో, మెరిసే కళ్లతో, గారాబంగా పెరిగి, పెంకిగా మారి, కాలు నేలన పెట్టకుండా, నిద్ర కళ్లతో లేచి కాఫీ అడిగే గారాల పట్టి ఎవరు? ఇంకెవరు జమున. 'గుండమ్మ కథ'లో ఆ పాత్రను జమునే చేయాలి. కానీ...

●●●

'గుండమ్మ కథ' సినిమా తీయబోయే ముందు.

నిర్మాత చక్రపాణి ఇంట్లో పంచాయితీ.

ఒక గదిలో ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్. మరో గదిలో జమున, ఆమె తండ్రి నిప్పాణి శ్రీనివాసరావు.

'క్షమాపణ పత్రం రాసివ్వమనండి సరిపోతుంది... జమునతో కలిసి పని చేస్తాం' అని ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్‌ల గది నుంచి ప్రతిపాదన వచ్చింది.

'క్షమాపణ రాసేది లేదు. నా తప్పేమిటో చెప్పమనండి' జమున నుంచి జవాబు.

ఈ తగాదా తీర్చకపోతే గుండమ్మ కథ పట్టాలెక్కదు.

చక్రపాణి రెండు గదుల వైపు మార్చి మార్చి చూశాడు.

●●●

'భూకైలాస్' క్లయిమాక్స్ సీన్. మద్రాసు సముద్ర ఒడ్డున తీస్తున్నారు. ఆత్మలింగం చేజార్చుకున్న రావణుడు అంతకంతకూ పెరిగి పెద్దదవుతున్న ఆ లింగాన్ని మోయలేక, తనతో తీసుకెళ్లలేక, దానికి తల కొట్టుకుని ఆత్మత్యాగం చేయబోతున్న దృశ్యం అది. ఎన్.టి.ఆర్ మీద తీస్తున్నారు. ఆ సమయంలో నారదుడైన అక్కినేని పరిగెత్తుకొని రావాలి. మండోదరి పాత్ర పోషిస్తున్న జమున కూడా పరిగెత్తుకుని రావాలి.

ఎండ మండిపోతోంది.

అప్పటికే జమున షూటింగ్‌కి ఆలస్యంగా వస్తున్నదని అక్కినేనికి అభ్యంతరం ఉంది. కాలు మీద కాలు వేసుకుని కూచుంటున్నదని ఎన్.టి.ఆర్‌కు అసౌకర్యం ఉంది. జమునకు ఇవన్నీ తెలియవు. ఆ ఎండలో ఇంకా రాని జమున కోసం ఎదురు చూస్తూ అక్కినేని, ఎన్.టి.ఆర్ ఒక నిర్ణయం తీసుకున్నారు. మరునాడు ఇండస్ట్రీ అంతా ఆ నిర్ణయం విని హాహాకారాలు చేసింది. అచ్చొచ్చొలు విడిచింది. ఇక మీదట ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్‌లు జమునతో నటించబోవడం లేదు. బాయ్‌కాట్ ట్రెండ్ ఇటీవల మొదలైంది. కాని తెలుగులో బాయ్‌కాట్ చూసిన తొలి హీరోయిన్ జమున.

●●●

ఊ... అంటావా మావా ఉహూ అంటావా మావా. కొత్త పాట. విశేషం ఏముంది?

ఊ అను ఉఊ అను ఔనను ఔనవునను... జమున పాట. ఏనాడో జమున ఉఊ అంది. ఔనవునని అనలేకపోయింది. పెద్ద హీరోలు బాయ్‌కాట్ చేస్తే ఏంటి? తానొక నటి. తనకు సామర్థ్యం ఉంది. తను పని చేయగలదు. ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్‌లు లేకపోతే ఇక హీరోలే లేరా? అయినా తెర మీద జమున ఉంటే ఇక ఆవిడే ఒక హీరో లెక్క.

1959, 60, 61... దాదాపు మూడేళ్ల పాటు అక్కినేని, ఎన్.టి.ఆర్ జమునతో పని చేయలేదు. జమున ఆగిందా... ఆగలేదు. హిందీకి వెళ్లింది. జూబ్లీ హీరో రాజేంద్ర కుమార్‌తో 'హమ్‌రాహీ' చేసి హిట్ కొట్టింది. అందులో 'ముజ్ కో అప్ నే గలే లగాలో' పాటకు ముబారక్ బేగం, 'మన్‌రే తూహీ బతా క్యా గావూ' పాటకు లతా మంగేష్కర్ జమునకు ప్లేబ్యాక్ ఇచ్చారు. 'మూగ మనసులు' హిందీ రీమేక్ మిలన్‌లో అదే గౌరి పాత్రను వేసి ఫిల్మ్‌ఫేర్ అవార్డు సాధించింది. 'బేటి బేటె' సినిమాలో సునీల్ దత్‌కు హీరోయిన్‌గా చేసింది. తెలుగులో జగ్గయ్య, జె.వి.రమణమూర్తి, కృష్ణ, శ్రీధర్, హరనాథ్ వీరితో పని చేసింది. ఈలోపు జమున లాంటి గ్లామర్ స్టార్ లేక కొన్ని సినిమాలు ఏ.ఎన్.ఆర్, ఎన్.టి.ఆర్‌లవి వెలవెలబోయాయి. ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్‌లు లేక జమున పెద్ద సినిమాలు చేయలేకపోయింది. ఇరు పక్షాలా నష్టం. ఈ నష్టాన్ని నివారించి అందరినీ కలిపి 'గుండమ్మ కథ' తీయాలని చక్రపాణి నిశ్చయం.

●●●

'సార్. క్షమాపణలు వద్దు ఏమొద్దు. వాళ్లనూ కూచోబెట్టండి. నన్నూ కూచోబెట్టండి. కావాలంటే నన్ను నాలుగు చివాట్లు పెట్టండి. ఏదో తెలియని రోజుల్లో తెలియని ప్రవర్తన. ఇక మీదట జాగ్రత్తగా ఉంటాను' అంది జమున, చక్రపాణితో.

'ఏమయ్యా రామారావు, నాగేశ్వరరావూ. ఈ బాయ్‌కాట్ వల్ల భవిష్యత్తు తరాలకు మీరో తప్పు మార్గం చూపిస్తున్నారు. ఇలా వద్దు. అంతా కలిసి పని చేయండి. నా గుండమ్మ ఇప్పటికే ఆలస్యమై ఏడుస్తోంది' అన్నాడు చక్రపాణి.

సమస్య సద్దుమణిగింది. జమున గెలవక పోయి ఉండవచ్చు. కాని ఓడలేదు.

●●●

గుంటూరు జిల్లాలో పక్కపక్క ఊళ్ల నుంచి ఇద్దరు హీరోయిన్లు వచ్చారు. సావిత్రి, జమున.



కృష్ణా జిల్లాలో పక్క పక్క ఊళ్ల నుంచి ఇద్దరు హీరోలు వచ్చారు. అక్కినేని, ఎన్.టి.ఆర్.

ఈ నలుగురు తెలుగు సినిమాలకు 'స్వర్ణచతుష్టయం'. ఆ స్వర్ణ చతుష్టయం నటించి సూపర్‌హిట్ కొట్టిన సినిమా గుండమ్మ కథ.

●●●

జమున తండ్రి నిప్పాణి శ్రీనివాసరావు మధ్వ బ్రాహ్మణులు. కన్నడిగులు. జమున తల్లి కౌసల్యా దేవి వైశ్యులు. తెలుగు. వ్యాపారం నిమిత్తం శ్రీనివాసరావు హంపిలో ఉండగా పెద్ద కూతురుగా జమున పుట్టింది. ఆమెకు ఆరేడేళ్లు ఉండగా శ్రీనివాసరావు పసుపు, పొగాకు వ్యాపారానికి వీలుగా ఉంటుందని కాపురాన్ని 'దుగ్గిరాల'కు మార్చాడు. అలా దుగ్గిరాల జమునకు రెండో జన్మస్థలం అయ్యింది. జమున తల్లికి హరికథలు చెప్పడం వచ్చు. ఆమె కచ్చేరీల్లో మధ్య మధ్య చిన్నారి జమునను స్టేజీ ఎక్కించి పాట పాడించేది. దుగ్గిరాలలో చదువుతూ స్కూల్లో కూడా జమున ఆడేది, పాడేది. నాటకాల వాళ్లు విని బాలనటిగా బతిమిలాడి తీసుకెళ్లేవారు. 'ఢిల్లీ చలో', 'మా భూమి', 'ఖిల్జీ రాజ్య పతనం'... వీటిలో జమున బాలనటి. మండూరులో 'ఖిల్జీ రాజ్యపతనం' నాటకం వేయాలని ఒక తెలుగు మాస్టారు వచ్చి జమునను తీసుకెళ్లాడు. రైలు దిగి పొలాల మీద నడుస్తూ మండూరు చేరుకోవాల్సి ఉంటే జమున నడవలేక మారాము చేసింది. పాపం... ఆ తెలుగు మాస్టారు జమునను ఎత్తుకొని అంతదూరమూ నడిచి వెళ్లాడు. ఇది జరిగిన కొన్నాళ్లకు ఒక సినిమాలో జమున–

అనురాగము విరిసేనా ఓ రేరాజా
అనుతాపము తీరేనా...

అనే పాటకు అభినయించింది. ఆ రోజు ఆమెను భుజాల మీద ఎత్తుకుని నడిచిన తెలుగు మాస్టారు ఆ పాటలో పడక్కుర్చీలో కూచుని ఆస్వాదిస్తుంటాడు. అతని పేరు జగ్గయ్య.

●●●

గరికపాటి రాజారావు నటించి, నిర్మించి, దర్శకత్వం వహించిన 'పుట్టిల్లు' జమున మొదటి సినిమా. షావుకారు జానకి, కృష్ణకుమారి, జమున... వీరు మాత్రమే స్ట్రయిట్‌గా హీరోయిన్ వేషాలతో చిత్ర ప్రవేశం చేశారు. మిగిలిన వారు చిన్న పాత్రలు వేసి, ఎదిగి, హీరోయిన్‌లు అయ్యారు. 16 ఏళ్ల వయసులో జమున 'పుట్టిల్లు'లో చాలా మెచ్యూరిటీ ప్రదర్శించాల్సిన పాత్రను పోషించింది. కాని గరికపాటి, జమునల జంటను ప్రేక్షకులు మెచ్చలేదు. 'పతియే ప్రత్యక్షదైవమే' థీమ్‌తో సినిమాలు వస్తున్న ఆ రోజుల్లో 'పుట్టిల్లు' సినిమా వ్యసనపరుడైన భర్తను నిరాకరించి తనకు తాను నిలబడే భార్య పాత్రను చూపించేసరికి జనం హడలెత్తి తెరను చింపేస్తామన్నారు. మూడ్రోజుల్లో బాక్సులు తిరిగొచ్చేసరికి క్లయిమాక్స్ మార్చి తీసి మళ్లీ అతికించినా ఫలితం రాలేదు. ఆ తర్వాత జమున నటించిన రెండు మూడు సినిమాలు ఆడలేదు. వెనక్కు వెళ్లిపోదామనుకుంటూ ఉండగా 'మిస్సమ్మ' సినిమాలో మెరిసి నిలబడింది. ఆ సినిమా నాటికే స్టార్లుగా మారిన అక్కినేని, ఎన్.టి.ఆర్, సావిత్రిల సరసకు అతి త్వరగా చేరింది. అయితే ప్రతి నటికి ఒక సిగ్నేచర్ కేరెక్టర్ దొరకాలి. అలాంటి కేరెక్టర్ జమునకు దొరికింది. ఆ పాత్రే సత్యభామ.

●●●

సత్యభామ పాత్రంటే తెలుగు నాటకాల్లో పాపులర్. స్థానం నరసింహారావు ఆ పాత్రను పోషిస్తూ పాత్ర ఆంగిక, అభినయ, ఆహార్యాలను స్థిరపరిచేశాడు. ప్రేక్షకులు ఎవరైనా ఆయనతో పోల్చి వెండితెర సత్యభామను అంచనా కడతారు. జమున సత్యభామ పాత్రను మొదట తెలిసీ తెలియని వయసులో 'వినాయక చవితి' చిత్రంలో పోషించింది. అసలైన సత్యభామగా ఎన్.టి.ఆర్‌తో 'శ్రీ కృష్ణ తులాభారం'లో నటించింది. స్థానం నాటకాల్లో పాపులర్ చేసిన 'మీరజాల గలడా నా యానతి' పాటను అంతకు దీటుగా అభినయించింది. పెంకితనం, మొండితనం, స్వాతిశయం వీటితో పాటు తెలియని అమాయకత్వాన్ని సత్యభామకు జోడించడంతో జమున సత్యభామ అయ్యింది. సత్యభామ జమున అయ్యింది. కృష్ణుడి వేషంలో ఉన్నా ఎన్.టి.ఆర్ అంతటి వాడి కిరీటాన్ని కాలితో తన్నాలి. జమున ధైర్యంగా తన్న గలిగింది. అలాంటి షాట్ చేశాక సీనియర్ ఆర్టిస్ట్‌కు 'సారీ' చెప్పాలన్న పరిణితి అప్పటికే ఆమెకు వచ్చేసింది. 'సారీ సార్' అని ఎన్.టి.ఆర్‌తో అంటే 'ఇట్స్ ఆల్‌రైట్... యాక్టింగే కదా' అని ఆయన ఈజీగా తీసుకున్నారు. తెలుగువారికి కృష్ణుడు ఎన్.టి.ఆర్. సత్యభామ జమునే.

●●●

తెలుగువారి తొలి గ్లామర్ స్టార్ కాంచనమాల. తర్వాతి గ్లామర్ స్టార్ జమున. భానుమతి, సావిత్రి, అంజలి... వీరంతా పెర్‌ఫార్మర్లు. వీరి పక్కన అందరూ సరిపోరు. కాని ఎవరి పక్కనైనా అందంగా సరిపోయే స్టార్‌గా జమున తెలుగు సినిమా పరిశ్రమలో దాదాపు 25 ఏళ్లు ఏలింది. హరనాథ్‌తో 'లేత మనసులు' పెద్ద హిట్ సాధించింది. అందులోని 'హలో మేడమ్ సత్యభామా', 'అందాల ఓ చిలుకా అందుకో నా లేఖ' పాటల్లో జమున జాంపండులా ఉందని ప్రేక్షకులు మురిసిపోయారు. ఒక సీనియర్ హీరోయిన్ అయి ఉండి, పెద్ద స్టార్ అయి ఉండి చలంతో 'మట్టిలో మాణిక్యాలు' హిట్ కొట్టింది జమున. అందులో 'నా మాటే నీ మాటై చదవాలి' పాట అతి మధురం. ముచ్చటం. ఫీల్డ్‌కు వచ్చిన కొత్తల్లో జమునను 'హంపీ సుందరి' అని, 'ఆంధ్రా నర్గిస్' అని పిలిచేవారు. చిత్రంగా నర్గిస్‌కు చిరఖ్యాతి తెచ్చి పెట్టిన 'మదర్ ఇండియా'ను జమునే తెలుగులో చేసింది. ఆ సినిమా పేరు 'బంగారు తల్లి'.

●●●

సినిమా వాళ్లు సినిమా వాళ్లనే చేసుకుంటున్న రోజుల్లో ఆ ఆనవాయితీని తప్పించి లెక్చరర్‌ను వివాహం చేసుకుంది జమున. కొడుకు పుడితే అక్కినేని భార్య అన్నపూర్ణ వచ్చి 'సిజేరియన్ అటగదా. ఇన్నాళ్లూ నువ్వొక్కదానివే సన్నగా ఉన్నావనుకున్నాను. ఇకపై లావెక్కిపోతావు' అని నిట్టూర్చి వెళ్లింది. కాని జమున మారలేదు. కొడుకు పుట్టిన తర్వాత కూడా పదేళ్ల పాటు హీరోయిన్‌గా కొనసాగింది. సగటు ప్రేక్షకుడి డ్రీమ్ గర్ల్‌గానే ఉంది. ఒక ఔత్సాహికుడికి జీవితంలో ఒక సారైనా జమున పక్కన నటించి ఆమెతో ఒక డ్యూయెట్ పాడాలని కోరిక. అందుకోసం ఆ ఔత్సాహికుడు భారీ డబ్బు ఖర్చు పెట్టి, పెద్ద తారాగణంతో సినిమా తీశాడు. జమునకు వారితో వీరితో రికమండేషన్ చేయించి తన పక్కన నటించేలా ఒప్పించాడు. ఆమె ఆకర్షణ అలా ఉండేది. అన్నట్టు ఆ సినిమా పేరు 'బొబ్బిలి యుద్ధం'. ఆ ఔత్సాహికుడు సీతారామ్.

మురిపించే అందాలే
అవి నన్నే చెందాలే...

●●●

'మిస్సమ్మ', 'చిరంజీవులు', 'సతీ అనసూయ', 'గులే బకావళి కథ', 'మంగమ్మ శపథం', 'రాముడు భీముడు', 'మూగనోము'.... జమున హిట్లు ఎన్నో ఉన్నాయి. 'మూగ మనసులు' స్క్రిప్ట్ మొత్తం తయారయ్యాక సావిత్రి విని ఇందులో గౌరి పాత్ర నేను వేస్తాను... రాధ పాత్రను జమునకు ఇవ్వండి. గౌరి పాత్ర చాలా బాగుంది' అన్నదట. 'గౌరిగా నువ్వు బాగోవు. అది జమునకే కరెక్ట్' అని అక్కినేని సర్దిచెప్పారట. 'మూగ మనసులు' సినిమాలో జమున విశ్వరూపం చూపింది. గోదారి గట్టు మీద తన పాద ముద్రలను శాశ్వతంగా విడిచింది. రాయీ రప్పా కాని మామూలు మనుషులను కదిలించింది. కొత్త తరం వచ్చాక తన ప్రాభవాన్ని కాపాడుకుంటూ పక్కకు తప్పుకుంది జమున. చిల్లర మల్లర క్యారెక్టర్లు వేయలేదు. ఆమె వేసే క్యారెక్టర్ 'పండంటి కాపురం'లో రాణి మాలినీ దేవిలా ఉండాలి. అంత పవర్‌ఫుల్‌గా ఉండాలి. ఉంది. పండంటి కాపురం సూపర్ హిట్ కావడంలో జమున పాత్ర ఒక ముఖ్య కారణం.

●●●

జమున తాను రిటైరై పోయినా ఏదో ఒక కార్యక్రమంలో పాల్గొంటూ ప్రేక్షకులకు దగ్గరగానే ఉంది. చివరి నిమిషం వరకూ గ్లామర్‌తోనే కనిపించింది. తెల్లజుట్టు జమునను ఎవరూ చూడలేదు. ఉత్సాహం లేని జమునను ఎవరూ చూడలేదు. స్వాతిశయం తప్పిన జమునను ఎవరూ చూడలేదు. సినిమా రంగంలో ఎన్నో ప్రతికూలతలు దాటి, ఎదురు నిలిచి, తన స్థానాన్ని పొందింది జమున.

ఆమె రాకతో ఒక వెన్నెల వచ్చింది.

ఆమె వీడ్కోలుతో ఆ వెన్నెల జ్ఞాపకాల్లోనే మిగిలింది.

పగలే వెన్నెల... జగమే ఊయల
కదలే ఊహలకే కన్నులుంటే...




'గులేబకావళి కథ'లో ఎన్టీఆర్‌తో...



'ఇల్లరికం'లో అక్కినేనితో...



'గుండమ్మ కథ'లో అక్కినేని, ఎన్టీఆర్‌తో...



'హమ్‌రాహి'లో రాజేంద్రకుమార్‌తో...

జమున హిట్ సాంగ్స్‌లో కొన్ని..



1. గౌరమ్మా నీ మొగుడెవరమ్మా... (మూగ మనసులు)
2. నీ మది చల్లగా స్వామీ నిదురపో... (ధనమా దైవమా)
3. ఎవరికి తెలియదులే ఇంతుల సంగతి... (దొరికితే దొంగలు)
4. అంతగా నను చూడకు.. ఇంతగా గురి చూడకు... (మంచి మనిషి)
5. ఈ వేళ నాలో ఎందుకో ఆశలు... (మూగనోము)
6. తెలిసిందిలే తెలిసిందిలే నెలరాజ నీ గుట్టు తెలిసిందిలే... (రాముడు భీముడు)
7. మళ్లీ మళ్లీ పాడాలి ఈ పాట... (మట్టిలో మాణిక్యం)
8. వసంత గాలికి వలపులు రేగ... (శ్రీకాకుళాంధ్ర మహావిష్ణు కథ)
9. నన్ను దోచుకొందువటే... (గులేబకావళి కథ)
10. బులి బులి ఎర్రని బుగ్గల దానా... (శ్రీమంతుడు)
11. మనసా కవ్వించకే నన్నిలా... (పండంటి కాపురం)
12. రివ్వున సాగే రెపరెపలాడే... (మంగమ్మ శపథం)
13. పచ్చని చెట్టు ఒకటి వెచ్చని చిలుకలు రెండు .. (రాము)
14. బృందావనమది అందరిదీ గోవిందుడు అందరివాడేలే... (మిస్సమ్మ)
15. ప్రేమ యాత్రలకు బృందావనమూ నందనవనమూ ఏలనో.. (గుండమ్మ కథ)
16. నువ్వూ నేనూ నడిచేది ఒకే బాట... ఒకే మాట (డబ్బుకు లోకం దాసోహం)











అలనాటి తార జమున కన్నుమూత

తెలుగువారి సత్యభామగా ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసిన జమున (86) ఇకలేరు. వయోభారం, అనారోగ్య కారణాలతో హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని తన స్వగృహంలో శుక్రవారం ఉదయం 7.30 ని॥లకు తుదిశ్వాస విడిచారామె. అమెరికాలో ఉంటున్న కుమారుడు వంశీకృష్ణ హైదరాబాద్ చేరడానికి ఆలస్యం కావడంతో కుమార్తె స్రవంతి తల్లికి అంత్యక్రియలు నిర్వహించారు.



సత్యసాయిబాబాతో జమున దంపతులు

నిప్పాణి శ్రీనివాసరావు, కౌసల్యాదేవి దంపతులకు 1936 ఆగస్ట్ 30న హంపిలో జన్మించారు జమున. తండ్రికి గుంటూరులో పొగాకు, పసుపు వ్యాపారాలుండేవి. శ్రీనివాసరావు వ్యాపార రీత్యా జమున బాల్యమంతా గుంటూరు జిల్లాలోని దుగ్గిరాలలో గడిచింది. చక్కని సంగీత విద్వాంసురాలు అయిన కౌసల్యాదేవి జమునకి శాస్త్రీయ సంగీతం, హార్మోనియంలలో శిక్షణ ఇప్పించారు. దుగ్గిరాల గ్రామస్తులు వేసిన 'ఛలో ఢిల్లీ' నాటకంలో తొలిసారి వసుంధర అనే పాత్ర వేశారు జమున. ఆ తర్వాత 'మా భూమి, ఖిల్జీ రాజ్యపతనం..' ఇలా పలు నాటకాలు వేశారు జమున. దుగ్గిరాలకు చెందిన శ్రీమన్నారాయణమూర్తి అనే నటుడు జమున గురించి నిర్మాత బీవీ రామానందంకు ('వరూధిని' సినిమా తీశారు) చెప్పారు. దీంతో ఆయన నిర్మిస్తున్న తర్వాతి చిత్రం 'జై వీర భేతాళ'(1952 మార్చిలో స్టార్ట్ అయింది) అనే సినిమాలో హీరోయిన్‌గా జమునకు అవకాశం ఇచ్చారు. ఈ చిత్రంలో గుమ్మడి హీరోగా ఎంపికయ్యారు. అయితే ఆ సినిమా ఎందుకో ఆగిపోయింది. ఆ తర్వాత గరికపాటి రాజారావు దర్శకత్వం వహించిన 'పుట్టిల్లు' (1953) సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యారు జమున. ఆ తర్వాత ఎన్టీఆర్, ఏఎన్ఆర్, జగ్గయ్య వంటి అగ్రహీరోల సరసన కథానాయికగా నటించారు. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళంతో పాటు పలు హిందీ సినిమాల్లో నటించి భేష్ అనిపించుకున్నారామె.

దాదాపు 200 సినిమాల్లో ఎన్నో పాత్రల్లో జమున నటించినా బాగా పేరు తెచ్చినవాటిలో సత్యభామ పాత్రని ప్రముఖంగా చెప్పుకోవాలి. ఆ పాత్రలో ఆమెను తప్ప ఎవర్నీ ఊహించుకోలేం అన్నట్టుగా జీవించారు జమున. 'సంతోషం, మిస్సమ్మ, చిరంజీవులు, తెనాలి రామకృష్ణుడు, దొంగరాముడు, బంగారు పాప, వద్దంటే డబ్బు, చింతామణి, భూకైలాస్, భాగ్యరేఖ, గుండమ్మకథ' వంటి పలు హిట్ చిత్రాల్లో నటించారు జమున. 'తెలుగు ఆర్టిస్ట్స్ అసోసియేషన్' అనే సంస్థ నెలకొల్పి 25 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు కూడా చేస్తున్నారామె.

లెక్చరర్‌తో పెళ్లి...

హీరోయిన్లు సినిమా ఇండస్ట్రీలోని వారిని కాకుండా ఇతర రంగంలోని వారిని వివాహం చేసుకోవడం నటి పద్మినీతో ఆరంభమైంది. అలా వివాహం చేసుకున్న రెండో హీరోయిన్ జమున. దూరపు బంధువైన రమణారావుతో 1965లో జమున వివాహం తిరుపతిలో జరిగింది. రమణారావు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తూ, జువాలజీ లెక్చరర్‌గా చేసేవారు. డాక్టరేట్ అందుకున్న తర్వాత ఉస్మానియా విశ్వ విద్యాలయానికి బదిలీ అయ్యారాయన.. దీంతో కాపురాన్ని హైదరాబాద్‌కి మార్చారు. జమున కూడా మద్రాసు (చెన్నై) నుంచి హైదరాబాద్‌కి వచ్చేశారు. 1976లో బంజారా హిల్స్‌లో సొంత ఇల్లు కట్టుకుని స్థిరపడ్డారామె. రమణారావు–జమునలకు వంశీకృష్ణ, స్రవంతి సంతానం. తొలి సంతానం వంశీకృష్ణ పుట్టిన తర్వాత కూడా పదేళ్లపాటు హీరోయిన్‌గా బిజీగానే కొనసాగారు జమున. వంశీకృష్ణ శాన్‌ఫ్రాన్సిస్కో విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. బర్కిలీలోని స్టెయిన్డ్ గ్లాస్ గార్డెన్‌లో గ్లాస్ పెయింటింగ్‌లో శిక్షణ పొంది, అదే రంగంలో స్రవంతి స్థిరపడ్డారు. స్రవంతిని హీరోయిన్ చేయాలనుకున్నారు జమున. అయితే ఇండస్ట్రీలో వచ్చిన మార్పులతో ఆ నిర్ణయాన్ని మార్చుకున్నారామె. కాగా ఓ నవల ఆధారంగా సినిమా తీయాలని, దానికి తనే దర్శకత్వం వహించాలని సంకల్పించారు జమున. నాలుగు పాటలు రికార్డు చేసిన తర్వాత ఈ సినిమా ఆగిపోయింది. అయితే దర్శకత్వంపై తనకున్న మమకారంతో 'డాక్టర్ మమత' అనే సీరియల్‌ని తెరకెక్కించారామె. దూరదర్శన్‌లో 15 ఎపిసోడ్స్‌గా ఆ సీరియల్ ప్రసారం అయింది కూడా!



భర్త రమణారావుతో...

రాజకీయ రంగంలో...

1980లలో నాటి ప్రధాని రాజీవ్ గాంధీ ప్రోత్సాహంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు జమున. పార్టీ కార్యవర్గ సభ్యురాలిగా ఎన్నికై 1983లో ఆ పార్టీ తరఫున ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రచారం చేశారామె. తర్వాత రాజీవ్ గాంధీ సపోర్ట్‌తో 1989లో రాజమండ్రి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు జమున. ఆ తర్వాత వచ్చిన మధ్యంతర ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కొన్నాళ్లు చేసిన ఆమె ఆ తర్వాత కాంగ్రెస్ నుంచి బయటికొచ్చేశారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వ్యవహార శైలి నచ్చి భారతీయ జనతా పార్టీలో చేరారు.. 1990వ దశకంలో ఆ పార్టీ తరఫున ఎన్నికల ప్రచారం చేశారు. ఆ తర్వాత 'రంగస్థల వృత్తి కళాకారుల సమాఖ్య' అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్రంలో పర్యటించి, పదివేల మంది కళాకారుల వివరాలు సేకరించారామె. అంతేకాదు.. 'రంగస్థల వృత్తి కళాకారుల సమాఖ్య'కు 26 శాఖలు ఏర్పాటు చేశారు. నిరుపేద కళాకారులకు ఇళ్ల స్థలాలు, గృహ రుణాలు, పెన్షన్లు మంజూరు చేయించి పెద్ద మనసు చాటుకున్నారు జమున.



రాజీవ్ గాంధీతో...

అవార్డులు...

1964లో విడుదలైన 'మూగమనసులు' (తెలుగు), 1968లో రిలీజైన 'మిలన్' (హిందీ) చిత్రాలకు ఉత్తమ సహాయ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, 2008లో 'ఎన్టీఆర్ జాతీయ పురస్కారం' అందుకున్నారామె. అలాగే 2021 సంవత్సరానికిగాను 'సాక్షి' మీడియా గ్రూప్ ఎక్సలెన్స్ అవార్డుల్లో భాగంగా 'జీవిత సాఫల్య పురస్కారం' అందుకున్నారు జమున. దాదాపు ఏడు దశాబ్దాల కెరీర్‌లో అద్వితీయమైన పాత్రలు చేసిన జమునకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 'పద్మ' పురస్కారం వరించలేదు. అయినా అవార్డులకు అతీతంగా 'సత్యభామ'గా ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్రవేసిన ఈ అద్భుత నటి చరిత్ర ఎప్పటికీ నిలిచి పోతుంది.



శంకర్ దయాళ్ శర్మతో...



పేరు మారిందిలా...

జమున పేరు వెనక ఓ విశేషం ఉంది. ఆమె తల్లిదండ్రులు తీర్థయాత్రలు చేస్తూ, పండరీపురంలోని పాండురంగని దర్శనం చేసుకున్న తర్వాతే కౌసల్య కడుపులో పడ్డారట జమున. ఈ కారణం చేత 'జనాబాయి' అని పేరు పెట్టుకోవాలనుకున్నారు జమున తల్లిదండ్రులు. కానీ జన్మరాశి ప్రకారం ఏదైనా నది పేరు రావాలని పెద్దలు చెప్పడంతో 'జ'కి 'న'కు మధ్యలో 'ము' అక్షరాన్ని చేర్చి 'జనాబాయి' పేరును 'జమున'గా మార్చారు. ఉత్తరాదిలో 'యమున' నదిని 'జమున' అంటారు. 'ఇంత నాజూకైన పేరు పెట్టి సినిమారంగం కోసం మళ్లీ పేరు మార్చుకునే అవసరం లేకుండా చేసిన మా అమ్మను నిజంగా అభినందించాల్సిందే' అని పలు సందర్భాల్లో జమున గుర్తుచేసుకుని హ్యాపీ ఫీలయ్యేవారు.

పొగరుబోతు అనే పేరు ఎందుకు?

ఇండస్ట్రీలో మరింత మెరుగ్గా రాణించే క్రమంలో మద్రాస్‌కు మకాం మార్చారు జమున కుటుంబ సభ్యులు. అయితే ఓ సినిమాలో జమునకు అవకాశం ఇస్తామన్నట్లుగా ఆమె తండ్రి శ్రీనివాసరావును కొందరు అజ్ఞాతవ్యక్తులు కారులో తీసుకుని వెళ్లారు. కొంతదూరం ప్రయాణించిన తర్వాత వారిపై ఆయనకు అనుమానం రావడంతో సిగరెట్ల సాకుతో వారి నుంచి ఎలాగో తప్పించుకున్నారు. అదే సమయంలో ఇంట్లో ఉన్న తన కుటుంబసభ్యులకు ఏమైనా ఆపద కలిగిందా? అని చాలా కంగారుపడ్డారట జమున తండ్రి. ఈ ఘటన తర్వాత తాను ఇంట్లో లేనప్పుడు ఇంటికి ఎవరొచ్చినా తలుపు తెరవొద్దని, అవసరమైతే కీటికీలోనుంచి చూసి, తెలిసిన వారైతేనే తలుపు తీయమని, ముఖ్యంగా తెలియనివారైతే తాను ఇంట్లో ఉన్నప్పుడే రమ్మని చెప్పాలన్నట్లుగా కుటుంబసభ్యులకు చెప్పారట శ్రీనివాసరావు. దీంతో తండ్రి చెప్పినట్లే చేశారట జమున. ఈ కారణంగా కొందరు దర్శక–నిర్మాతలు జమున ఇంటి వరకు వచ్చీ.. ఆమెను కలవకుండానే వెళ్లిపోవాల్సి వచ్చేది. అయితే అసలు విషయం తెలియని కొందరు దర్శక–నిర్మాతలు 'జమున చాలా పొగరుబోతు.. ఇంట్లోకి కూడా రానివ్వదు' అని చెప్పుకునేవారట.




పుట్టిల్లులో..



తూంగాదే తంబిలో కమల్ హాసన్‌తో...

తమిళ్‌తో అనుబంధం

కథానాయికగా జమున తెలుగు సినిమా ద్వారా పరిచయమైనప్పటికీ తమిళ సినిమాకూ ఎనలేని సేవలు అందించారు. దివంగత మహానటులు ఎంజీఆర్, శివాజీ గణేశన్, జెమినీ గణేశన్ వంటి వారితో జమున నటించి ఆకట్టుకున్నారు. 'పణం పడత్తుం పాడు' (1954) చిత్రంతో కోలీవుడ్‌కి పరిచయం అయ్యారు జమున. 'మిస్సియమ్మ (మిస్సమ్మ), తెనాలి రామన్, తంగమలై రహస్యం, తిరుట్టు రామన్, నాళయ తీర్పు వంటి పలు విజయవంతమైన చిత్రాలు జమున ఖాతాలో ఉన్నాయి. ఇక క్యారెక్టర్ నటిగా 'తూంగాదే తంబి తూంగాదే' చిత్రంలో కమలహాసన్‌కు తల్లిగా నటించారామె. అప్పట్లో తమిళ పరిశ్రమలో హీరోలకు సమానంగా పారితోషకం పొందిన సావిత్రి తర్వాత ఆ స్థాయిలో అందుకున్న నటి జమున కావడం విశేషం.



సావిత్రితో ప్రత్యేక అనుబంధం

'మిస్సమ్మ', 'దొంగరాముడు', 'అప్పుచేసి పప్పుకూడు', 'గుండమ్మకథ' వంటి చిత్రాల్లో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్న సావిత్రి, జమునల మధ్య మంచి అనుబంధం ఉంది. అక్కాచెల్లెళ్లుగా అన్ని విషయాలను అరమరికలు లేకుండా చర్చించుకునేవారు. అయితే కొందరు వ్యక్తులు కావాలని వీరిద్దరి మధ్యలో తగువులు పెట్టడంతో ఏడాది పాటు సావిత్రి, జమున మాట్లాడుకోలేదు. ఆ తర్వాత అసలు విషయం గ్రహించి మునుపటిలానే ఉండసాగారు. ఈ విషయాన్ని జమున ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అంతేకాదు.. తన కొడుకు బారసాల వేడుకకు సావిత్రి వచ్చారని, ఆ సమయంలో ఆమె (సావిత్రి) జీవితం సజావుగా సాగనందుకు చాలా బాధపడి ఏడ్చారని, అప్పుడు తానే సావిత్రిని ఓదార్చినట్లుగా కూడా జమున ఓ సందర్భంలో చెప్పుకొచ్చారు. అలాగే ఒకానొక స్థితిలో సావిత్రి పరిస్థితిని చూసి తనకు చాలా బాధకలిగిందని కూడా జమున పేర్కొన్నారు.

నటన–డైరెక్షన్–మ్యూజిక్: జమున!

చిన్నతనం నుంచే జమునకు కళల పట్ల మక్కువ ఎక్కువ. అందుకే తొమ్మిదేళ్ల వచ్చేలోపే నాటకాల్లో నటించారు. ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో తిరునగరి రామాంజనేయులు, బుర్రకథ పితామహుడు నాజర్ తదితరుల నాయకత్వంలో 'మా భూమి', 'ముందడుగు' 'ఢిల్లీ', 'ఛలో', 'విందు' వంటి నాటకాల్లో నటించారు జమున. ముఖ్యంగా 'మా భూమి' నాటికలోని జమున నటనకు మంచి మార్కులు పడ్డాయి. మరో విశేషం ఏంటంటే... 'విందు' అనే నాటికలో యశోదగా నటించడమే కాదు.. ఆ నాటికకు దర్శకత్వం వహించడంతో పాటు, మ్యూజిక్‌ను కూడా కంపోజ్ చేశారట జమున. ఇలా నటనలో ఎదగడానికి సరిపడా ఓనమాలు నేర్చుకున్నది నాటక రంగం నుంచేనని చెబుతారు జమున. ఆ తర్వాత 'ఖిల్జీ రాజ్యపతనం' నాటకంతో జమున పేరు మరింత ప్రాచుర్యంలోకి వచ్చి, తొలి సినిమా 'పుట్టిల్లు'లో అవకాశం వచ్చేలా చేసింది.

ఎస్వీరంగారావు సలహా

సినిమా ఇండస్ట్రీలో బాగా రాణిస్తున్న సమయంలో ఓ హీరోను పెళ్లి చేసుకోవాలనుకున్నారట జమున. కానీ ఓ సందర్భంలో అప్పటి సీనియర్ నటులు ఎస్వీ రంగారావు జీవితం గురించి కొన్ని విషయాలు చెప్పి, అన్నీ ఆలోచించుకుని ముందడుగు వేయాలన్నట్లుగా హితబోధ చేశారట. దీంతో అప్పటి ఆ హీరోతో వివాహాన్ని వద్దనుకున్నారట జమున. ఆ తర్వాత రమణారావును పెళ్లి చేసుకున్నారు జమున.

తల్లి స్ఫూర్తితో...

ఇండస్ట్రీలో జమున చాలా ధైర్యంగా, ఆత్మాభిమానంతో ఉండేవారు. ఈ లక్షణాలతో పాటుగా ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవడం వంటి వాటిని తన తల్లి కౌసల్యాదేవి నుంచే అలవరచుకున్నారట జమున. విశేషం ఏంటంటే.. జమున తల్లి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని రెండు రోజులు జైల్లోనే ఉన్నారట.



కూతురే కుమారుడై...

2014 నవంబరు 10న జమున భర్త రమణారావు గుండెపోటుతో మృతి చెందారు. అప్పటినుంచి కుమార్తె స్రవంతి దగ్గరే ఉంటున్నారు జమున. తల్లికి అన్నీ తానయ్యారు స్రవంతి. శుక్రవారం ఉదయం జమున మరణించగా, మధ్యాహ్నం ఆమె పార్థివ దేహాన్ని ఫిలిం చాంబర్‌లో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. ఆ సాయంత్రం 4.30 గంటలకు ఫిలిం చాంబర్ నుంచి జమున అంతిమ యాత్ర మహాప్రస్థానానికి చేరింది. అమెరికాలో ఉంటున్న కుమారుడు వంశీకృష్ణ నేడు (శనివారం) హైదరాబాద్ చేరుకుంటారు. దాంతో అన్నీ తానై అశ్రునయనాల మధ్య తల్లికి స్రవంతి అంత్యక్రియలు నిర్వహించారు. సినీ ప్రముఖులు, కుటుంబ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి ఆర్‌కే రోజాతోపాటు పలువురు పాల్గొని అశ్రునివాళులు అర్పించారు.

నటి జమునతో తన అనుబంధాన్ని 'సాక్షి'తో నటి కాంచన ప్రత్యేకంగా పంచుకున్నారు.

నన్ను ఏడిపించేశావ్ కాంచీ అన్నారు

- కాంచన

● వారానికి మూడు నాలుగు సార్లు జమున అక్క, నేను మాట్లాడుకునేవాళ్లం. అయితే ఈ నెల నాకు తీరిక లేకపోవడం, అక్క కూడా ఫోన్ చేయకపోవడంతో మాట్లాడుకోలేదు. మామూలుగా ఫోన్ చేసి, అప్పటి సినిమాల గురించి మాట్లాడుకుంటుంటాం. 'భోజనం చేశావా.. వంట ఏంటి?'.. ఇవన్నీ కూడా చెప్పుకునేవాళ్లం.

● జమున అక్క నా సీనియర్. నేను కాలేజీ డేస్ నుంచే సీనియర్లతో జూనియర్లు మాట్లాడకూడదా అనుకునేదాన్ని. ఆ ఫీలింగ్‌తో సీనియర్లతో కూడా బాగా మాట్లాడేదాన్ని. సినిమాల్లోకి వచ్చాక కూడా అంతే. పైగా మేం చిన్నవాళ్లం అనే ఫీలింగ్ ఏమీ పెట్టుకోకుండా జమునక్క, సావిత్రక్క బాగా మాట్లాడేవారు.

● ఇక దసరా వచ్చిందంటే చాలు... బొమ్మల కొలువు సందడి ఉండేది. ఒకరింటికి ఒకరు వెళ్లడం.. సుండల్ (శెనగలు) తినడం... అంతా బాగుండేది. పైగా జమున అక్క భలే డ్రెస్ చేసుకునేవారు. ఆవిడకు బాగా రెడీ అవ్వడం అంటే ఇష్టం. నా డ్రెస్సింగ్ డిఫరెంట్‌గా ఉండేది. సింపుల్‌గా రెడీ అయ్యేదాన్ని. బాగున్నావని మెచ్చుకునేవారు.



● అట్లతద్దిని అయితే ఎప్పటికీ మరచిపోలేను. అప్పట్లో అందరం మదరాసు (చెన్నై)లో ఉండేవాళ్లం కదా. అట్లతద్ది నాడు ఒకళ్లు అట్లు వేసేవాళ్లం. ఇంకొకరు చట్నీ చేసేవాళ్లం. ఇంకొకరు పులుసు.. జమున అక్క, నేను అందరం మెరీనా బీచ్‌కి వెళ్లిపోయేవాళ్లం. అక్కడ ఉయ్యాల కుదరదు కదా. పరుగు పందేలు పెట్టుకుని, చాలా హ్యాపీగా గడిపేవాళ్లం.

● ఆ మధ్య ఒకసారి జమున అక్క ఫోన్ చేసి, 'నన్ను ఇవాళ బాగా ఏడిపించేశావ్..' అంటే, నాకేం అర్థం కాలేదు. 'నేనేం ఏడిపించాను అక్కా...' అంటే... నువ్వు యాక్ట్ చేసిన 'కల్యాణ మంటపం' సినిమా చూశాను. 'ఎంత బ్రహ్మాండంగా యాక్ట్ చేశావ్. ఎమోషనల్ సీన్స్‌లో ఏడిపించావ్' అంటే నాకు పట్టరానంత ఆనందం కలిగింది.

● జమునక్క యాక్ట్ చేసినవాటిలో నాకు 'మూగ మనసులు' చాలా ఇష్టం. ఇక 'మిస్సమ్మ'లో 'బృందావనమది అందరిదీ..' పాటకి ఎంతో నాజూకుగా డ్యాన్స్ చేసింది. మనకు ఏమీ తెలియనప్పుడు టీచర్ చెప్పింది చెప్పినట్లు చేస్తాం... ఆ సినిమాలో డ్యాన్స్ నేర్చుకునే స్టూడెంట్‌గా టీచర్ చెప్పింది చెప్పినట్లు చేసే క్యారెక్టర్‌ని అక్క అద్భుతంగా చేసింది.

● మేం కలిసి నాటకాలు కూడా వేసేవాళ్లం. ముఖ్యంగా 'శ్రీకృష్ణ తులాభారం' నాటకం చాలాసార్లు వేశాం. అందరూ ఆడవాళ్లే నటించాలన్నది అక్క ఆశ. అలానే ఆడవాళ్లందరం కలిసి నటించాం. సినిమాలో కృష్ణుడిగా ఎన్టీఆర్ నటించారు. నాటకంలో ఆ పాత్ర నాది. సత్యభామగా జమున అక్క నటన గురించి ఎంత చెప్పినా తక్కువే. అలాంటిది కృష్ణుడిగా నా నటనను మెచ్చుకునేది.

● మేమంతా సత్య సాయిబాబా భక్తులం. జీవితం అనేది పోరాటం. ఈ పోరాటంలో గెలిచి నిలబడటం చాలా కష్టమైన విషయం. జమున అక్క నిలబడింది. ఈ గెలుపు కన్నా కూడా బతికున్నంతవరకూ పోరాటం చేసే మనిషి పోయేటప్పుడు ప్రశాంతంగా పోవడమనేది ముఖ్యం. ఆ ప్రశాంతత అక్కకు దక్కింది. 'దేవుడా.. ఆస్పత్రిపాలు కాకుండా ప్రశాంతంగా తీసుకెళ్లు' అని కోరుకుంటాం. ఆ సత్య సాయిబాబా ఆశీస్సులతో అక్క ఎలాంటి ఇబ్బంది పడకుండా వెళ్లిపోయింది. ఆ జీవుడు చివరి నిమిషంలో ఎలాంటి బాధ పడకుండా నిష్క్రమించింది. ప్రశాంతమైన మనిషికి ప్రశాంతమైన నిష్క్రమణ దక్కింది. ఇది కదా కావాల్సింది (గద్గద కంఠంతో..)

గాయం చేసిన లేత మనసులు...

'లేత మనసులు' సినిమా తమిళ వెర్షన్ చేస్తుండగా జరిగిన ఓ ప్రమాదం వల్ల జమున మెడ బాగా దెబ్బతింది. 'అందాల ఓ చిలుకా..' పాట తమిళంలో తీస్తున్నారు. హీరో గడ్డిమేట మీద నుంచి జారుకుంటూ వచ్చి జమున పక్కన చేరాలి. అయితే కొత్తవాడైన ఆ చిత్ర హీరో జయశంకర్.. సీనియర్ హీరోయిన్ జమునతో చేస్తున్నాననే కంగారుతో అదుపుతప్పి వచ్చి జమున తలపై పడ్డారు. దీంతో ఆమె మెడ విరిగినంత పనయింది. షూటింగ్ నిలిచిపోయింది. సున్నితమైన మెడ నరాలు దెబ్బతినడంతో కొన్నాళ్లు చికిత్స తర్వాత మళ్లీ షూటింగుల్లో పాల్గొన్నారు జమున. అయితే కొన్నేళ్ల తర్వాత ఆ సమస్య మళ్లీ మొదటికొచ్చింది.. దీంతో ఆమె మెడ ఎక్కువగా ఊగిపోయేది. 'రాజపుత్ర రహస్యం' సినిమాలో ఈ ఇబ్బంది ఆమెలో బాగా కనిపించేది. ఎన్ని చికిత్సలు తీసుకున్నా తల ఊగడం తగ్గలేదు. 1978లో విడుదలైన 'శ్రీ రామ పట్టాభిషేకం' తర్వాత సినిమాల నుంచి గౌరవంగా తప్పుకున్నారు జమున. ఆ తర్వాత 'బంగారు కొడుకు'(1982), 'జల్సా రాయుడు'(1983), 'రాజకీయ చదరంగం'(1989) వంటి చిత్రాల్లో ముఖ్యమైన పాత్రలు చేశారు. కాగా ఆమె నటించిన చివరి చిత్రం 'అన్నపూర్ణమ్మగారి మనవడు' 2021 జనవరి 29న విడుదలైంది.

ప్రముఖుల నివాళి



జమునకు నివాళులర్పిస్తున్న లక్ష్మీ పార్వతి, సుబ్బ రామిరెడ్డి, డి.సురేష్‌బాబు, ఆది శేషగిరిరావు, కరాటే కల్యాణి, అల్లు అరవింద్, మురళీమోహన్

జమున మృతికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ విచారం వ్యక్తం చేశారు. 70ఏళ్ల నట జీవితంలో ఎన్నో అద్భుతమైన పాత్రలు పోషించిన ఆమె చిరస్మరణీయంగా నిలిచి పోతారన్నారు. జమున కుటుంబ సభ్యులకు గవర్నర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారని రాజ్‌భవన్ వర్గాలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపాయి.

* * *

తెలుగు చలన చిత్ర పరిశ్రమ మొదటి తరం నటీమణుల్లో అగ్రనాయికగా వెలుగొందిన సీనియర్ నటి జమున తెలుగు వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొనియాడారు. ఆమె మృతి తెలుగు చలన చిత్ర పరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్టుగా ట్విట్టర్ ద్వారా సీఎం వైఎస్ జగన్ తన సంతాపాన్ని తెలియజేశారు.

* * *

నటి జమున మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు. జమున మరణం సినీ పరిశ్రమకు తీరని లోటని సీఎం కేసీఆర్ అన్నారు. తొలి తరం నటిగా వందలాది చిత్రాల్లో నటించి, తెలుగువారి అభిమాన తారగా వెలుగొందిన జమున జ్ఞాపకాలను సీఎం కేసీఆర్ స్మరించుకున్నారు. తెలుగు, తమిళం, కన్నడంలోనే కాకుండా హిందీ సినిమాల్లోనూ నటించి ప్రేక్షకుల అభిమానాన్ని పొందిన జమున, నటిగా కళా సేవనే కాకుండా పార్లమెంటు సభ్యురాలిగా ప్రజాసేవ చేయడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా జమున కుటుంబ సభ్యులకు సీఎం కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

* * *

సీనియర్ హీరోయిన్ జమునగారు స్వర్గస్తులయ్యారనే వార్త విచారకరం. ఆవిడ బహుభాషా నటి. మాతృభాష కన్నడం అయినా ఎన్నో విజయవంతమైన చిత్రాలతో తెలుగువారి మనసుల్లో చెరగని ముద్రవేశారు. మహానటి సావిత్రిగారితో జమునగారి అనుబంధం ఎంతో గొప్పది. ఆమె కుటుంబానికి నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను.

- చిరంజీవి

* * *

అల్లరి పిల్లగా, ఉక్రోషంతో ఊగిపోయే మరదలిగా, ఉత్తమ ఇల్లాలిగా, అన్నిటికీ మించి తెలుగు వారి సత్యభామగా మనల్ని ఎంతో మెప్పించారు జమునగారు. చిన్ననాటి నుంచే నాటకాల అనుభవం ఉండటంతో నటనకే ఆభరణంగా మారారామె. కేవలం దక్షిణాది సినిమాలకే పరిమితం కాకుండా ఆ రోజుల్లోనే హిందీ సినిమాల్లోనూ నటించి ఔరా అనిపించి అందరి ప్రశంసలు పొందిన బహుముఖ ప్రజ్ఞాశాలి జమునగారు.

- బాలకృష్ణ

* * *

జమునగారు మహానటి. ఆవిడతో కలిసి నేను ఆర్టిస్ట్‌గా పని చేశాను. ఆ మహానటి మరణం నన్ను దిగ్భ్రాంతికి గురి చేసింది. నాకు సన్నిహితురాలు. మేం కలిసినప్పుడు ఎంతో ఆప్యాయంగా, ప్రేమగా మాట్లాడేవారు. ఆవిడ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను.

- మంచు మోహన్‌బాబు

* * *

భారతీయ సినీ పరిశ్రమకు జమునగారి మరణం తీరని లోటు. సినిమా ఇండస్ట్రీలో ఆమె ఒక మహానటి. ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎంజీఆర్, శివాజీగణేశన్.. వంటి ఎంతోమంది మహానటులతో నటించి మెప్పించారామె. అన్ని భాషల్లో ఆమె ఒక సూపర్ స్టార్. కళాకారులకు పెన్షన్ ఇవ్వాలని పోరాడారు. జమునగారికి కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డు ప్రకటించాలని కోరుతున్నాను.

- ఆర్. నారాయణమూర్తి

* * *

జమునగారు దివంగతులు కావడం బాధాకరం. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో అలనాటి తరానికి ప్రతినిధిగా ఉన్నారామె. వెండితెరపై విభిన్న పాత్రలు పోషించిన జమునగారు తెలుగు ప్రేక్షకులకు సత్యభామగానే గుర్తుండిపోయారు. ఆ పౌరాణిక పాత్రకు జీవం పోశారామె. టీవి, గడుసు పాత్రల్లోనే కాకుండా అమాయకత్వం ఉట్టిపడే పాత్రల్లోనూ ప్రేక్షకుల మెప్పు పొందారు. ప్రజా జీవితంలో లోక్‌సభ సభ్యురాలిగా సేవలందించారు.

- పవన్ కల్యాణ్

* * *

జమునగారి మరణవార్త విని తీవ్రంగా కలత చెందాను. సినీ పరిశ్రమకు ఆమె చేసిన సేవలు, పోషించిన వైవిధ్యమైన పాత్రలతో ఎప్పటికీ గుర్తుండిపోతారు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

- మహేశ్‌బాబు

* * *

దాదాపు 30 సంవత్సరాలు తెలుగు సినిమా ఇండస్ట్రీలో మహారాణిగా కొనసాగారు జమున గారు. 'గుండమ్మకథ', 'మిస్సమ్మ'లాంటి ఎన్నో మరపురాని చిత్రాలు, మరెన్నో వైవిధ్యమైన పాత్రలతో మా మనసుల్లో చెరపలేని ముద్ర వేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి.

- ఎన్టీఆర్

* * *

జమునగారి మరణవార్త విని నా హృదయం ముక్కలైంది. క్లాసికల్ తెలుగు సినిమాకు ఆమె సేవలు మరువలేనివి. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తున్నాను.

- అల్లు అర్జున్

* * *

జమునగారు లేరనే విషయాన్ని నమ్మలేకపోతున్నాను. కొంతకాలంగా ఆమె క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. 'మూగమనసులు' సినిమాలో ఆమె నటన అద్భుతం. సినిమాతోపాటు రాజకీయాల్లోనూ ముందున్నారామె. జమునగారి అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో జరిగి ఉంటే బాగుండేది.

- అలీ

సాక్షి బిజినెస్
శనివారం
28-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	874	59,307
నిఫ్టీ ▽	287	17,604

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)		
నాస్‌డాక్	11,617	▲ 105
డోజోన్స్	33,949	▲ 205
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,765	▲ 04
డాక్స్	15,150	▲ 17
షాంఘై	3,265	▲ 25
నికాయ్	26,397	▲ 20

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	57,189
బంగారం (99.5 స్వచ్ఛత)	56,960
వెండి (కిలో)	68,192

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	80.85	82.52
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	87.51	90.58
€	యూరో	థామస్‌కుక్	99.03	102.34
¥	జపాన్ ఎన్ (100)	థామస్‌కుక్	61.61	63.63
AUS	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	56.87	59.30
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.99	63.00
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.76	22.43
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.32	23.11
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.90	12.98

వేదాంత లాభం క్షీణత

- క్యూ3లో రూ. 2,464 కోట్లు
- షేరుకి రూ. 12.5 డివిడెండ్



న్యూఢిల్లీ: మెటల్, మైనింగ్ దిగ్గజం వేదాంత లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 41 శాతం క్షీణించి రూ. 2,464 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 4,164 కోట్లు ఆర్జించింది. పెరిగిన ముడివ్యయాలు, విండ్‌ఫాల్ ట్యాక్స్ లాభాలను ప్రభావితం చేశాయి. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 12.5 చొప్పున నాలుగో మధ్యంతర డివిడెండును ప్రకటించింది. అల్యూమినియం, కాపర్, ఆయిల్‌గ్యాస్ కార్యకాలాపాల కోసం 91 మెగావాట్ల హైబ్రిడ్ పునరుత్పాదక విద్యుత్, 600 మెగావాట్ల సౌర విద్యుత్‌ను పొందేందుకు బోర్డు అనుమతించినట్లు కంపెనీ తెలిపింది.

ఆదాయం అప్

ప్రస్తుత సమీక్షా కాలంలో వేదాంతా మొత్తం ఆదాయం రూ. 34,674 కోట్ల నుంచి రూ. 34,818 కోట్లకు స్వల్పంగా బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 26,777 కోట్ల నుంచి 31,327 కోట్లకు భారీగా ఎగశాయి. 2022 జూలైలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విండ్‌ఫాల్ ట్యాక్స్ కారణంగా రూ. 333 కోట్ల ప్రభావం పడినట్లు కంపెనీ వెల్లడించింది. జింక్ ఇంటర్నేషనల్ ఆస్తులను రూ. 2,981 కోట్ల విలువలో హిందుస్తాన్ జింక్‌కు విక్రయించనున్నట్లు పేర్కొంది. క్యూ3లో తరుగుదల, అమార్టైజేషన్ పద్దు 4 శాతం పెరిగి రూ. 2,720 కోట్లుగా నమోదైంది. 2022 డిసెంబర్ 31కల్లా స్థూల రుణభారం రూ. 61,550 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో వేదాంతా షేరు ఎన్‌ఎస్‌ఈలో 2 శాతం నష్టంతో రూ. 320 వద్ద ముగిసింది.

టాటా కార్లు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన దిగ్గజం టాటా మోటార్స్ కంబషన్ ఇంజిన్ ఆధారిత మోడళ్ల ధరలను 1.2% మేర పెంచుతోంది. ఫిబ్రవరి 1 నుండి ఈ నిర్ణయం అమలులోకి రానున్నట్టు కంపెనీ శుక్రవారం ప్రకటించింది. నూతన ఉద్గార నిబంధనలకు అనుగుణంగా వాహనాల మార్పులు, ముడిసరుకు వ్యయాలు పెరగడంతో ధరలను సవరిస్తున్నట్టు టాటా మోటార్స్ వెల్లడించింది.

ఒక్క రోజులోనే సెటిల్‌మెంట్

- టీప్లస్1లోకి మొత్తం ఈక్విటీ స్టాక్స్
- రీట్, ఇన్విట్, గోల్డ్ బాండ్లు సైతం

న్యూఢిల్లీ: దేశీ స్టాక్ మార్కెట్లు సరికొత్త మైలురాయిని అందుకున్నాయి. శుక్రవారం(27న) నుంచి మొత్తం ఈక్విటీ విభాగంలో లావాదేవీలను ఒక్క రోజులోనే సెటిల్ చేసే ప్రక్రియకు తెరతీశాయి. దీంతో మార్కెట్లో నమోదయ్యే లావాదేవీలను మరుసటి రోజులోనే క్లియర్ చేస్తారు. అంటే షేరు లేదా నగదు బదిలీని పూర్తి చేస్తారు. ఈక్విటీ విభాగంలోని సెక్యూరిటీలలో ఈ నెల 27 నుంచి ట్రేడ్‌ప్లస్(టీప్లస్)1 సెటిల్‌మెంట్‌ను అమలు చేస్తున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్‌ఎస్‌ఈ తాజాగా పేర్కొంది. తద్వారా దేశీ మార్కెట్లు సరికొత్త రికార్డును సృష్టించాయి. ఇప్పటివరకూ టీప్లస్2 సెటిల్‌మెంట్ అమల్లో ఉంది. అంటే లావాదేవీ జరిగిన రెండు రోజుల్లో క్లియరింగ్‌ను చేపడుతున్నారు.




టీప్లస్1 సెటిల్‌మెంట్ వల్ల ఇన్వెస్టర్ల పెట్టుబడి సామర్థ్యాలు మెరుగుపడటంతోపాటు.. మొత్తం పరిశ్రమలో రిస్కులు తగ్గేందుకు వీలు చిక్కనుంది.

2021లోనే పునాది: నిజానికి టీప్లస్1 సెటిల్‌మెంట్‌కు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ 2021 సెప్టెంబర్ 7న గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2022 జనవరి 1 నుంచి ప్రవేశపెట్టేందుకు ఎక్స్ఛేంజీలను అనుమతించింది. ట్రేడింగ్ సభ్యులు, కస్టోడియన్లు తదితర మార్కెట్ మౌలిక సంస్థలు దశలవారీగా టీప్లస్1 అమలుకు తెరతీశాయి. 2022 ఫిబ్రవరి 25న కొత్త సెటిల్‌మెంట్‌ను ప్రారంభించాయి. 2023 జనవరి 27కల్లా ఈక్విటీ విభాగంలోని అన్ని సెక్యూరిటీలనూ ఒక్క రోజు సెటిల్‌మెంట్‌లోకి తీసుకువచ్చాయి. వీటిలో ఎస్‌ఎంఈ షేర్లు సహా ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్(ఈటీఎఫ్‌లు), రియల్టీ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్(రీట్‌లు), సావరిన్ గోల్డ్ బాండ్లు(ఎస్‌జీబీలు), ప్రభుత్వ సెక్యూరిటీలు, కార్పొరేట్ బాండ్లు చేరాయి. పలు అభివృద్ధి చెందిన మార్కెట్లలో ఇప్పటికీ టీప్లస్2 సెటిల్‌మెంటును అమలు చేస్తుండటం గమనార్హం!

టీప్లస్2 సెటిల్‌మెంట్‌కు ఫండ్స్

ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ: అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ సంస్థలు) ఫిబ్రవరి 1 నుంచి టీప్లస్2 విధానానికి మారిపోనున్నాయి. ప్రస్తుతం ఇవి టీప్లస్3 సెటిల్‌మెంట్ విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్స్ పథకం యూనిట్లను విక్రయించిన రోజు కాకుండా తర్వాతి మూడో పనిదినం రోజున బ్యాంకు ఖాతాకు నిధులు జమ అవుతున్నాయి. టీప్లస్2 విధానంలో విక్రయించిన రోజు కాకుండా, తర్వాతి రెండో పనిదినం (మార్కెట్లకు, బ్యాంకులకు) రోజున ఇన్వెస్టర్ల చేతికి నిధులు అందుబాటులోకి వస్తాయి. ఈ నెల 25 వరకు ఈక్విటీ మార్కెట్లలో టీప్లస్ 2 విధానం అమల్లో ఉంది. జనవరి 27 నుంచి టీప్లస్1 విధానం అమల్లోకి వచ్చింది. దీంతో



ఫండ్స్ సంస్థలు కూడా ఒక రోజు ముందుకు సెటిల్‌మెంట్‌ను మార్చుకోనున్నాయి. ట్రేడ్ అయ్యే ఈక్విటీ షేర్లు, ఎస్‌ఎంఈ షేర్లు, ఈటీఎఫ్‌లు, రీట్స్, ఇన్విట్‌లు, సావరీన్ గోల్డ్ బాండ్లు, గవర్నమెంట్ బాండ్లు టీ ప్లస్ 1 సెటిల్‌మెంట్ పరిధిలోకి వచ్చేశాయి. "ఈ ప్రయోజనాన్ని మా ఫండ్స్ ఇన్వెస్టర్లకు బదిలీ చేయాలనుకుంటున్నాం. కనుక ఈక్విటీ పథకాలకు టీప్లస్2 రిడెంప్షన్ (ఉపసంహరణ) చెల్లింపుల సైకిల్‌ను అమలు చేయనున్నాం" అని యాంఫీ చైర్మన్, ఎ.బాలసుబ్రమణియన్ తెలిపారు.

3 నెలల కనిష్టానికి సూచీలు

- మార్కెట్‌పై అదానీ గ్రూప్ షేర్ల అమ్మకాల ఒత్తిడి
- ప్రీ బడ్జెట్, వారాంతాపు అప్రమత్తత
- సెన్సెక్స్ 874 పాయింట్లు క్రాష్
- 287 పాయింట్లు క్షీణించిన నిఫ్టీ
- బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో విక్రయాల వెల్లువ



ముంబై: స్టాక్ మార్కెట్లో రెండోరోజూ అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. అదానీ గ్రూప్ సంస్థలపై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ నివేదిక మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. టీప్లస్1 సెటిల్‌మెంట్ ట్రేడింగ్ విధానం శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. వచ్చేవారం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశం కూడా జరగనుంది. ఈ పరిణామాణాలకు తోడు వారాంతపు రోజు కావడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ అమ్మకాలకు పాల్పడ్డారు. బాండ్లపై రాబడుల పెరుగుదల, క్రూడాయిల్ ధరల ఒడిదుడుకులు ఇన్వెస్టర్లను కలవరపెట్టాయి. బ్యాంకింగ్, మెటల్, ఫైనాన్స్ రంగ షేర్ల భారీ పతనంతో సెన్సెక్స్ 874 పాయింట్లు నష్టపోయి 59,307 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 287 పాయింట్లు క్షీణించి 17,604 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది మూడు నెలల కనిష్ట ముగింపు. అదానీ గ్రూప్ సంస్థలకు భారీగా రుణాలిచ్చాయన్న హిండెన్‌బర్గ్ నివేదిక నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు భారీగా నష్టపోయాయి. బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ రెండుశాతం, మిడ్‌క్యాప్ సూచీ 1.30% నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.5,978 కోట్ల షేర్లను విక్రయించారు. దేశీ ఇన్వెస్టర్లు రూ.4,252 కోట్ల షేర్లను కొన్నారు. మార్కెట్లు ముగిసే సమయానికి డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 81.49 వద్ద నిలిచింది.

ఇంట్రాడేలో రెండు శాతం క్రాష్

అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ..., రిపబ్లిక్ డే సెలవు రోజు తర్వాత దేశీయ మార్కెట్ నష్టంతో మొదలైంది. సెన్సెక్స్ 38 పాయింట్ల నష్టంతో 60,167 వద్ద, నిఫ్టీ 15 పాయింట్ల పతనంతో 17,877 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఆ తర్వాత అమ్మకాల వెల్లువతో ఒక దశలో సెన్సెక్స్ 1,231 పాయింట్లకు పైగా నష్టపోయి 58,975 దగ్గర, నిఫ్టీ 398 పాయింట్లు క్షీణించి 17,494 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. అయితే ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా, ఆటో షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు కొంతమేర నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి.

రెండు రోజుల్లో రూ.10.65 లక్షల కోట్ల నష్టం

గత రెండురోజుల్లో సెన్సెక్స్ 1,648 పాయింట్ల పతనంతో బీఎస్‌ఈలో 10.65 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.269 లక్షల కోట్లకు దిగివచ్చింది. నిఫ్టీ సైతం 514 పాయింట్లు క్షీణించింది.

అదానీ గ్రూప్ షేర్లపై అమ్మకాల ఒత్తిడి

హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికపై అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ ఇచ్చిన వివరణ, ఇన్వెస్టర్లలో నమ్మకం కలిగించలేకపోయింది. ఈ గ్రూప్‌నకు చెందిన మొత్తం ఏడు కంపెనీల్లో అదానీ టోటల్ గ్యాస్, అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ గ్రీన్ ఎనర్జీ 20% లోయర్ సర్క్యూట్, అదానీ విల్మార్, అదానీ పవర్ షేర్లు ఐదుశాతం లోయర్ సర్క్యూట్ వద్ద లాకయ్యాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్ షేర్లు వరుసగా 18%, 16% చొప్పున నష్టపోయాయి. ఇటీవల అదానీ గ్రూప్ విలీనం చేసుకున్న అంబుజా సిమెంట్స్, ఏసీసీ సిమెంట్స్ కంపెనీల షేర్లు సైతం 17%, 13% చొప్పున నష్టపోయాయి. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ నివేదిక నేపథ్యంలో గడిచిన రెండు రోజుల్లో అదానీ గ్రూప్ సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు రూ.4.17 లక్షల కోట్లు హరించుకుపోయింది.

ఎఫ్‌పీవోకు బిడ్స్

అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఎఫ్‌పీవోకు తొలి రోజు(27న) రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 4.7 లక్షల బిడ్స్ దాఖలయ్యాయి. 4.55 కోట్ల షేర్లను ఆఫర్ చేసింది. ఆఫర్‌కు ధరల శ్రేణి రూ. 3,112-3,276కాగా.. గడువు ఈ నెల 31న(మంగళవారం) ముగియనుంది. బీఎస్‌ఈలో షేరు 19 శాతం పతనమై రూ. 2,762 వద్ద ముగిసింది. చిన్న ఇన్వెస్టర్లకు కేటాయించిన 2.29 కోట్ల షేర్లకుగాను 4 లక్షల షేర్లకు దరఖాస్తులు వచ్చాయి. క్విబ్ విభాగంలో 1.28 కోట్ల షేర్లు ఆఫర్ చేయగా.. 2,656 షేర్లకు, నాన్ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల నుంచి 96.16 లక్షల షేర్లకుగాను 60,456 షేర్ల కోసం బిడ్స్ లభించాయి. బుధవారం యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 5,985 కోట్లు సమకూర్చుకున్న సంగతి తెలిసిందే.

మిలియన్ యూనిట్ల తయారీ మైలురాయి దాటిన కేటీఎం



హైదరాబాద్: ప్రపంచంలో నెంబర్ 1 ప్రీమియం మోటార్ సైకిల్ బ్రాండ్ కేటీఎం భారతదేశంలో మిలియన్ యూనిట్ల తయారీ మైలురాయిని అధిగమించింది. పుణేలోని బజాజ్ చకన్ ప్లాంట్ నుండి 1 మిలియన్ కేటీఎం మోటార్ సైకిల్- కేటీఎం అడ్వెంచర్ 390 విడుదలైంది. రికార్డు బైక్ ఆవిష్కరణ కార్యక్రమంలో బజాజ్ ఆటో ఎండీ, సీఈఓ రాజీవ్ బజాజ్, పియరర్ మొబిలిటీ ఏజీ (కేటీఎం మాతృ సంస్థ) సీఈఓ స్టీఫన్ పీరర్ (ఫొటోలో ఎడమ నుంచి కుడికి) తదితరులు పాల్గొన్నారు. ఆస్ట్రియన్ బ్రాండ్ కేటీఎం తన సబ్-400 సీసీ మోటార్‌సైకిళ్ల దేశీయ, ఎగుమతి యూనిట్ల తయారీకి బజాజ్ ఆటోతో భాగస్వామ్యాన్ని కొనసాగిస్తోంది. కేటీఎం ఇండియా 2014లో 1,00,000వ మోటార్‌సైకిల్‌ను, 2020లో 5,00,000వ మోటార్‌సైకిల్‌ను విడుదల చేసింది. కేవలం మరో మూడేళ్ల వ్యవధిలోనే కీలక మిలియన్ మైలురాయికి చేరుకోవడం గమనార్హం.

సాక్షి స్పోర్ట్స్



లక్ష్య సేన్ పరాజయం

ఇండోనేసియా మాస్టర్స్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. జకార్తాలో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్... మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో ఓడిపోయారు. ప్రపంచ 12వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-15, 10-21, 13-21తో మూడో ర్యాంకర్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలయ్యాడు. 62 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో లక్ష్య సేన్ తొలి గేమ్‌లో స్కోరు 15-15తో సమంగా ఉన్నపుడు వరుసగా ఆరు పాయింట్లు గెలిచి గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. అయితే క్రిస్టీ పుంజుకొని వరుసగా రెండు గేముల్లో గెలిచి విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో అశ్విని-తనీషా 13-21, 18-21తో యూకీ ఫకుషిమా-సయాక హిరోటా (జపాన్) చేతిలో ఓడిపోయారు.

చరిత్రకు చేరువగా...

అండర్-19 టి20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్



పోష్‌స్ట్రూమ్ (దక్షిణాఫ్రికా): ఇప్పటి వరకు భారత మహిళల క్రికెట్ జట్టు ఏ ఫార్మాట్‌లోనైనా విశ్వవిజేతగా నిలువలేకపోయింది. వన్డే ప్రపంచకప్‌లో రెండుసార్లు రన్నరప్‌గా, టి20 ప్రపంచకప్‌లో ఒకసారి రన్నరప్‌గా నిలిచింది. అయితే సీనియర్లకు సాధ్యం కాని ఘనతను సాధించేందుకు భారత జూనియర్ మహిళల జట్టు విజయం దూరంలో నిలిచింది. తొలిసారి నిర్వహిస్తున్న అండర్-19 టి20 ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్ చేరింది. శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 107 పరుగులు సాధించింది. భారత లెగ్ స్పిన్నర్ పార్శవి చోప్రా (3/20) కివీస్‌ను కట్టడి చేసింది. టిటాస్ సాధు, మన్నత్, షఫాలీ, అర్చన దేవి ఒక్కో వికెట్ తీశారు. అనంతరం భారత్ 14.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 110 పరుగులు చేసి గెలిచింది. శ్వేత సెహ్రావత్ (45 బంతుల్లో 61 నాటౌట్; 10 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీ చేసింది. రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్ మూడు పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించి ఆదివారం జరిగే ఫైనల్లో భారత్‌తో పోరుకు సిద్ధమైంది.

రన్నరప్‌తో 'గ్రాండ్' కెరీర్ ముగింపు

ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో సానియా-బోపన్న జోడీ ఓటమి



మెల్‌బోర్న్: తన గ్రాండ్‌స్లామ్ కెరీర్‌ను టైటిల్‌తో ముగించాలని ఆశించిన భారత మహిళా టెన్నిస్ స్టార్ సానియా మీర్జాకు నిరాశ ఎదురైంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సానియా మీర్జా-రోహన్ బోపన్న (భారత్) జోడీ రన్నరప్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో సానియా-బోపన్న ద్వయం 6-7 (2/7), 2-6తో టాప్ సీడ్ లూసీ స్టెఫానీ-రాఫెల్ మటోస్ (బ్రెజిల్) జోడీ చేతిలో ఓడిపోయింది. 87 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సానియా-బోపన్న తమ సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయారు. రన్నరప్ సానియా-బోపన్నలకు 89,450 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 51 లక్షల 97 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. వచ్చే నెలలో దుబాయ్‌లో జరిగే టోర్నీ తర్వాత సానియా టెన్నిస్ నుంచి వీడ్కోలు తీసుకోనుంది.

"నా కంట వస్తున్న కన్నీళ్లు ఆనందభాష్పాలే. నేనింకా మరో రెండు టోర్నమెంట్‌లు ఆడతాను. 2005లో నా గ్రాండ్‌స్లామ్ ప్రయాణం మెల్‌బోర్న్‌లోనే మొదలైంది. ఇదే వేదికపై నా గ్రాండ్‌స్లామ్ కెరీర్ కూడా ముగుస్తున్నందుకు సంతోషంగా ఉంది. నాకు 14 ఏళ్లు ఉన్నపుడు బోపన్న నా తొలి మిక్స్‌డ్ డబుల్స్ భాగస్వామి. అతనితోనే నా గ్రాండ్‌స్లామ్ చివరి మ్యాచ్ ఆడాను. నా జీవితంలో మంచి మిత్రుడు అతడే. నా కుమారుడు చూస్తుండగా గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడతానని ఊహించలేదు. నిజంగా ఈ క్షణం నాకెంతో ప్రత్యేకం. - సానియా మీర్జా

6 సానియా కెరీర్‌లో సాధించిన మొత్తం గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్స్. ఇందులో మూడు మహిళల డబుల్స్‌లో (మార్టినా హింగిస్‌తో 2016 ఆస్ట్రేలియన్ ఓపెన్, 2015 వింబుల్డన్, 2015 యూఎస్ ఓపెన్), మరో మూడు మిక్స్‌డ్ డబుల్స్‌లో (2009లో మహేశ్ భూపతితో ఆస్ట్రేలియన్ ఓపెన్, 2012లో మహేశ్ భూపతితో ఫ్రెంచ్ ఓపెన్, 2014లో బ్రెజిల్ ప్లేయర్ బ్రూనో సోరెస్‌తో యూఎస్ ఓపెన్) వచ్చాయి. మరో ఆరుసార్లు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో సానియా రన్నరప్‌గా నిలిచింది.



నేడు మహిళల సింగిల్స్ ఫైనల్
రిబాకినా X సబలెంకా
మధ్యాహ్నం గం. 2 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

భారత్ జోరుకు బ్రేక్

- తొలి గెలుపు రుచి చూసిన న్యూజిలాండ్
- టీమిండియాకు ఆల్‌రౌండ్ దెబ్బ
- మొదటి టి20 మ్యాచ్‌లో హార్దిక్ బృందం ఓటమి
- సుందర్ ఒంటరి పోరాటం
- రేపు లక్నోలో రెండో టి20

రాంచీ: ధోని ఇలాకాలో న్యూజిలాండ్ గెలుపు పండగ చేసుకుంది. మొదటి టి20లో 21 పరుగులతో గెలిచిన కివీస్ భారత పర్యటనలో తొలి విజయాన్ని సాధించింది. 'ఆల్‌రౌండ్ షో'తో టీమిండియా జోరుకు బ్రేకులేసింది. ముందుగా కివీస్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 176 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డరైల్ మిచెల్ (30 బంతుల్లో 59 నాటౌట్; 3 ఫోర్లు, 5 సిక్సర్లు), డెవాన్ కాన్వే (35 బంతుల్లో 52; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. వాషింగ్టన్ సుందర్ 2 వికెట్లు తీశాడు. తర్వాత భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులే చేసి ఓడిపోయింది. సుందర్ (28 బంతుల్లో 50; 5 ఫోర్లు, 3 సిక్సలు) భారత ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. సూర్యకుమార్ యాదవ్ (34 బంతుల్లో 47; 6 ఫోర్లు, 2 సిక్సలు) రాణించాడు. కివీస్ బౌలర్లలో బ్రేస్‌వెల్, సాన్‌ట్నర్, ఫెర్గూసన్ తలా 2 వికెట్లు తీశారు. రెండో టి20 రేపు లక్నోలో జరుగుతుంది.



మిచెల్

మిచెల్ మెరుపులు

అలెన్ (23 బంతుల్లో 35; 4 ఫోర్లు, 2 సిక్సలు), చాప్‌మన్ (0)... ఇలా వాషింగ్టన్ సుందర్ స్పిన్ ఉచ్చులో పడిన కివీస్‌ను కాన్వే ఆదుకున్నాడు. ఫిలిప్స్ (17; 1 ఫోర్)తో కలిసి జట్టు స్కోరును 100 దాటించాడు. 31 బంతుల్లో (7 ఫోర్లు, 1 సిక్స్) ఫిఫ్టీ పూర్తిచేసుకున్న కాన్వేను అర్ష్‌దీప్ అవుట్ చేశాడు. ఆ తర్వాత మిచెల్ ఆఖరిదాకా ఉండి మెరిపించిన మెరుపులతో న్యూజిలాండ్ మంచి స్కోరు చేసింది. 26 బంతుల్లో (2 ఫోర్లు, 5 సిక్సర్లు) మిచెల్ అర్ధ సెంచరీ సాధించాడు. అర్ష్‌దీప్ వేసిన చివరి ఓవర్‌లో మిచెల్ ఏకంగా 27 పరుగులు (6 (నోబాల్), 6, 6, 4, 0, 2, 2) సాధించడం విశేషం.

చెత్త షాట్లతో...

కష్టసాధ్యమైన లక్ష్యం ముందుంటే భారత టాపార్డర్ నిర్లక్ష్యంగా వికెట్లను పారేసుకుంది. ఇషాన్ కిషన్ (4), త్రిపాఠి (0), గిల్ (7) చెత్త షాట్లతో అవుటవ్వడంతో జట్టు 15/3 స్కోరు వద్ద కష్టాల పాలైంది. ఈ దశలో 'టి20 సూపర్ బ్యాటర్' సూర్యకుమార్, కెప్టెన్ హార్దిక్ పాండ్యా (20 బంతుల్లో 21; 1 ఫోర్, 1 సిక్స్) కాసేపు బాధ్యతగా ఆడటంతో ఆశలు రేగాయి. నాలుగో వికెట్‌కు 68 జతయ్యాక వరుస ఓవర్లలో సూర్య, పాండ్యా అవుట్ కావడంతో... అప్పటికింకా భారత్ 100 పరుగులైనా చేయకపోవడంతో ఓటమి ఖాయమైంది. అయితే సుందర్ (25 బంతుల్లో ఫిఫ్టీ; 5 ఫోర్లు, 3 సిక్సలు) మెరుపులతో భారత్ 150 మార్క్ దాటింది.



అతి'సుందర్' క్యాచ్

ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో వాషింగ్టన్ సుందర్ స్పిన్‌తో మాయ చేశాడు. క్యాచ్‌తో మంత్రముగ్ధం చేశాడు. రెండో బంతికి దంచేస్తున్న అలెన్‌ను సూర్య క్యాచ్‌తో పెవిలియన్ పంపాడు. ఆఖరి బంతికి చాప్‌మన్ డిఫెన్స్ ఆడే ప్రయత్నం చేశాడు. అక్కడే లేచిన బంతి నేలకు తాకుతుండగా... సుందర్ కుడివైపునకు డైవ్ చేస్తూ ఒంటిచేత్తో రిటర్న్ క్యాచ్ పట్టాడు. దీంతో స్టేడియం హోరెత్తింది. బ్యాటింగ్‌లోనూ సుందర్ మెరుపు ఫిఫ్టీ సాధించాడు. కానీ అతని 'ఆల్‌రౌండ్ షో' భారత ఓటమితో చిన్నబోయింది.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: అలెన్ (సి) సూర్య (బి) సుందర్ 35; కాన్వే (సి) హుడా (బి) అర్ష్‌దీప్ 52; చాప్‌మన్ (సి అండ్ బి) సుందర్ 0; ఫిలిప్స్ (సి) సూర్య (బి) కుల్దీప్ 17; మిచెల్ (నాటౌట్) 59; బ్రేస్‌వెల్ (రనౌట్) 1; సాన్‌ట్నర్ (సి) త్రిపాఠి (బి) మావి 7; ఇష్ సోధి (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 176. వికెట్ల పతనం:** 1-43, 2-43, 3-103, 4-139, 5-140, 6-149. **బౌలింగ్:** పాండ్యా 3-0-33-0, అర్ష్‌దీప్ 4-0-51-1, సుందర్ 4-0-22-2, దీపక్ 2-0-14-0, ఉమ్రాన్ 1-0-16-0, కుల్దీప్ 4-0-20-1, శివమ్ మావి 2-0-19-1.

భారత్ ఇన్నింగ్స్: గిల్ (సి) అలెన్ (బి) సాన్‌ట్నర్ 7; ఇషాన్ (బి) బ్రేస్‌వెల్ 4; త్రిపాఠి (సి) కాన్వే (బి) డఫీ 0; సూర్య (సి) అలెన్ (బి) సోధి 47; పాండ్యా (సి అండ్ బి) బ్రేస్‌వెల్ 21; సుందర్ (సి) డఫీ (బి) ఫెర్గూసన్ 50; హుడా (స్టంప్డ్) కాన్వే (బి) సాన్‌ట్నర్ 10; మావి (రనౌట్) 2; కుల్దీప్ (సి) కాన్వే (బి) ఫెర్గూసన్ 0; అర్ష్‌దీప్ (నాటౌట్) 0; ఉమ్రాన్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 155. వికెట్ల పతనం:** 1-10, 2-11, 3-15, 4-83, 5-89, 6-111, 7- 115, 8-127, 9-151. **బౌలింగ్:** డఫీ 3-0- 27- 1, బ్రేస్‌వెల్ 4-0-31-2, సాన్‌ట్నర్ 4-1-11 -2, ఫెర్గూసన్ 4-1-33-2, సోధి 3-0-30-1, టిక్నర్ 2-0-23-0.

పదోసారి ఫైనల్లో జొకోవిచ్



మెల్‌బోర్న్: తన కెరీర్‌లో 22వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కు, పదో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌కు సెర్బియా స్టార్ జొకోవిచ్ మరో విజయం దూరంలో ఉన్నాడు. శుక్రవారం జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో నాలుగో సీడ్ జొకోవిచ్ 7-5, 6-1, 6-2తో అన్‌సీడెడ్ టామీ పాల్ (అమెరికా)పై గెలిచాడు. మరో సెమీఫైనల్లో మూడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) 7-6 (7/2), 6-4, 6-7 (6/8), 6-3తో 18వ సీడ్ ఖచనోవ్ (రష్యా)పై నెగ్గి తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ చేరాడు. ఆదివారం జరిగే ఫైనల్లో సిట్సిపాస్‌తో జొకోవిచ్ తలపడతాడు. గతంలో తొమ్మిదిసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు చేరిన జొకోవిచ్ తొమ్మిదిసార్లూ టైటిల్ సాధించాడు.

బెల్జియంతో జర్మనీ 'ఢీ'

భువనేశ్వర్: పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్నీలో బెల్జియం, జర్మనీ ఫైనల్లోకి దూసుకెళ్లాయి. శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో మాజీ విజేత జర్మనీ 4-3తో ఆస్ట్రేలియాను ఓడించగా... 'షూటౌట్'లో డిఫెండింగ్ చాంపియన్ బెల్జియం 3-2తో నెదర్లాండ్స్‌పై గెలిచింది. ఆదివారం ఫైనల్ జరుగుతుంది.

ఆరో ఓటమితో అధోగతి!

'ప్లేట్' డివిజన్‌కు హైదరాబాద్



హైదరాబాద్ కెప్టెన్ తన్మయ్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టు పేలవ ప్రదర్శన చివరి మ్యాచ్ వరకూ కొనసాగింది. శుక్రవారం ముగిసిన ఎలైట్ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఢిల్లీ 9 వికెట్ల తేడాతో తన్మయ్ అగర్వాల్ సారథ్యంలోని హైదరాబాద్‌ను చిత్తుగా ఓడించింది. ఓవర్‌నైట్ స్కోరు 90/5తో ఆఖరి రోజు ఆట కొనసాగించిన హైదరాబాద్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 124 పరుగులకే కుప్పకూలింది. అనంతరం 47 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ వికెట్ నష్టపోయి ఛేదించింది. దీంతో సీజన్‌లో ఆడిన 7 మ్యాచ్‌లలో వరుసగా ఆరో ఓటమితో హైదరాబాద్ ఒక పాయింట్‌తో చివరి స్థానంలో నిలిచి 'ప్లేట్' గ్రూప్‌నకు పడిపోయింది. గ్రూప్ 'బి'లో మహారాష్ట్ర, ముంబై మ్యాచ్ 'డ్రా' కావడంతో ఆంధ్ర జట్టు 26 పాయింట్లతో క్వార్టర్ ఫైనల్ చేరింది. క్వార్టర్ ఫైనల్లో మధ్యప్రదేశ్‌తో ఆంధ్ర తలపడుతుంది.



- మధుమేహం, రక్తపోటు లాంటి జబ్బులకూ టీఎఫ్ఏ దోహదం
- ప్రపంచంలో జరిగే మరణాల్లో 60 శాతం గుండెపోటు మరణాలే
- వంటనూనెలు, వేపుళ్లు, ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల్లో ట్రాన్స్ ఫ్యాట్స్
- 2019లో భారత్‌లో 1.44 లక్షల మంది మృత్యువాత
- 2022 జనవరి నుంచి దేశంలో టీఎఫ్ఏ పూర్తిస్థాయి నియంత్రణ


చెడు కొవ్వుతో చేటు

గుండె జబ్బులు పెరిగిపోతున్నాయంటున్న డబ్ల్యూహెచ్ఓ

చెడు కొవ్వుతో గుండె జబ్బులు పెరిగిపోతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఆందోళన వ్యక్తం చేసింది. ట్రాన్స్ ఫ్యాటీ యాసిడ్స్ (టీఎఫ్ఏ) ఎక్కువగా ఉండే ఆహార పదార్థాల వినియోగం వల్ల గుండె రక్తనాళాల్లో చెడు కొవ్వు ఎక్కువగా పేరుకుపోతుంది. దీంతో గుండెపోటు వచ్చే ప్రమాదాలు ఉంటాయి. ప్రపంచంలో జరిగే మరణాల్లో 60 శాతం గుండెపోటు మరణాలేనని స్పష్టం చేసింది. 2019లో ప్రపంచ వ్యాప్తంగా అనారోగ్యకర ఆహారం వల్ల 80 లక్షల మంది చనిపోయారని పేర్కొంది. భారత్‌లో 2019లో నిర్వహించిన అధ్యయనం ప్రకారం ఆ ఏడాది 1.44 లక్షల మంది టీఎఫ్ఏ అధిక వాడకం వల్ల చనిపోయారు. ఆగ్నేయ ఆసియా దేశాల్లో టీఎఫ్ఏ అధిక వినియోగం వల్ల జరిగిన 1.78 లక్షల మరణాల్లో 80 శాతం భారత్‌లోనే సంభవించాయి. యూరప్‌లో 1.25 లక్షల మంది టీఎఫ్ఏ అధిక వినియోగం వల్ల చనిపోయారు. 2022లో నిర్వహించిన పరిశోధనలో ఉజ్బెకిస్తాన్ జనాభాలో 12 శాతం మందికి గుండె జబ్బులు ఉన్నాయని తేలింది. ప్రపంచంలో టీఎఫ్ఏ కారణంగా సంభవించే గుండెపోటు మరణాల్లో ఈజిప్ట్ మొదటి స్థానంలో ఉండగా, భారత్ 11వ స్థానంలో ఉంది.

సాక్షి, హైదరాబాద్

2019 లెక్కల ప్రకారం గుండెపోటు మరణాల్లో టీఎఫ్ఏ అధిక వాడకం వల్ల ఏఏ దేశాల్లో ఎంత శాతం మరణాలు సంభవిస్తున్నాయంటే..



ట్రాన్స్ ఫ్యాటీ యాసిడ్స్ అంటే

ట్రాన్స్ ఫ్యాటీ యాసిడ్స్ (టీఎఫ్ఏ) అంటే మనం తీసుకునే ఆహారం వల్ల ఏర్పడే కొవ్వు ఆమ్లాలు. ఇది చెడు కొవ్వు. అంటే ఇది ఆరోగ్యానికి హానికరమన్నమాట. గ్రాము ట్రాన్స్ ఫ్యాట్‌లో 9 కేలరీలుంటాయి. ఆహారంలో ఎక్కువగా ట్రాన్స్ ఫ్యాట్ ఉంటే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా ట్రాన్స్ ఫ్యాట్స్ రక్తనాళాల్లో కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. తద్వారా గుండె జబ్బులు సంభవిస్తాయి. వంటనూనెలు, వేపుళ్లు, ప్యాక్ చేసిన లేదా శుద్ధి చేసిన ఆహారాల్లో టీఎఫ్ఏ ఉంటుంది. కేకులు, కుకీలు, కూల్‌డ్రింక్స్ వంటి వాటిల్లోనూ ఉంటుంది. బరువు పెరుగుతారు. గుండె జబ్బులతో పాటు మధుమేహం, రక్తపోటు ఇతర ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. శరీరానికి ట్రాన్స్ ఫ్యాట్ అవసరం లేదు. దాన్ని నివారించాల్సిందే. ప్రతి వంద గ్రాముల ఫ్యాట్‌లో రెండు శాతానికి మించి, కేలరీల్లో 0.5 శాతానికి మించి ట్రాన్స్ ఫ్యాటీ యాసిడ్స్ ఉండకూడదని డబ్ల్యూహెచ్ఓ స్పష్టం చేసింది.

ఈ ఏడాది చివరకు టీఎఫ్ఏను పూర్తిగా నియంత్రించాలి

ప్రపంచలో 60 దేశాలు టీఎఫ్ఏ నియంత్రణ పరిధిలోకి వచ్చాయి. గతేడాది జనవరిలో భారతదేశం టీఎఫ్ఏ నియంత్రణను అమలులోకి తీసుకొచ్చింది. అన్ని దేశాల్లోనూ ఈ ఏడాది చివరికల్లా టీఎఫ్ఏను నియంత్రించాలని డబ్ల్యూహెచ్ఓ లక్ష్యంగా పెట్టుకుంది. ఆ ప్రకారం పాక్షికంగా శుద్ధిచేసిన వంట నూనెలను నిషేధించాలి. పూర్తిగా శుద్ధి చేసిన నూనెలను వాడాలి. ఆహార పదార్థాల్లో టీఎఫ్ఏ ఎంత శాతం ఉందో ప్యాకెట్లపై ముద్రించాలి. నూనె, కొవ్వు వినియోగాన్ని తగ్గించాలి. ప్రపంచవ్యాప్తంగా 46 దేశాల్లో ఇప్పటికీ 32 కోట్ల మంది టీఎఫ్ఏ అధికంగా ఉన్న ఆహారం తీసుకుంటున్నారు.



నివేదికలోని ముఖ్యాంశాలు..

- మెక్సికోలో కంపెనీలు టీఎఫ్ఏ నియంత్రణ సరిగా చేయకపోతే 40 వేల డాలర్లు జరిమానాగా నిర్ణయించారు.
- ఉజ్బెకిస్తాన్‌లో పామాయిల్ వినియోగం ఎక్కువగా ఉంది. 2000 సంవత్సరంలో ఆ దేశంలో ఏడాదికి 5 వేల టన్నులు వినియోగం ఉంటే, 2019 నాటికి అది పది రెట్లకు అంటే 50 వేల టన్నులకు చేరింది.
- ప్రపంచంలోని 500 కోట్ల మంది జనాభా టీఎఫ్ఏ నియంత్రణ అమలు చేయని దేశాల్లో ఉన్నారు. తద్వారా వాళ్లు ప్రమాదంలో ఉన్నారు.
- మన దేశంలో 2013లో టీఎఫ్ఏపై పాక్షిక నియంత్రణ మొదలైంది. 2020 డిసెంబర్‌లో ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) టీఎఫ్ఏను ఐదు శాతం నుంచి రెండు శాతానికి తగ్గించాలని నిర్ణయించింది. 2022 జనవరి నుంచి పూర్తిస్థాయి నియంత్రణ చేపట్టింది.
- ఎఫ్ఎస్ఎస్ఏఐ 2020 డిసెంబర్ నుంచి లేబొరేటరీల్లో టెస్టులు మొదలుపెట్టింది. ఇది ఆయిల్ కంపెనీలకు సాంకేతిక పరిజ్ఞానం అందిస్తుంది.
- అంతర్జాతీయంగా లేబొరేటరీలు ఎలా పనిచేస్తున్నాయనే దానిపై డబ్ల్యూహెచ్ఓ 2021లో ఒక అధ్యయనం చేసింది. మన దేశం సహా కెనడా, బ్రెజిల్, టర్కీ, పాకిస్తాన్, పోర్చుగల్, నైజీరియా, శ్రీలంక, చైనా, ఫిజీ, ఫిలిప్పీన్స్ తదితర దేశాల్లో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించే లేబొరేటరీలను పరిశీలించింది. ప్రతి లేబొరేటరీలో ఒకే విధమైన ఆహారపదార్థాలను పరీక్షించినా, వాటి ఫలితాలు మాత్రం ఒకేవిధంగా లేవని గుర్తించింది. దీంతో ఆహార పదార్థాలను పరిశీలించే లేబొరేటరీలపై అనుమానాలు నెలకొన్నాయి.

నూనె తగ్గించాలి..పండ్లు, కూరగాయలు తినాలి



వంటనూనెలు ఎక్కువ కాలం నిల్వ ఉండటానికి ట్రాన్స్ ఫ్యాట్స్ ఉపయోగపడతాయి. అందుకే వాటిల్లో ట్రాన్స్ ఫ్యాట్స్ ఉంటాయి. కాబట్టి సగటున మనిషి ఏ రూపంలోనైనా సరే రోజుకు 30 గ్రాములకు మించి వంటనూనెలను వాడకూడదు. ఆవిధంగా టీఎఫ్ఏ వినియోగం తగ్గించాలి. జంక్‌ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్ కూడా తగ్గించాలి. సహజ సిద్ధమైన తాజా ఆహారం తీసుకుంటే కూడా మనం ఈ సమస్య నుండి బయట పడొచ్చు. రోజూ 400 గ్రాములకు తగ్గకుండా కూరగాయలు, పండ్లు తినాలి. నూనె వేపుడులకు దూరంగా ఉండాలి. ఎక్కువసార్లు వేడిచేసిన నూనెలు వాడకూడదు. లేనిపక్షంలో ప్రతి ఐదుగురిలో ఒకరికి గుండె జబ్బు వస్తుందని డబ్ల్యూహెచ్ఓ హెచ్చరించింది.

– డాక్టర్ గుత్తా సురేష్, ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు

ప్రాంతీయ భాషల్లో తీర్పులు శుభపరిణామం

సుప్రీంకోర్టు తీర్పుపై జస్టిస్ నరసింహా వ్యాఖ్యలు

- కింది కోర్టుల్లో తెలుగులోనే తీర్పులు వెలువడాలి
- 'బార్ అండ్ బెంచ్' కార్యక్రమంలో ప్రసంగం



హెచ్‌సీఏఏ కార్యక్రమంలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహా. చిత్రంలో హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్‌భూయాన్

సాక్షి, హైదరాబాద్: అత్యున్నత న్యాయస్థానం తీర్పులను ప్రాంతీయ భాషల్లోకి అనువదించి ఇవ్వడం శుభ పరిణామమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహా వ్యాఖ్యానించారు. అలాగే, కనీసం జిల్లా కోర్టుల్లోనైనా స్థానిక భాషల్లో వాదనలు సాగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దీంతో తమ కేసులో ఏం జరుగుతోందో తెలుసుకునేందుకు కక్షిదారులకు కూడా ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం ఆంగ్లంలో వాదనలు సాగుతుండటంతో చాలామంది కేసు గురించి అర్థం చేసుకోలేకపోతున్నారని చెప్పారు. 'బార్ అండ్ బెంచ్' సంబంధాలపై హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ)ల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి జస్టిస్ నరసింహా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మన సొంత భాషలో న్యాయ విద్యాబోధనకు అవకాశం ఇవ్వాలన్నారు. 'న్యాయవాదులు మన భాష, మన సంస్కృతికి ప్రాధాన్యత ఇవ్వాలి. దీంతోపాటే ఆంగ్లంపై కూడా పట్టు సాధించాలి. పెండింగ్ కేసులను మాత్రమే కాదు.. రోజూ నమోదవుతున్న కేసులను కూడా సత్వరం పూర్తి చేయాలి. దీనికి బార్ అండ్ బెంచ్ సమన్వయంతో పని చేయాలి. అన్నదమ్ముల భూ పంచాయతీకి.. భార్యాభర్తల విడాకులకు.. దాదాపు 15 ఏళ్లకుపైగా సమయం పడుతుండటంతో కోర్టులంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించాలి' అని వివరించారు.

ఇక్కడి వారికి సుపరిచితుడు..

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మాట్లాడుతూ.. 'ప్రత్యేకంగా జస్టిస్ నరసింహా గురించి చెప్పాల్సిన అవసరం లేదు. తెలంగాణలో పుట్టి పెరగడమే కాదు.. న్యాయవాద వృత్తినీ ఇక్కడే ఆరంభించారు. ఇక్కడి న్యాయవాదులకు ఆయన సుపరిచితుడు. పలు కీలక కేసులను వాదించి సుప్రీంకోర్టు న్యాయవాదిగానూ పేరుతెచ్చుకున్నారు. రాజ్యాంగబద్ధమైన కేసుల్లో విజయం సాధించి.. న్యాయమూర్తిగా నియమితులయ్యారు' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు రఘునాథ్, కార్యదర్శులు మల్లారెడ్డి, నరేందర్, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పరిశోధనలు, ఆలోచనలకు పదును పెట్టాలి

- ఆవిష్కరణలు లేకపోవడంతో దేశీయంగా అంతర్జాతీయ స్థాయి ఉత్పత్తులు రావడం లేదు
- హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ టాక్ సిరీస్ ప్రారంభ కార్యక్రమంలో కేటీఆర్



ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: సాంకేతిక ప్రపంచంలో భారతదేశం తనదైన ముద్ర వేసినా ఆవిష్కరణలు లేకపోవడంతో దేశీయంగా అంతర్జాతీయస్థాయి ఉత్పత్తులు రావడం లేదని మంత్రి కేటీ రామారావు అన్నారు. దేశంలో ఆవిష్కరణల వాతావరణాన్ని బలోపేతం చేసేందుకు తమవంతుగా జరుగుతున్న ప్రయత్నంలో భాగస్వాములు కావాలని విద్యార్థులను ఆహ్వానించారు. హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ సిల్వర్ జూబ్లీ సందర్భంగా టాక్ సిరీస్‌ను ప్రారంభించిన కేటీఆర్ టెక్నాలజీ అభివృద్ధి–ఆర్థిక ప్రగతితో పాటు హైదరాబాద్‌కు సంబంధించిన పలు అంశాలపై ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడారు. 'సాంకేతిక ఆధారిత ఆవిష్కరణలపై పనిచేస్తున్న విద్యార్థులు, యువత దేశ భౌగోళిక ఆర్థిక సామాజిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగినపుడే విజయం సాధిస్తారు. నేటికీ భారత్ అభివృద్ధి చెందుతున్న పేదదేశంగా ఉందని గణాంకాలు చెప్తున్నాయి. భారత్‌కు వ్యవసాయం వంటి రంగాల్లో టెక్నాలజీ ఆధారిత పరిష్కారాలను చూపాల్సిన అవసరముంది. ఉన్నత విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ప్రపంచస్థాయి ఆవిష్కరణల కోసం సృజనాత్మకంగా ఆలోచించాలి. పరిశోధన, అభివృద్ధి రంగాలపై దేశంలో ఖర్చు పెంచాల్సిన అవసరముంది. ట్రిపుల్ ఐటీ లాంటి ఉన్నత విద్యాసంస్థల విద్యార్థులు తమ పరిశోధనలు, ఆలోచనలను మరింత పదును పెట్టాలి. పరిశోధన–అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చేలా పాఠ్య ప్రణాళికలు, విద్యా బోధన మార్చుకుంటే మెరుగైన ఫలితాలు సాధ్యం' అని కేటీఆర్ సూచించారు.

వచ్చే ఐదేళ్లలో వంద బిలియన్ డాలర్లకు లైఫ్‌సైన్సెస్

'హైదరాబాద్‌లో ఉన్న లైఫ్ సైన్సెస్ వాతావరణం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడుకొని ఉంది. ప్రస్తుతం 50 బిలియన్ డాలర్ల లైఫ్ సైన్సెస్ పరిశ్రమను 2028 నాటికి 100 బిలియన్ డాలర్ల స్థాయికి తీసుకు వెళ్లాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. భారతీయ యువత అన్ని రంగాల్లో వినూత్న ఆవిష్కరణల దిశగా పని చేయాలి. స్టార్టప్‌లు ఏర్పాటు చేసే యువత వాటిపై పెట్టుబడిదారులకు ప్రజెంటేషన్ ఇచ్చే విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. తమ ఉత్పత్తుల గురించి వివరించగలిగితే భారతీయ స్టార్టప్‌లలో అనేక అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయి.' అని కేటీఆర్ వివరించారు. అనంతరం ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రోబోటిక్స్, లాంగ్వేజ్ టెక్నాలజీ, కంప్యూటర్ విజన్, సస్టైనబిలిటీ, స్మార్ట్ సిటీస్ వంటి రంగాల్లో పలు స్టార్ట్ అప్స్ రూపొందించిన ప్రయోగాలు, ఉత్పత్తులను కేటీఆర్ పరిశీలించారు. సమావేశంలో ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ రాజిరెడ్డి, సభ్యులు జయేష్ రంజన్, అజిత్ రంగనేకర్, శ్రీని రాజు, చంద్రశేఖర్, ప్రొఫెసర్ లింగాద్రి తదితరులు హాజరయ్యారు.

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో శరత్‌చంద్రారెడ్డికి బెయిల్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో శరత్‌చంద్రారెడ్డికి రౌజ్ అవెన్యూ కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. శరత్ బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ విచారణ చేపట్టారు. శరత్‌చంద్రారెడ్డి నానమ్మ మృతిచెందారని, అంత్యక్రియలు, కర్మకాండల నేపథ్యంలో బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరపు న్యాయవాది కోరారు. ఈ దశలో శరత్‌కు బెయిల్ మంజూరు చేయద్దని ఈడీ వాదనలు వినిపించింది. వాదనల అనంతరం శరత్‌కు రూ.2లక్షల పూచీకత్తుతో 14 రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు.

కరోనా కేసుల్లేవ్

- తొలిసారి ఒక్క కేసు కూడా నమోదు కాలేదు
- ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో తొలిసారి శుక్రవారం ఒక్క కరోనా కేసు కూడా నమోదు కాలేదని ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు. ఒక్క రోజులో 3,690 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా.. ఎవరికీ కరోనా సోకలేదని ఆయన స్పష్టం చేశారు. కరోనా మొదలైనప్పటి నుంచి రాష్ట్రంలో రోజూ కేసులు నమోదయ్యేవని ఆయన గుర్తు చేశారు. ఈ ఏడాది జనవరిలో ఇప్పటివరకు గరిష్టంగా ఒక రోజులో 15 కేసులు నమోదు కాగా, తాజాగా కనిష్టంగా జీరో కేసులు నమోదయ్యాయని శ్రీనివాసరావు వెల్లడించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 8.41 కరోనా కేసులు నమోదైనట్లయింది. అందులో 8.37 లక్షల మంది కోలుకున్నారు. ఒక రోజులో 10,405 మంది కరోనా టీకా వేసుకున్నారు. వారిలో 9,800 మంది బూస్టర్ డోస్ తీసుకున్నారు.

ప్రపంచానికి భారత్ అజెండా

జీ–20 షేర్పా, నీతిఆయోగ్ మాజీ చైర్మన్ అమితాబ్ కాంత్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచంలోనే అతి ముఖ్యమైన జీ–20 సదస్సు అధ్యక్ష హోదాలో భారత్ పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని జీ–20 షేర్పా, నీతి ఆయోగ్ మాజీ చైర్మన్ అమితాబ్ కాంత్ తెలిపారు. స్టార్టప్ రంగం ప్రపంచానికి చేయగల మేలును దృష్టిలో ఉంచుకుని తొలిసారి భారత్ చొరవతో జీ–20 సదస్సులో స్టార్టప్ రంగానికీ స్థానం కల్పించామని శుక్రవారం విలేకరులతో అన్నారు. ఇందులో భాగంగా శనివారం హైదరాబాద్‌లో స్టార్టప్–20 ఎంగేజ్‌మెంట్ గ్రూప్ సమావేశాలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. స్టార్టప్‌లకు అంతర్జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టడం, కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదారులు, ఇన్నోవేషన్ ఏజెన్సీల మధ్య సమన్వయం కుదర్చడం ఈ స్టార్టప్–20 సమావేశాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ జీ–20 సదస్సుల ద్వారా అభివృద్ధి చెందిన దేశాలు ఒక అజెండాను సిద్ధం చేస్తే భారత్ అనుసరించేదని, తొలిసారి భారత్ ప్రపంచానికి అజెండాను నిర్దేశిస్తోందన్నారు.

ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ పార్శిల్ సేవలు షురూ

ఏఎం 2 పీఎం సర్వీసు ప్రారంభించిన ఎండీ సజ్జనార్

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా పంపే పార్శిళ్లు మరింత వేగంగా గమ్యం చేరేందుకు ప్రత్యేకంగా 'ఏఎం 2 పీఎం ఎక్స్‌ప్రెస్ పార్శిల్' సేవలను ఆర్టీసీ ప్రారంభించింది. ఈ సేవలను శుక్రవారం బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రారంభించారు. మధ్యాహ్నం 12 లోపు పార్శిల్ బుక్ చేస్తే అదే రోజు రాత్రి 9 గంటలలోగా గమ్యం చేరుస్తామని, మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 లోగా బుక్ చేస్తే మరుసటి రోజు మధ్యాహ్నం 12 లోగా గమ్యం చేరుస్తామని ఈ సందర్భంగా సజ్జనార్ వెల్లడించారు. ప్రస్తుతానికి ఈ సేవల పరిధిలో కేజీ బరువు వరకు మాత్రమే పార్శిళ్లను స్వీకరిస్తామని, ఆ పార్శిల్ విలువ రూ.5 వేలకు మించకూడదని తెలిపారు. సేవలకు సంబంధించిన సమాచారాన్ని 91546 80020 ద్వారా, www.trrtcparce.in ద్వారా తెలుసుకోవాలని కోరారు.

టీటీడీ మొబైల్ యాప్ ప్రారంభం

తిరుమల: భక్తులకు మరింత మెరుగైన డిజిటల్ సేవలు అందించేందుకు 'టీటీ దేవస్థానమ్స్' పేరుతో రూపొందించిన మొబైల్ యాప్‌ను టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. తిరుమల అన్నమయ్య భవనంలో చైర్మన్ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ భక్తుల కోసం ఇప్పటివరకు గోవింద మొబైల్ యాప్ ఉండేదని, దీన్ని మరింత ఆధునీకరించి మరిన్ని అప్లికేషన్లు పొందుపరచి నూతన యాప్‌ను రూపొందించామని తెలిపారు. ఈ యాప్ ద్వారా భక్తులు తిరుమల శ్రీవారి దర్శనం, సేవలు, వసతి, అంగప్రదక్షిణ, సర్వదర్శనం, శ్రీవారి సేవ బుక్ చేసుకోవచ్చన్నారు.

బైక్‌ను ఢీకొట్టి.. 10 మీటర్లు ఈడ్చుకెళ్లి..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం



బైక్‌ను ఢీకొన్న కారు

మల్యాల(చొప్పదండి): కారు బైక్‌ను ఢీకొని సుమారు పది మీటర్ల దూరం లాక్కెళ్లిన ప్రమాద ఘటనలో తీవ్రంగా గాయ పడిన ఇద్దరు దుర్మరణం చెందారు. ఓ యువకుడిని ఈడ్చుకెళ్లడంతో రోడ్డంతా మాంసపు ముద్ద, రక్తపు మరకలతో గగుర్పొడిచేలా తయారైంది. ఈ ఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కరీంనగర్ జిల్లా మానకొండురు మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ లతీఫ్(32) అతడి స్నేహితుడు మహమ్మద్ హమీద్ ఖాన్(28)తో కలిసి ఈనెల 26న జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి బైక్‌పై వెళ్లారు. గురువారం అర్ధరాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. మల్యాల మండలం ముత్యంపేట శివారులోకి రాగానే.. జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై దిగువ కొండగట్టు వద్ద వారి బైక్‌ను ఎదురుగా వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. కారు చక్రాల్లో బైక్ చిక్కుకోవడంతో పది మీటర్ల దూరం లాక్కెళ్లింది. బైక్ నడుపుతున్న హమీద్‌ఖాన్ కుడికాలు రక్తపు ముద్దలతో రోడ్డంతా తడిసింది. అబ్దుల్ లతీఫ్ ఎగిరిపడి తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్స్‌లో ఇద్దరినీ జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో హమీద్‌ఖాన్ మృతిచెందారు. అబ్దుల్ లతీఫ్ ఖాన్ పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. లతీఫ్ సోదరుడు అబ్దుల్ రఫీక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కారును నడిపిన వ్యక్తి జగిత్యాలకు చెందిన ఎర్ర సాయివర్ధన్‌గా గుర్తించారు.

డబ్బింగ్ కళాకారుడు శ్రీనివాస మూర్తి కన్నుమూత



సాక్షి, చెన్నై: ప్రముఖ డబ్బింగ్ కళాకారుడు శ్రీనివాస మూర్తి (56) మృతి చెందారు. చెన్నైలో శుక్రవారం గుండెపోటుతో ఆయన తుది శ్వాస విడిచారు. తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో ప్రముఖ డబ్బింగ్ కళాకారుడిగా కొనసాగుతున్నారు. విక్రమ్‌కు 'అపరిచితుడు', సూర్యకు 'సింగం'సిరీస్, '24', మోహన్‌లాల్‌కు 'జనతా గ్యారేజ్', జయరామ్‌కు 'అల వైకుంఠపురంలో'.. ఇలా పలువురు ప్రముఖ నటులకు డబ్బింగ్ చెప్పారు. అలాగే రాజశేఖర్ హీరోగా నటించిన ఎన్నో సినిమాలకు ఆయన గాత్రం అందించారు. ఈ ఏడాది జనవరి 11న విడుదలైన తమిళ చిత్రం 'తునివు' తెలుగు వెర్షన్ 'తెగింపు'లో అజిత్ పాత్రకు తెలుగు డబ్బింగ్ చెప్పింది కూడా శ్రీనివాసమూర్తే. పలు టీవీ సీరియళ్లకు రచయితగా కూడా చేశారు. ఈమధ్యనే గుండెకు సర్జరీ చేయించుకున్న ఆయన కోలుకున్నాక తిరిగి తన కార్యకలాపాలు నిర్వహిస్తూ వచ్చారు. అయితే శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ని చెన్నైలోని విజయ హాస్పిటల్‌కి తీసుకెళ్లగా, గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. ఆయన మృతి పట్ల తెలుగు, తమిళ సినిమా పరిశ్రమ ప్రముఖులు, డబ్బింగ్ ఆర్టిస్టులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీనివాసమూర్తికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

టీఆర్ఆర్ మెడికల్ కాలేజీకి నోటీసులు

సాక్షి, హైదరాబాద్: టీఆర్ఆర్ మెడికల్ కాలేజీకి కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటీసులు జారీ చేసింది. 2021–22 వైద్య విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో మూడు మెడికల్ కాలేజీల్లో మొదటి ఏడాది ఎంబీబీఎస్, వాటిల్లోని రెండు కాలేజీల్లో పీజీ మెడికల్ అడ్మిషన్లను జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) రద్దు చేసిన సంగతి తెలిసిందే. అందులో టీఆర్ఆర్ కాలేజీ కూడా ఉంది. అయితే అక్కడి విద్యార్థులను మరో 13 ప్రైవేట్ కాలేజీల్లో సర్దుబాటు చేసినా, వారి ఫీజులను నిబంధనల ప్రకారం ఆయా కాలేజీలకు బదిలీ చేయడంలో టీఆర్ఆర్ యాజమాన్యం విఫలమైందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీనిపై కాళోజీ విశ్వవిద్యాలయానికి తల్లిదండ్రులు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన వర్సిటీ వీసీ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి ఆ కాలేజీకి తాజాగా నోటీసులు జారీ చేశారు. విద్యార్థులను సర్దుబాటు చేసిన ఇతర కాలేజీలకు వారి ఫీజును బదిలీ చేయాలని ఆయన ఆదేశించారు. మరోవైపు విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం టీఆర్ఆర్ కాలేజీ ముందు ధర్నా నిర్వహించారు. పురుగు మందుల డబ్బాలు పట్టుకొని తమకు ఇదే గతి అని పేర్కొన్నారు. టీఆర్ఆర్ కాలేజీ నిర్వాకం వల్ల తమ పిల్లలు ఈ విద్యా సంవత్సరం నష్టపోయే పరిస్థితి వచ్చిందని వారు పేర్కొన్నారు. తాము చెల్లించిన ఫీజును వెనక్కి ఇచ్చేయాలని, ప్రభుత్వం వెంటనే టీఆర్ఆర్ కాలేజీపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

జమున మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటు: మంత్రి తలసాని

సాక్షి, హైదరాబాద్: అలనాటి ప్రముఖ నటి జమున మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటు అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మరణం తనను కలిచి వేసిందన్నారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు జమున మృతి పట్ల సంతాపం ప్రకటించారు. జమున ఆత్మకు శాంతి చేకూరాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. వామపక్ష పార్టీల నేతలు నారాయణ, తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అరవింద్‌కుమార్ సంతాపం ప్రకటించారు.

బీజేపీ కార్యాలయంగా రాజ్‌భవన్: భాను ప్రసాద్

- రాజ్యాంగ పదవుల్లో ఉంటూ రాజ్యాంగేతర శక్తిలా మారుతున్నారు
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పర్యటిస్తే తెలంగాణ అభివృద్ధి తెలుస్తుంది

సాక్షి, హైదరాబాద్: రాజ్‌భవన్‌ను బీజేపీ కార్యాలయంలా మార్చకూడదని, గవర్నర్ తమిళిసైకి ప్రజాసేవపై ఆసక్తి ఉంటే ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల్లోకి వెళ్లాలని ఎమ్మెల్సీ టి.భానుప్రసాద్ అన్నారు. రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉంటూ రాజ్యాంగేతర శక్తులుగా గవర్నర్లు ఎదుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో శుక్రవారం భాను ప్రసాద్ మీడియాతో మాట్లాడారు. రాజ్‌భవన్‌లో జరిగిన ఎట్‌హోమ్ కార్యక్రమానికి తనకు ఆహ్వానం అందలేదన్నారు. రాజ్‌భవన్ బీజేపీ కార్యాలయాన్ని తలపించిందని, బీజేపీ నేతలందరూ ఎట్‌హోమ్‌లో కనిపించారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు అనుసంధానకర్తగా ఉండాల్సిన గవర్నర్లు పదవికి మచ్చ తెచ్చేలా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రధాని మోదీ, తెలంగాణ గవర్నర్‌కు విభేదాలు ఉన్నట్లు కనిపిస్తోందని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గవర్నర్ పర్యటిస్తే తెలంగాణ సాధించిన అభివృద్ధి ఎంత గొప్పగా ఉందో తెలుస్తుందని ఎమ్మెల్సీ భాను ప్రసాద్ అన్నారు.

రాజ్‌భవన్‌లు మోదీ మహల్‌లా తయారయ్యాయి

రాష్ట్రాల్లోని రాజ్‌భవన్‌లు మోదీ మహళ్లలా ప్రధాని మార్చుకున్నారని శాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ విమర్శించారు. తెలంగాణ అభివృద్ధిని వివిధ రాష్ట్రాల సీఎంలు ప్రశంసిస్తున్నా గవర్నర్ తమిళిసై మాత్రం విషం కక్కుతున్నారని మండిపడ్డారు.

స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్ జయప్రదం చేయాలి: తరుణ్‌చుగ్

సాక్షి, హైదరాబాద్: వచ్చేనెలలో పార్టీపరంగా నిర్వహిస్తున్న స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లను ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ పిలుపునిచ్చారు. వచ్చే నెల 10 నుంచి 25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా శక్తి కేంద్రాల వారీగా (3,4 పోలింగ్ బూత్‌లు కలిపి ఒక శక్తి కేంద్రం) ఆయా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి పార్టీ కార్యాలయంలో ఈ సమావేశాలకు చేస్తున్న సన్నాహాలను తరుణ్‌చుగ్, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమీక్షించారు. ఫిబ్రవరి 10 నుంచి 25 వరకు (16 రోజుల పాటు) రోజుకు 600 చొప్పున సమావేశాలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని రాష్ట్రనేతలకు తరుణ్‌చుగ్ దిశానిర్దేశం చేశారు. ఈ మీటింగ్స్ నిర్వహణకు జనసమీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టకుండా, స్థానికంగా స్వచ్ఛందంగా వచ్చే వారితోనే ఈ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, స్ట్రీట్‌కార్నర్ మీటింగ్ సమన్వయ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న రాష్ట్రపార్టీ ఉపాధ్యక్షుడు డా.కాసం వెంకటేశ్వర్లు, కార్యదర్శి కొల్లి మాధవి తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.